ఉత్తరరాఘవము

ఇది

బలిజేపల్లి లక్ష్మీకాంతకవిచే

రచింపఁబడి

ప్రకటింపఁబడినది.

మొదటికూర్పు 2000 ప్రతులు.

చంద్రికా ముద్రాక్షరశాల, గుంటూరు.

 [రు. 1-4-0.

ఈ నాటకమునందలి పాత్రలు.

—: పురుషులు :—

శ్రీరాముడు
లక్ష్మణుడు
భరతుడు
కంచుకి
అష్టావక్రుడు
సూతుడు
ప్రతీహారి
దుర్ముఖుడు
వాల్మీకి
,, ఇద్దరు శిష్యులు
విప్రుడు
జనార్దనభట్టు
నారాయణభట్టు
శంబుకుడు
దివ్యపురుషుడు
కుశుడు
లవుడు
వటువులు
జనకుడు
చంద్రకేతుడు
సూత్రధారుడు

—: స్త్రీలు :—

సీత
విప్రునిభార్య
అనసూయ
మురళ
వాసంతి
అరుంధతి
కౌసల్య
పృథ్వి
భాగీరథి

శ్రీ రామచంద్ర పరబ్రహ్మణేనమః

— విజ్ఞప్తి —

సహృదయులారా! చిరకాలముక్రిందటనే ఉత్తరరామకథను స్వతంత్రనాటకముగా వ్రాసితిని; కాని భవభూతిమహాకవి యుత్తర రామచరితమందలి యద్భుతకథాసంవిధానముం గూర్చి చర్చించుకొను కొలంది నా నాటకమును బ్రకటింపవలయునను నుత్సాహమే లేకుండెను. ఈనిరుత్సాహముతో నూరకుండక యామహాకవినాటకమును దెనిఁగింప మొదలిడి చాలవరకు ముగించితిని. అవకాశమొదవిన ట్లక్కడక్కడ ననేకుల కనేకపర్యాయములు తెనిఁగించినభాగములను స్వతంత్రించి వ్రాసిన భాగములనుగూడ వినిపించితిని. ముద్రణకుఁబూర్వమే వీనిలోని కొన్నిపద్యముల నెందఱో కంఠపాఠముచేసి చదువుచుండిరి. విడివిడిగా నీరెండుభాగముల రెండుసంపుటములుగాఁ బ్రకటింపుమని కొందఱును, కొంతప్రయత్నముతోనైనఁ బ్రదర్శించుట కనుకూలముగా నీ రెండు సంపుటములలోని భాగములను గథాసంవిధానమునం దౌచితిని బాటించి యనుసంధించి యొకసంపుటముగానే ముద్రింపుమని కొందఱును నాకు సలహానిచ్చిరి. ఈరెండవపద్ధతి కొన్నికారణములచే నాకు నచ్చినది. ఏమన, ఒకకథయే రెండుగ్రంథములుగా ముద్రించుట ధనవ్యయమగు ననియు, ధనవ్యయమునకోర్చుకొన్నను నిదివరకుండిన మహామహుల కేవలాంధ్రీకరణములముందుఁ బాఠకులకైనను నాయది యేమంత రాణించుననియు, నిజమైన నాటకసారస్వత కళాప్రదర్శనమునందు సమర్థులయ్యుఁ బామర రంజనమునకై యేపార్సీమట్లతోడనో విదేశీయ విజాతీయ రుచులతో బయస్కోపుప్రదర్శనముల ననుకరించి కాలక్షేపముచేయు నిప్పటినాటకపుకంపెనీలవా రీవరకుండిన యుత్తమోత్తమములగు నాంధ్రీకృతోత్తరరామచరితముల నాడుటకే వెనుకాడుచున్నప్పుడు నాయాంధ్రీకరణమును మాత్రము ప్రదర్శింప సాహసింతురాయనియు, నంత పోడిమ యీకంపెనీలకుఁ గలిగినప్పు డున్నయాంధ్రీకరణములే చాలుననియు నూహించుకొని భవభూతియనుసరణమును నాస్వతంత్రరచనయు జోడించి యొక

సంపుటముగానే ముద్రించితిని. ఇదియైనను బాల్యమిత్రులవారికంతగా నక్కఱకురాదు గాని, నాటక సారస్వతకళాసౌధము నారోహింపఁబ్రయత్నించువారికి మొదటి మెట్టుగానైన నుపయోగించునని నానమ్మకము. ఇట్లు జోడించుటలో భవభూతికథ యించుకంత మార్చవలసివచ్చినది. లక్ష్మణుఁడు సీతను వాల్మీకాశ్రమప్రాంతమున విడిచిపోయినకథను భవభూతి ప్రత్యక్షముగాఁజూపక, తన ద్వితీయాంకప్రారంభమున నొక విష్కంభములో నాత్రేయీవాసంతికలచేఁ జెప్పించినాఁడు. అందు సీత ప్రసవవేదనకోర్వఁజాలక గంగలో దుమికినట్లును, అందుఁ గుశలవులఁ గనినట్లును పృథ్వీభాగీరథు లామెను బోషించినట్లును, వారే పాలువిడిచిన పిల్లలను వాల్మీకికి నొప్పగించినట్లును జెప్పించినాఁడు. సీతామాహాత్మ్యమును బ్రకటించుటకై ఆమెకు లోకాంతరావాసమును, అందలౌకికదేవతాపోషణమును గల్పించి, సీతారామపునస్సంయోగమువరకుఁగూడఁ గుశలవులకైనను సీత తమతల్లియని తెలియకుండనుంచి యద్భుతరసమును బ్రదర్శించినాఁడు. సీతను లక్ష్మణుఁడు వాల్మీకాశ్రమమునడించు కథ ప్రదర్శనమునకు యోగ్యముగనుండునని నేను ప్రత్యక్షముగా రెండవయంకమునఁ జూపించినను భవభూతి పరమోద్దేశములకు భంగము రాసీయ లేదని చదువరులు పరికింతురుగాక. భవభూతిమహాకవిహృదయమును వెల్లడించుటలో నావంటివాని కేలోపములు లేకుండుట యొక్క గుణమేకాని యుండుట యంతలోపముకాదు. నాగ్రంథమునఁ బొరపాటున నేని రస మెందేని బొసంగినచో నానందింతురుగాక!

నాటకసామాజికులు వారివారి సమర్థతల ననుసరించి 1,2,3,6,7,8,9 అంకములఁగాని 1,2,5,6,7,8,9 అంకములఁగాని ప్రదర్శించుకొనవచ్చును.

ఇట్లు,
విద్వజ్జనవిధేయుఁడు,
బలిజేపల్లి లక్ష్మీకాంతం.

గుంటూరు,
15-12-23.

— ప్రస్తావన. —

గీ॥ ఆదిమకవీంద్రులకు నభివాదనంబు
విమలభక్తి నిదే సమర్పించుకొందు;
అమృతయును, నాత్మకలయునై యలరు వాణి
నిత్యకల్యాణి మాకు రాణించుకొఱకు ॥

(నాంద్యంతమున సూత్రధారుండు.)

అతివిస్తరమేల? ఆర్యమిశ్రులారా! వినియుందురుకదా, మహానుభావుని, కాశ్యపుని, శ్రీకంఠపదలాంఛనుని, పదవాక్యప్రమాణతత్త్వజ్ఞుని జాతూకర్ణీపుత్రుని భవభూతియను మహాకవిని; వశీకృతవాణియగు తత్కవిబ్రహ్మచే గీర్వాణభాషలో రచియింపఁబడి, విదర్భదేశములోని పద్మనగరమునందుఁ గాళప్రియనాథుని యుత్సవసమయమునఁ బ్రదర్శింపఁబడి విశ్వవిఖ్యాతిం బడసిన యా "ఉత్తరరామచరిత" నాటకము"గొలఁదిమార్పులతో నాంధ్రమున నేఁడు మీ యెదుటఁ బ్రదర్శింప నెంచితిమి. కావున సావధానమున నవధరింతురుగాక!

కార్యవశమున నే నిప్పుడయోధ్యాపురవాసినయి రామసమకాలికుఁడనైతిని (అంతటఁ గలయఁజూచి) ఓహో! ఏమిది పౌలస్త్యకులధూమకేతువగు శ్రీరామసార్వభౌముని పట్టాభిషేకసమయము కదా! రాత్రిందివము లవిచ్ఛిన్నముగ మహానందనాందీవాదములతో సందడించు నీ చత్వరస్థానంబులేలకో చారణవ్యాపారములు లేక మాటుమణఁగి యున్నవి.

నటుఁడు—(ప్రవేశించి) భావా! ఎఱుఁగవా యేమి? ఈ యుత్సవములెల్ల నెవరి నారాధించుటకై యిన్ని దినములు జరిగెనో యట్టి లంకాసంగ్రామమిత్రులగు వానర, రాక్షసులను, నానాదిగంతాగతులగు పూజ్యులగు బ్రహ్మర్షి రాజర్షి సత్తములను, నెవరియిండ్లకు వారిని మహారాజుగారు పంపివేసినారుకదా; మఱియు నిప్పుడు,

గీ॥ అల్లునిమఖంబుగనఁదగియాశ్రమమున। కరిగిరవనిసుతల్లులందఱునరుంధ
తీసతీమణి వెనువెంట, దేశికేంద్రుఁ। డలవశిష్ఠుఁ డధిష్ఠాతయై మెలంగ।

సూత్ర—భావా, విదేశీయుఁడఁగాన నడుగుచున్నాను. అల్లుఁ డెవ్వరు?

నటు— గీ॥ దశరథున కుద్భవించె శాంత యనుకన్య
రోమపాదుండు ముద్దార నామెం బెనిచె
ధర్మపత్నిగ నల విభాండకసుతుండు
ఋష్యశృంగుండు దానిఁ బరిగ్రహించె॥

ఆయల్లుఁడే యిప్పుడు ద్వాదశవార్షిక యజ్ఞమును బ్రారంభించినాఁడు. పూర్ణగర్భిణియగుటచేఁ గోడలిని సీత నింటనే విడిచి తప్పనివిధిగాఁ బెద్దలందఱు యాగమున కేగిరి.

సూత్రి—ఆగోడవయంతయు మనకేల? పద. రాజద్వారము నాశ్రయించి మన కులధర్మము ననుసరింతము.

నటు—ఆలాగైన మహారాజుకొఱకుఁ బరిశుద్ధమైన స్తోత్రపద్ధతి నేదేని నిర్ణయింపుము.

సూత్ర—మారిషా!

గీ॥ ఎల్లవిధముల నుతియింపఁ బేల శంక?
తప్పులెన్నుట వెట్లును దప్పదింక;
యువతులం దెట్లొ యట్టులే కవితలందు
సాధుతానిర్ణయమున దుర్జనులు జనులు॥

నటు—కడుంగడు దుర్జను లనుము.

గీ॥ జానకీదేవిఁ గూర్చియే జనులు లేనిపోని యపనిందలను దలమోపినారు
హేతువింతకు రక్కసునింట నుంట, వహ్ని పరిశుద్ధిమాట యబద్ధమంట.

సూత్రి—ఈలాటికింవదంతి మహారాజు చెవిని సోఁకెనని కొంపమునుఁగునే!

నటు—కాని సర్వథా వేల్పులును ఋషులును శ్రీయమాపాదింతురు గాక! (పరిక్రమించి) మహారాజుగా రిప్పు డేమనుచున్నారో? (విని) ఇట్లనుకొనుచున్నారు.

మ॥ అనుఁగుంగూఁతును నల్లునిం గన విదేహాధీశుఁడే తెంచి, మ
న్నన నిన్నాళ్ళు మహోత్సవంబుల మహానందంబునన్ దీర్చి క్ర
న్నన నేఁడే తనయింటికేగెనని వంతంగొన్న సీతన్ బ్రియం
బునఁ దేర్పం బ్రభు వేగె వాసభవనంబుం గొల్వుఁ జాలించుచున్॥

(ఇరువురు నిష్క్రమింతురు.)

—♦ ఇది ప్రస్తావన. ♦—

శ్రీరామచంద్ర పరబ్రహ్మణేనమః.

ఉత్తర రాఘవము.

ప్రథమాంకము.

(శ్రీరాముఁడును సీతయు నుపవిష్టులై యుందురు.)

రాము—దేవీ! వైదేహీ! ఊఱడుము. మనపైఁ బ్రేమలేకయా మీ తండ్రిగారు వెడలిపోయినది? నిత్యకర్మానుష్ఠాన తత్పరులయిన వారికి, స్వేచ్ఛావర్తనము సాగివచ్చునా? ఆహితాగ్నుల గృహస్థ ధర్మ మాచారభంగ సందేహములతో ననుక్షణము సంకట మైనదని యెఱుంగవు ?

సీత—ఎఱుంగుదును ; అయినను బంధుజనవియోగములు మనస్సుల వ్యాకులపెట్టక మానవుకదా.

రాము—ప్రేయసీ; ఇవియే సంసారములోని . భావములు హృదయముల విదారించునవి. వీని నేవగించియే జ్ఞాను లరణ్యముల విశ్రమింతురు.

కంచుకి—(ప్రవేశించి) రామభద్రా! (అని శంకించి) మహారాజా!

రాము—ఆర్యా! తండ్రిగారి పరిజనము నన్ను "రామభద్రా" అని పిలుచుటయే నాకు ముచ్చట, అలవాటు తప్పింపకుము.

కంచుకి—ఋష్యశృంగాశ్రమమునుండి అష్టావక్రులు దయచేసినారు.

సీత—అభ్యంతర మేమి!

రాము—వెంటనే ప్రవేశపెట్టుము.

అష్టా—(ప్రవేశించి) మీకు శుభమగుఁగాక !

రాము—అభివందనము. ఇటు దయచేయుఁడు.

సీత—వందనము. కుశలమే కదా పెద్దలందఱకిని మా వదినె శాంతమ్మకును?

రాము—నిర్విఘ్నముగ సాగుచున్నదా యజ్ఞము ?

సీత—అయ్యో ! వారు మమ్ముఁ దలంచుచుందురా ?

అష్టా—దేవీ ! భగవంతుఁడు వసిష్ఠుఁడిట్లు నిన్నుఁగూర్చి చెప్పుమనియె.

సీ॥ వివిధప్రజారాధ్య ♦ విశ్వంభరాదేవి కడుపారఁగా నిన్నుఁ ♦ గన్న తల్లి
అపరప్రజానాథుఁ ♦ డని జగన్నుతిగన్న జనకరాజర్షి నీ ♦ యనుఁగుఁదండ్రి
భువనబాంధవుఁడు మే ♦ మును వంశగురులమౌ నలరావవారి కో ♦ డలవు నీవు
మనుకులాలంకార ♦ మనకు రామునకు, గుణాభిరామునకు న ♦ ర్ధాంగివీవు

గీ॥ అమ్మరో! యింతకంటె సం ♦ పాద్యమైన। శ్రేయ మేయ్యది గురులమా ♦ శీర్వదింప
రాఘవధురంధరుల సుపు ♦ త్రకులఁ గాంచి। వీరమాతృవుతల్లివై ♦ వెలయుము తల్లి!॥

రాము—దేవీ ! అనుగ్రహింపఁబడితిమి.

అష్టా—రామభద్రా! భగవతి యరుంధతియు శాంతయు పదే పదే నీకుఁ జెప్పుమనిన సందేశమిది. "వేవిళ్లగుటచే జానకి యేమేమి యభిలషించుచుండునో వానిని వెంటనే నెఱవేర్చుచుండుము" అని.

రాము—అలాగుననే ; కోరినదే తడవుగా.

అష్టా—వత్సా! జానకీ! నీయాఁడుబిడ్డయు ఋష్యశృంగులును నీకుఁ బలుమాఱుఁ జెప్పిన దిది. "అమ్మాయీ! నీవోపలేనిదానవగుటచే యజ్ఞమునకు నిన్నుఁ దోడ్కొని రాకుంటిమి. అబ్బాయిని రామభద్రుని నీవినోదముకొఱకే నీయొద్దవిడిచివచ్చితిమి. పుత్రపూర్ణోత్సంగవగు నాయుష్మతిని నిన్నుఁజూచి యానందింపఁగలము." అని

రాము—(చిఱునగవుతో) తథాస్తు. వసిష్ఠభగవానులు నాకేమైన సందేశ మనుగ్రహించిరా?

అష్టా—ఇదిగో వినుము.

గీ॥ అల్లునిముఖంబు, తీరమి ♦ యయ్యె మాకు
బాలుఁడవు, నీకుఁ గోత్ర భూ ♦ పాలనంబు
జనుల రంజించి కాంచు య ♦ శంబె ధనము
కంటెఁ బ్రాణంబుకంటె యో ♦ గ్యంబుమీకు ॥

రాము — భాగ్యము.

గీ॥ దేశజనరంజనక్రియా ♦ దీక్షయందు
స్నేహమునుగాని, దయగాని ♦ స్వీయమైన
సౌఖ్యమునుగాని కడకు నీ ♦ జనకసుతను
గాని విడనాడుచో వెను ♦ కాడఁబోను ॥

సీత — ఆహా! కావుననే యార్యపుత్రులు రఘువంశధురంధరులు-

రాము — ఎవరక్కడ? అష్టావక్రుని విశ్రమింపఁజేయుఁడు.

అష్టా — (లేచి పరిక్రమించి) ఓహో! చిరంజీవి లక్ష్మణుఁడరుదెంచినాఁడు. నేను విశ్రమింపఁబోయెదను. (నిష్క్రమించును)

లక్ష్మ — జయము జయ మార్యునకు. నియమించినప్రకారము మీచరిత్రమంతయుఁ జిత్రకారుఁడీపటమునఁ జిత్రించినాఁడు. వినోదింపఁ గోరెదను.

రాము — వత్సా! మంచి సమయముననే తెచ్చితివి. దేవిని వినోదింపఁ జేయువిధానమెఱుంగుదువు. కథయెంతవరకుఁ జిత్రింపఁబడినది?

లక్ష్మ — ఆర్యురాలి అగ్నిపరిశుద్ధివరకును.

రాము — హా! పాపము శాంతించుఁగాక,

గీ॥ పుట్టువునుబట్టియే పరి ♦ పూతమైన
యీమహీజకు శుద్ధి వే ♦ ఱేమికలదు
అన్యములచేత శుద్ధి క ♦ ష్టంబులగునె
భవ్యతీర్థోకముగాని, ♦ వహ్నిగాని ॥

దేవీ! దేవయజనసంభవా! క్షమింపుము. ఈజనపరివాదము నీకు యావజ్జీవితమైనది.

చం॥ పరమకులప్రతిష్ఠ నిలు • పం దలఁపూనినవానికి న్నిరం
తరము ప్రజానురంజనప • థం బనుగమ్యము గాన, నీయెడన్
నెఱపితి నాఁ డవాచ్యమగు • నిర్ణయ; మూఁదలఁదాల్పనో మనో
హర సురభిప్రసూన, మగు • నా చరణాహతుల న్నలంపఁగన్? ॥

సీత—ఆర్యపుత్రా! మఱచిపోం డావిషయమును. రండు, పవిత్రమైన మీచరిత్రము చూతము.

లక్ష్మ—(చిత్రపటము విప్పి) ఇదియే యాచిత్రపటము.

సీత—(నిర్వర్ణించి) వీరెవ్వరు! ఆకసమునఁ గ్రిక్కిఱిసినట్లు నిలువంబడి యార్యపుత్రుని స్తుతించుచున్నట్లున్నారు.

లక్ష్మ—ఇవియే సరహస్యములగు జృంభకాస్త్రములు. తాటకాసంహార సమయమున భగవానుఁడు విశ్వామిత్రుఁ డన్నగారికిఁ బ్రసాదించిన యాయస్త్రరాజము లివియే.

రాము—దేవీ! నమస్కరింపు మీ యస్త్రరాజములకు. బ్రహ్మాదులగు మహానుభావులు వేనవేలువత్సరములు తపంబాచరించి, లోకహితార్థమై వీనిని సృష్టించిరి.

సీత—నమస్కారము దివ్యాస్త్రములారా!

రాము—దేవీ! ఈ యస్త్రములు సర్వథా నీ సంతానము నాశ్రయించుఁగాక.

సీత—కృతార్థురాలను.

లక్ష్మ—చూడుఁడిది మిథిలావృత్తాంతము.

సీత—ఓహో! ఎంత మనోహరము! ఇదిగో యార్యపుత్రుని సౌందర్యమూర్తి! అప్పుడే వికసించుచున్న నల్లగల్వఱేకుం బోలిన చామనచాయతో నున్ననై, చిక్కనై, బలిష్ఠమైయున్న యీ

శరీరసౌభాగ్యమును ఱెప్పవేయక మానాయనగారు ఱిచ్చవడి చూచుచున్నారు. ఆహా! అల్లారుముద్దారు పిల్లజులుపములతో నందగించు వదనారవిందమునం దామందహాసమేమి! అవలీలగా హరచాపమందికొని యెక్కిడుచున్నారు!

లక్ష్మి—

గీ॥ వీరె మాతండ్రిగారు గా ♦ వించుచుండి
రనుఁగు వియ్యంకులకు వసి ♦ ష్ఠాదిములకుఁ
దత్తదుచితప్రకార స ♦ త్కారవిధులఁ
దన పురోహితుఁడైన గౌ ♦ తముని గూడి॥

రాము—ఆహా! నేత్రోత్సవకరమైన దీవిషయము.

గీ॥ రఘు జనకవంశములకు నే ♦ ర్పడిన యిట్టి
యందమగు వియ్య మెవని కా ♦ నందమిడదు;
దాతయుఁ బరిగ్రహీతయుం ♦ దానె యగుచు
మనువు స్వయముగఁ గుశికనం ♦ దనుఁడు నడుప॥

సీత—ఆహా! వీరె పెండ్లికొడుకులు మానల్గు రన్నదమ్ములు- కలకలలాడుచున్నవి పెండ్లికళలు- ఆహా! యా ప్రదేశమందే, యా సమయమందే యిప్పుడున్నానా యేమి!

రాము—నేనును నట్లే యనుకొనుచున్నాను.

మ॥ అనురక్తిం బులకించి, క్రొంజెమరువా ♦ ర్యఁగా, గంకణశ్రేణి ఘు
ల్లనఁ గంపించుచునున్న సీతలిరుఁగే ♦ లాగౌతముం డూది, ఝు
ల్లని నామై పులకింప, నాకరమునం ♦ దర్పించు నానాఁటిమో
హనదివ్యోత్సవ మిప్పుడున్ జరుగుచు ♦ న్నట్లే మనంబూఁగెడున్॥

లక్ష్మి—ఈమె పెద్దవదినెగారు. ఈయమ చిన్నవదినె, మాండవి. ఇది మఱదలు శ్రుతకీర్తియును.

సీత—(చిఱునవ్వుతో) వత్సా! ఇది యెవ్వరు, ఇంకొకతె?

లక్ష్మ—(తనలో) వదినెగా రూర్మిళ నడుగుచున్నారు కాని దృష్టి మఱి యొకచోటికి మరల్చెద. (ప్రకాశముగా) ఆర్యురాలా! చూడుఁ డీయన పరశురాముఁడు. అన్నగారు హరకోదండము ఖండించిన వార్త విని ... .

సీత—అమ్మయ్యో! భయమగుచున్నది.

రాము—ఋషిసత్తమా! నమస్కారము.

లక్ష్మ—కడ కీయన మాయన్నగారిచే ... ...

రాము—(సాక్షేపముగా) సౌమిత్రీ! ఇంతకంటె వినోదింపఁదగిన విషయము లేదా చిత్రపటమున?

సీత—(సబహుమానముగాఁజూచి) ఇటువంటి వినయప్రభావముచేతనే యార్యపుత్రులు, మఱింత శోభిల్లుచున్నారు.

లక్ష్మ—ఇదిగో మన మయోధ్యం జేరితిమి.

రాము—వత్సా! సౌమిత్రీ!

గీ॥ తండ్రిగారుండఁగా, మన ♦ తల్లులెల్లఁ
గ్రొత్తగాఁబెండ్లియైన న ♦ ల్గురఁ గోమాళ్ళ
ముద్దుముచ్చటలంగని ♦ మురియుచుండు
మంచిదివసంబు లవి యంత ♦ రించెనె కద॥

లక్ష్మ—ఇంక మంచిదివసంబు లెక్కడివి? ఇదిగో మంథర.

రాము—(వేఱొకచోఁ దిలకించి) చూడుము వైదేహీ!

గీ॥ శృంగిబేరపురంబు సే ♦ రంగఁగనిన
యింగుదీపాదపం బిది ♦ యే లతాంగి!
దీనినీడనె పల్లెమ ♦ న్నినితోడ
మనకు లభియించె మిత్రస ♦ మాగమంబు॥

సీత—ఇది జటాబంధన వృత్తాంతము కదా!

లక్ష్మ—అవును. ఆకాలమహిమ యెట్టిదో కాని,

గీ॥ ముదిసి ముప్పున రాజ్యసం ♦ పదల సుతుల
పరముగావించి, యిక్ష్వాకు ♦ ధరణిపతులు
కైకొనెడు పుణ్య మారణ్య ♦ కవ్రతంబు
చేకొనెఁగదమ్మ మాయన్న ♦ చిన్ననాఁడె॥

సీత—ఇదికదా, ప్రసన్న పుణ్యసలిలయగు భగవతి భాగీరథి.

రాము—తల్లీ! రఘుకుల దేవతా! నమస్కారము.

లక్ష్మ—ఇక్కడనుండి భారద్వాజాశ్రమము మీఁదుగ మనము దక్షిణారణ్యము ప్రవేశించితిమి.

సీత—ఇదిగో మనదక్షిణారణ్యయాత్ర; జరిగినది జరిగినట్లుగానే చిత్రింపఁబడినది. నా కెండపొడ సోకకుండుటకై, యార్యపుత్రులు నాతలపై నొకతాలవృంత మాతపత్రముగఁబట్టి నన్ను మెల్లన నడిపించుచున్నారు.

లక్ష్మ—అమ్మా! ఈప్రాంతముననే ప్రశాంతములైన తపోవనభూములు. చూడుఁడు, సెలయేళ్ల తీరములందలి తరుమూలముల నాశ్రయించి తపంబొనరించు వానప్రస్థుల చేతను, శమదమాన్వితులై నిరంతరాతిథేయవ్రత నిష్ఠాగరిష్ఠులై, నీవారముష్టింపచులై, స్వచ్ఛందజీవయాత్రం గడుపుకొను గృహస్థుల పర్ణశాలికల చేతను నీప్రాంతమంతయుఁ బ్రశాంతమనోహరముగ నున్నది.

రాము—ఆహా! ఇది చూచునప్పు డాయాశ్రమవృత్తాంతములే నాకుఁ గన్నులఁ గట్టినట్లున్నవి.

సీ॥ కలసి నివ్వరిధాన్య ♦ ములు దంచు జడదారిపడఁతుల మేటిసు ♦ వ్వాలపాట
చిలుకలుం గోరవం ♦ కలు, పెద్ద లేతేర "ఆస్యతా" మను స్వాగ ♦ తానువాద
మేకాలునకు బీఱు వోక ♦ పూసిఫలించు స్వచ్ఛందతరులతా ♦ సంచయంబు
బ్రహ్మావిద్యార్థతా ♦ తపర్యచర్యాధీన పరమర్షి గంభీర ♦ భావగరిమ

గీ॥ తులసిబృందావనమునుండి ♦ మలయుచుండు వలపుఁజల్లనిగాడ్పుల ♦ వైభవంబు
తలఁచికొనినంత మేనెల్లఁ బులకరించు సౌఖ్యములకొల్ల మునుల యా ♦ శ్రమములెల్ల॥

సీత—ఆహా! ఈ ప్రదేశం బెంతతడవు చూచినను దనివిదీరకున్నది కదా!

లక్ష్మ—ఇక్కడఁదిలకింపుఁడు. దండకారణ్యమధ్యస్థమగు ప్రస్రవణ పర్వత మిది. నిరంతరము వర్షించుచుండు నీరంధ్రమేఘసంఘాతముల సంయోగముచే సాంద్రీకృతశ్యామలవర్ణములై దీని శిఖరాగ్రములు విరాజిల్లుచుండు; దట్టముగఁ బెనవైచికొని, పుంజీభవించియున్న తరులతానికుంజములచే, నిరంతరస్నిగ్ధశీతలశ్యామలంబగు నీ కాంతార పర్యంతభాగములలో గోదావరీస్రవంతి ప్రవహించుచున్నది. ప్రపాతసంవేగమువలనఁ బరస్పరాస్ఫాల్యమానములగు, నేతత్తరంగిణీసముత్తుంగతరంగసంఘముల రొదలతో నీపర్వతకందరము లెడతెఱపిలేక ప్రతిధ్వనించుచుండును.

రాము—నెచ్చెలీ! ఈ ప్రాంతమునఁ గొంతకాలము నివసించి, మన మెంతయుల్లాసముగఁ గాలము గడిపితిమో స్మరణకు వచ్చుచున్నదా? ఈ నీమఱందికుఱ్ఱ నానావిధరుచ్యఫలాహారంబుల సేకరించికొనివచ్చి మనల సేవించుచుండెడివాఁడు. మంజులతాంతలతానికుంజములతో మనోరంజకములగుగోదావరీనదీకూలములు మనవిహారముల కనుకూలము లగుచుండెడివి. (రహస్యముగా) చూడు, ప్రేయసీ జ్ఞప్తియున్నదా!

మ॥ అలలందోఁగుచుఁ బిల్లగాడ్పు లలస ♦ వ్యాలోలతన్ వీవ, మే
ల్వాలిపెంపుం దెలికప్పురంపుఁ బెను ది ♦ ప్పంబోలు గోదావరీ
పులినంబం దొకనాఁటిరేయి సరసం ♦ పున్ వెన్నెలన్ రాగముల్
వాలయం గాంచిన నాఁటిసౌఖ్యము తలం♦పుంబాయ దెన్నాళ్లకున్॥

సీత—మనోరమణా! అరణ్యమందున్నను మనము సౌఖ్యముగనే కాలము గడిపితిమి, రాజధానియందింత నిరాకులమగు సౌఖ్యమెక్కడిది? చూడుఁడు,

సీ॥ దొరకునా! యిచ్చటి ♦ దోరఁబండిన రేఁగుపండ్ల బేసంబు, నీ ♦ వారభుక్తి
కలుగునా! చేతిమేఁ ♦ తలఁ బెంచి మంచిన వనమయూరంగీ స్నేహ ♦ వైభవంబు
చేకూడునా! తప ♦ స్విను లాదరముతోడ సారెఁబెట్టిన మేలి ♦ నారచీర
మరల లభించునా! ♦ మనకు గోదావరీ పులినహంసాంగనా ♦ విలసనములు

గీ॥ బుజముల నలంతి బిందెలం ♦ బూని, పాఱుటాఱుఁ బైఁటలు జడియ, ము ♦ ద్దాఱునడలఁ
దబిసికన్నెలు పాదులం ♦ దమపునట్టి మధురనిగమార్థగీతిక ♦ ల్వినఁగలవె? ॥

లక్ష్మ—అమ్మా! ఇది పంచవటి. ఇదిగో శూర్పణఖ.

సీత—అయ్యో! ఆర్యపుత్రా! ఇంతవరకేకదా మిమ్ముఁ గలిసియుండు భాగ్యము నాకు.

రాము—ఓసి వియోగభీరూ! ఇది చిత్రపటము, భ్రమఁ జెందకుము

సీత—ఏమైనను దుర్జనుఁడు, దుఃఖమునే కలిగించుఁగదా?

లక్ష్మ—అమ్మా! అం దాశ్చర్య మేమున్నది?

మ॥ మును మాయామృగకైతవంబుల దురా ♦ త్ముల్ రక్కసుల్ మాకొన
ర్చిన ద్రోహంబుఁ బ్రతిక్రియన్ దుడిచినన్ ♦ జేయున్ మనోబాధ నూ
తనమై, యాతఁడె శూన్యమైతగు జన ♦ స్థానంబునం గుందునా
ర్యుని శోకార్తికి, రాయియేన్ గఱఁగితీ ♦ రున్ వజ్రమేన్ భిన్నమౌ॥

సీత—హా! రఘుకులానందా! మందభాగ్యనైన నానిమిత్తమై యంతటి సంతాప మనుభవించితిరి గదా!

లక్ష్మ—(కన్నీటఁదోఁగు రామునింగాంచి) ఆర్యా! ఏమిది చిత్రపటదర్శన మాత్రముననే మీరును మనోవైకల్యముఁ జెందుచున్నారు!

రాము—వత్సా! సౌమిత్రీ! ఈవృత్తాంత మట్టిది; యెఱుఁగనివాఁడవు కావుగదా.

చం॥ ప్రియజనవిప్రయోగమునఁ ♦ బేర్చిన యప్పటిశోకవహ్ని, త
ద్దయు భరమయ్యు నోర్చితిఁ గ ♦ దా యెటులేన్ బగదీర్పనెంచు ని

శ్చయమున; నేఁ డదే మరల ♦ స్వాంతమునన్ సెలవారి దుస్సహం
బయి పరిపక్వమైన హృద ♦ యవ్రణమట్లొనరించు వేదనన్ ॥

సీత—అయ్యో! ఏమిసేయుదు. దుర్భరవిరహాభావమున మునింగి నేనిప్పు డార్యపుత్ర శూన్యురాలనై పోయితినే !

లక్ష్మ—(స్వగతము) ఓహాహో ! వీరిచిత్తవృత్తుల నన్యథా మరలింపవలయు. (ప్రకాశముగా) అమ్మా ! ఇటుఁజూడుము. మన్వంతరవృద్ధుని జటాయుని పరాక్రమోదంత మిది.

సీత— (చూచి) హా తండ్రీ! ఆపన్నురాలి నన్నురక్షించుటకుఁ బ్రాణములఁగూడఁ దృణప్రాయముగ విసర్జించి, నీయపత్యవాత్సల్యము వెల్లడించితివి కదా,

రాము—నాయనా; కాశ్యపా; తీర్థభూతుఁడగు నీయట్టి మహానుభావుఁడు మాకు మరల లభించునా?

లక్ష్మ—అమ్మా! యీమెయే "శ్రమణ"యను సిద్ధశబరి.

సీత— తల్లీ శబరీ! ఎంత పుణ్యాత్మురాలవు. నాఁడు నిన్నుఁ జూచు భాగ్యము లేకపోయినను నేఁడు చూడఁ గల్గితిని.

రాము—దేవీ ! ఈశబరిమాటఁ దలంచిన నాహృదయ ముప్పొంగును. చూడు మెట్లున్నదో! ఆహా ఆవినయము, ఆయాదరణము. ఆభక్తి ప్రపత్తి, యాయతిథిపూజాతాత్పర్యము, వాచామగోచరములు. పాపము మాకొఱకై శ్రమపడి వింతవింతమోగిరములెన్నెన్నో సంతరించినది. ఎందులకో,

సీ॥ అలరుఁ గన్నీటిచే ♦ కాలు చాలవనియేమొ పానీయమువ నర్ఘ్య♦పాద్యమొసఁగె
కన్నూపు లరమోడ్పు ♦ గనఁ జాలవనియేమొ విరియు సెత్తావి క్రొ♦వ్విరులు వల్లె;
పలుకు గద్గదికవె ♦ ల్వడఁజాల దనియేమొ తేటిన మంచి పూ♦దేనెఁగూర్చె;
పైకి నేర్పడని భా♦వము చాలదని యేమొ యుపహారఫలము లె♦న్నోయమర్చె

గీ॥ వివురువడి,దోయిలించి, "నా♦యిడ్లబరిందు। గొనుము శ్రీరామ!తరియింతు"వనుచుశబరి యట్టె పరవశయై, నిల్చి ♦ నట్టె నిలిచె। నారగించితి నపుడు; నో♦రూరు నిపుడు॥

లక్ష్మ—ఈతఁడు మహానుభావుఁ డార్యుఁడు హనుమంతుఁడు.

సీత—ఆహా! చిరకాలమునకుఁ గంటిని, చిరనిర్విణ్ణమైన జీవలోకము సముద్ధరించిన యీపరమోపకారిని.

రాము—గీ॥ అంజనానందవర్ధనుం ♦ డైన యితఁడు
బాహుశాలి, శుభక్రియా ♦ దోహలుండు
ఇతని శౌర్యంబునఁ గృతా ♦ ర్థత ఘటిల్లెఁ
గలికి; మనకును నెల్ల జ ♦ గంబులకును॥

సీత—వత్సా! ఈకొండ పేరేమి, విరియఁబూచిన కడిమిచెట్టుపై మయూర దంపతులు, తాండవించుచున్నవి. శరీరలావణ్యాకాంతి, ధూళిధూసరితంబైయున్నను, సహజానుభావసౌందర్యమాత్రమున గుర్తింపఁదగి, ముహూర్తమాత్రము మూర్ఛిల్లియున్న యార్యపుత్రుఁడు నీచేతులందున్నట్టు లీచెట్టునీడను జిత్రింపఁబడియె!

లక్ష్మ—

ఉ॥ తావులు మద్దిక్రొవ్విరుల ♦ తావుల తావులుగా, నవాంబుద
ప్రావృతనీల శృంగమగు ♦ నాగిరి మాల్యవదాఖ్య మమ్మ!

రాము—

వత్సా! వినఁజాల దుర్భర మి ♦ తగపగాథలు, చాలుఁ జాలు, సీ
తావనితావియోగ పరి ♦ తాపము దాపరమయ్యెఁ గ్రమ్మఱన్॥

లక్ష్మ—విరమించెదను. కథ యింకను మిగిలియున్నది; కాని వదినగారు కడునలసటఁజెందిన ట్లున్నారు. కొండొక విశ్రమింతురు గాక.

సీత—ఆర్యపుత్రా! ఈ చిత్రపటదర్శనముచే నాకొక యభిలాషము వొడమినది. విన్నవించుకొందునా?

రాము—కా దాజ్ఞాపింపుము.

సీత—ప్రశాంతములగు తపోవనవాటికల విహరించుచు, మునిపత్నుల తోడ భాగీరథియందు జలకము లాడవలయునని,

రాము—వత్సా! ఈమెకోరిక వెంటనే చెల్లింపుమని గురుజన మిప్పుడే కదా సందేశించినది? కుదుపులేకుండ సుఖముగాఁ బ్రయాణము చేయఁదగిన రథము సిద్ధముఁ చేయుము.

లక్ష్మ—చిత్తము. (అని నిష్క్రమించును.)

రాము—ప్రేయసీ! రమ్ము. ఈ వాతాయనముకడ నొకింత విశ్రమింతము.

సీత—ఔను అలఁబుకచే నిద్దుర తూఁగుచున్నది.

రాము—ఆలాగైన నన్నూఁది మఱి నడువుము. (అనిచేయినంది) ఓహో!

చిత్రపటముం జూచిన బడలికచేతను, వియోగసంభ్రమముచేతను గాఁబోలు ముచ్చెమరుపోసిన దీబాహులత; నాకంఠమున నర్పింపుము, (సీతబాహువుఁ దనమెడపైవైచికొని) చంద్రికరస్పర్శముచేఁ జెమ్మగిల్లిన చంద్రమణి హారమువలెఁ జల్లనై... ఆహా మనోహారిణీ; నీ బాహులతాసంస్పర్శముచే నాశరీర మమృతవిలేపన మందినట్లున్నది. అనిర్వచనీయమగు వికారమేదియో యావిర్భవించి, నన్నాకస్మికమూర్ఛాపారవశ్యమున ముంచివేయుచున్నది. ఇది నిద్రయో లేక సమ్మోహపారవశ్యమో నిర్ణయింపరాకున్నది.

సీత—మనోరమణా! మీహృదయము నిరంతరము నాయందు సుప్రసన్నమైయుండును! ఇంతకంటె నేఁ గోరఁదగిన సౌభాగ్యమేమున్నది?

రాము—ఆహా! ప్రేయసీ!

గీ॥ ప్రణయమధురంబులైన నీ • భాషణములు
వాడువాఱిన జీవన • ప్రసవములకు
వికసనమ్ము లింద్రియమోహ • విభ్రమములు
శ్రవణపేయంబులు, మనోర • సాయనములు ॥

సీత—ఆర్యపుత్రా! ఇందువలననే మి మ్మందఱు ప్రియంవదు లందురు. ఇఁక శయనింతును. (అని శయ్యకొఱకు నటునిటు వెదకుచున్నది.)

రాము—ప్రేయసీ! ఏమి వెదకుచున్నావు? ఇదిగో,

చం॥ కలనయినన్ బరాంగనకుఁ • గాక వివాహమె యాదిగా భవ
ల్లలితతనూపలాలన వి • లాససుఖానుభవ ప్రశస్తమై
చెలువ! గృహంబునన్ గహన • సీమల నిన్నుచితంపుసేవలన్
గొలిచెడి రామబాహు విడి • గో తలదిండగు నీకు జానకీ! ॥

సీత—కృతార్థురాలను (రామబాహువు(దలాపిగా నిడికొని నిద్రించును.)

రాము—ఏమిది! ప్రియంవద కప్పుడే నిద్రవచ్చినది! (స్నేహమున మేను నిమురుచు) ఆహా! అనుకూల్యవతియగు నిల్లాలివలని సౌఖ్యమున కింతయని విలువ యెక్కడిది?

ఉ॥ ఈ మహిళాలలామము గృ • హేందిర; కన్గవ కీమెమూర్తి ది
వ్యామృతవర్తి, స్పర్శసుఖ • మా! హరిచందనచర్చ మేని, కీ
కోమలిబాహువల్లి మెడ • కున్ వలిముత్తెసరమ్ము, రమ్యమే
యా మది కేతదీయము స • మస్త, మహా విరహంబు దక్కఁగన్ ॥

(ప్రతీహారి ప్రవేశించి) దేవా! వచ్చినాఁడు.

రాము—ఎవరు?

ప్రతీ—ఏలినవారి పాదసేవకుఁడు దుర్ముఖుఁడు.

రాము—(తనలో) శుద్ధాంతసంచారి నీదుర్ముఖుని పౌరజానపదులపై వేగు నడుపుటకు నియమించితిఁ గదా. (ప్రకాశముగా) రమ్మనుము.

(ప్రతీహారి నిష్క్రమించును)

దుర్ముఖుఁడు—(ప్రవేశించి) అయ్యో! రాణిగారినిగుఱించిన యవాచ్య మగు నీజనాపవాదమును దేవర కెట్లుమనవి చేయుదును. తప్పదు. ఈదౌర్భాగ్యుని యుద్యోగ మట్టిది.

సీత—(నిద్దురలో) అయ్యో! ఆర్యపుత్రా! ఎక్కడనున్నావు!

రాము—ఓహో! చిత్రపటవీక్షణమువలని సంక్షోభకారణమగు వియోగ భావనము నే కలవరించుచున్నట్లున్నది. అవును ప్రేమమిడికిది నైజమే,

శా॥ ఏ, దద్వైతము ఖేదమోదముల, నెం ♦ దే హాయిఁజెందుక్ మనం,
బేదా నన్నిటఁ దోడునీడ, ప్రియ మెం ♦ దే పోదు ప్రాయంబుతో,
నేదా నాఁటికినాఁటికిన్ బెఱుఁగునో ♦ హృద్యస్థితిన్ బ్రేమ సాం,
పా దాంపత్యశుభానుభోగమె కదా ♦ యాసింతు రెల్లనియున్॥

దుర్ము—దేవా! జయము

రాము—దుర్ముఖుఁడా! నేఁటి విశేషములేమి?

దుర్ము—ఏమున్నవి. చల్లనియేలుబడిచే శ్రీరామచంద్రులు తమ తండ్రి గారినిగూడ మఱపించుచున్నారని పౌరులు వేనోళ్ళ మిమ్ముఁగొని యాడుచునే యున్నారు.

రాము—ఇది కేవలశ్లాఘావాక్యము. లోపములమాట చెప్పుము. నిన్ను వేగుబంపినది నాగుణకీర్తనము వినుటకుఁ గాదు.

దుర్ము—దేవా! నోట వక్కాణింప నేటికి? సర్వ మీపత్రమునఁ జూచి కొండు. (కాగితమిచ్చును.)

రాము—(కాగితమందుకొని ఈవలకరుదెంచి) ఈపత్రంబున నెట్టి విశేష మున్నదో! ఇతఁడు నోటవక్కాణించుటకే సంశయింప నేటికి? ఇదేదియో మహానర్థము కానోపు. (అని లోపలఁ జదువుకొని) హా! హా! హతోస్మి. (మూర్ఛిల్లును.)

దుర్ము—దేవా! ఉపశమింపుఁడు.

రాము—(మూర్ఛఁదేఱి) దుర్ముఖా! ఎంతఘోరమిది! ఇంతటి వైపరీత్యము గూడఁ బ్రపంచమునఁగలదా? అనన్యకన్యాసామాన్యమైన జన్మముచేతనే పరమపవిత్రమైన యీజానకీచరిత్రమునకా యీనీచ ప్రవాదము! అయ్యో, ఇంతకంటె నాకాకస్మికనిర్ఘాతపాతము మేలే! హాలాహల జ్వాలామాలికలచే భస్మీకరింపఁబడుట మేలే, హా! హా! చిరకాలపరగృహావాసముచే లోకులీ సీతంగుఱిం చి, యన్యథా భావింపక మానరని, లోకాతీతములగు నద్భుతో

పాయముల నెంత యుపశమింపఁ జేసినను, గడకు రావలసిన యాలేతమాట యెట్లో రాక తప్పినదికాదు. హా ; హతవిధీ ! నీనిర్ణయము నిరాఘాటముగ నిట్లు పరిణమింపవలసియుండఁగా, నావంటి ప్రాకృతుల పురుషకారము లేమక్కఱకువచ్చును; ఏమీ ; ఇందు నే నెవ్వండను! సీతా పాతివ్రత్యనిర్ణేతలలోఁ బ్రాకృతులనం దగినవా రెవ్వరు? వీతిహోత్రుఁడా! విశ్వంభరా దేవియా! విద్యాధరప్రముఖామరసేవ్యమానుఁ డావిబుధనాయకుఁడా ! విష్టపత్రయైక గురుం డావసిష్ఠభగవానుఁడా; విశ్వవిఖ్యాతచరిత్రుఁడై విబుధేశ్వరు నర్ధాసన మలంకరించియున్న నా తండ్రి దశరథేశ్వరుఁడా ! ఇట్టివా రేకగ్రీవముగ " జానకి నిర్దోష నిర్దోష నిర్దోష "యని పలుమా ఱుద్ఘోషించి నిర్ణయించిన యీయామె సౌశీల్యమునకు, మరల నేఁ డిట్టి మిథ్యాప్రవాదము సంభవించుట, నాదౌర్భాగ్య పరిపాకము గాక వేఱేమున్నది! కాని యిప్పు డేది కర్తవ్యము (విమర్శించి) ఆహా! ఈరాముని జీవయాత్రయం దింతకంటెఁ గఠోరమైన విషమావస్థ యుండునా ? మరియు నేయుపాయముచేఁ బ్రజాసముదాయమును సమాధాన పఱుపఁగలను? (ఆలోచించి నిర్ణయముతో) ఇంక నొక్కటియే యుపాయము. (దుఃఖముతో) హా ! జానకీ! సవనమహీనందనీ ! (అని దుఃఖ మడంచుకొని) ఛీ! ఇప్పుడు దుఃఖమునకవకాశము లేదు. ఎట్టి గాఢప్రయత్నములతోనైనను, బ్రజారాధనదీక్షం గాపాడుకొనుట యేకదా యిక్ష్వాకురాజధర్మము. అందున కేకదా తండ్రిగారు నన్నును గడకుఁ దన ప్రాణములఁగూడఁ గోల్పడినది. వసిష్ఠభగవానులు నాకీవిషయమై సందేశించిన దిప్పుడేకదా ? జగదేకస్తుతిపాత్రులగు హరిశ్చంద్రాది నరేంద్రుల సాధుప్రవర్తనములచే బరమపవిత్రమగు నా సూర్య

వంశ చారిత్రమునకు నామూలమున నేఁడేమేని కళంక లేశము సంభవించినచో ఛీ ఛీ నాజన్మము కాల్పనా? హా దేవీ! హా! సవనమహీంతనూభవా! స్వజన్మానుగ్రహపవిత్రితవసుంధరా! హా! నిమిజనకవంశవర్ధనీ! హా! పావకవసిష్ఠారుంధతీప్రశస్తశీల శాలినీ! హా! రామమయజీవితా! హా మహారణ్యావాసప్రియ సఖీ! హా ప్రియస్తోకవాదినీ! ఇట్టి నీకా; తుదకీయవస్థాపరిణామము. హా జానకీ! లోకములన్నియు నీవలన సుశ్లోకములగుచున్నను నీవు మాత్రము లోకమునకుఁ గాకపోయితివిగా.

గీ॥ పరమ సాధ్వీత్వ సామ్రాజ్య ♦ పట్టమంది
ముజ్జగము లేలుచున్న యో ♦ ముద్దరాల
పాపివిధిచేత మిథ్యా ప్ర ♦ వాదమంది
యనదవై దిక్కుమాలి య ♦ ల్లాడ వలసె॥

(అని కాగితముపై నేమియో వ్రాసి) దుర్ముఖా! నీవు పోయి మీ యా క్రొత్తరాజు నీకీయాజ్ఞాపత్రమును బంపినాఁడని లక్ష్మణునకిమ్ము.

దుర్ము—దేవా! దుర్జనుల వాక్కులు లెక్కఁగొని, పవిత్రరఘుకుల సంతానమునుమోసియున్న యగ్నిపరిశుద్ధురాలగు దేవిగారియెడ నేమో ఘోరనిర్ణయము సంకల్పించినట్లున్నారు?

రాము—పాపము శాంతించుఁగాక! దుర్ముఖా! నా ప్రజలు దుర్జనులనవచ్చునా?

గీ॥ ప్రజల కభిమాన మిక్ష్వాకు ♦ వంశమనిన
విధివశత నందె నిందకుఁ ♦ బీజ మొదవె
అగ్ని పరిశుద్ధిఁ జేసితి ♦ మంటిమేని
అగునటంచు నమ్మ దూరప్ర ♦ త్యాంత మెవఁడు? ॥

దుర్ము—హా! దేవీ! (దుఃఖముతోఁ బోవును.)
రాము—హా హా! కఠోరమైన రాజధర్మము నన్నెంత పాషాణహృద

యునిగా మార్చినది. అయ్యో చెలీ! జానకీ; నాపై నెంత పేరాసగొంటివి. ఎంత మురియుచుంటివి.

సీ॥ పనికత్తె లెందఱు • న్నను బైటచెఱఁగునఁ దుడిచి పాదుక లీవె • దొడిగినావు
ఉపచార మెప్పుడే • దోయంచు నేమఱ కెలమి నామనసులో • మెలఁగినావు
మురిపెంపు రాచకూఁ • తురవయ్యు నన్నుఁగూడి యడవి కాఁపుర మోర్చి • నడిపినావు
రాసి అంపానఁ గా • రాదు దక్కసు ధిక్కరించి యీలువు నిల్వ • రించినావు
గీ॥ ఇట్టినినుఁ జిచ్చువందోసి • నట్టి నాదు నేర మొకలెక్కయనక మ • న్నించినావు
ఎంతమురిసితి విఁతిరో! • యేమిఫలము కన్నుగుట్టైను విధికి నీ • కాఁపురంబు ॥

నెచ్చెలీ! కడగండ్లన్నియుఁ దొలఁగినవి కొంత కాలమునుండియైన సుఖించుచుంటిమని సంతసించుచుండ నింతలో నిట్టియుపద్రవము సంభవింపవలయునా? అంతయైనను లోకము నీయెడ నవిశ్వాసమే వహింపవలెనా? కానీ జనకనందినీ! నీసదాచార మెవ్వరు విశ్వసించినను విశ్వసింపకున్నను, బరమపవిత్రములగు నీచరణాంభోజములంటి వచింతు నిదిగో,

శా॥ నే నావంతయు నీసుశీలతకు సం • దేహింప, నిన్గూర్చి యే
మేనిన్ గీడనుకొన్న నాకు నరకం • బే జన్మజన్మాల క
య్యో నారీమణి! యన్యాయద్వితయ మెం • తో పావనంబయ్యె నీ
చే, నట్లయ్యుఁ బ్రవాదమిట్టిది జనిం • చెన్ నాదునిర్భాగ్యతన్ ॥

ఇంక నేమనుకొన్న నేమిప్రయోజనము? క్రూరకర్ముఁడనై బీభత్సకార్య మొనరించితి.

గీ॥ చిన్ననాఁటనుండి • పెంచిన ప్రియురాలిఁ
బొరపులేని స్నేహ • పూర్ణురాలిఁ
గైతవమున మిత్తి • వాత వేయుచునుంటి;
చెనఁటియొఱుక యింటి • చిలుక నట్లు ॥

జానకీ! పొమ్ము; నీకును నీరామునకునుగల ఋణానుబంధము నేటితోఁ గడముట్టినది. ఈ పాడుకన్నులకు నీమూర్తిం జూచుకొను కడపటిభాగ్య మిదియే.

సీ॥ నీలాలమేలుంగ • రాల ముంగురుల కోసకి! యిదే కడసారి • సంతరింపు
లలితంపు నీతనూ • లత కిదే మానినీ! కడసారి నామేని • కౌఁగిలింత
నిద్దంపు నీచెక్కు • టద్దంబులకు నిదే చానరో! నాకడ • సారిముద్దు
పరమపావనము నీ • చరణాబ్జమున కిదే జానకీ! నాకడ • సారిమ్రొక్కు

గీ॥ నేఁటితోఁదీరె నాకును • నీకు ఋణము సుఖముగా నీవునీరాడి • సుతులఁగాంచి
కానిక్రింతల నెందైనఁ • గాని బ్రతుకు వేఁడికన్నీళ్లతో నిన్ను • విడిచినాఁడ॥

చాలు నింకేటికిఁ బాపకర్ముఁడనైననేను స్పృశించుచు దేవి నపవిత్రపరుపవలయును?

ఆ॥ వె॥ చను మపూర్వకర్మ • చండాలు నన్ఁబాసి
యంటఁబోకు ముద్ద • రాల! నన్ను
ఆశ్రయించినావు • హరిచందనభ్రాంతి
విలయమూలమైన • విషకుజంబు॥

అయ్యో; జానకీ! పరమనీచమైన యీరామునిపాణి నేదుష్టహస్తమున గ్రహించితివో కాని నీకాఁపురమంతయు నిష్ఠురములగు కష్టములతోడనే కడముట్టుచున్నది. కానిమ్ము, ఇట్టి ప్రేమానుబంధమునకు వియోగమే రసైకస్థానము. హా! హా! జీవలోక మెంతలో విపర్యస్తమైనది? నేఁటితో రామునిజీవయాత్ర నిష్ప్రయోజనమైపోయినది. ప్రపంచమంతయు జీర్ణారణ్యమైపోయినది. దుస్సహదుఃఖానుభవమునకే యీ రామునిశరీరమునఁ జైతన్యము శూన్యముగాకున్నది. వజ్రమయశస్త్రికలై హృదయమర్మములం జుఱచుచుఁగోయుచు నీమొండిప్రాణంబు లింకను రాలిపోకున్నవి కదా! హా అంబా అరుంధతీ! హా భగవానులారా వసిష్ఠ విశ్వామిత్రులారా! హా దేవీ భూతధాత్రీ! హా మామా జనకరాజేంద్ర! హా లంకాధిపతీ విభీషణా! హా ప్రియసఖా సుగ్రీవ! హా సౌమ్య అంజనీతనయా! హా సఖి త్రిజటా! మీరంద ఱీరామహతకునిచేఁ బరాభూతులై పోయితిరి. ఛీ! కృతఘ్నుఁడనైన నేను వారిం బేర్కొనుటకైన నర్హుఁడనా?

శా॥ బాలిక న్నమ్మి యురంబునన్ నిదురమై ♦ పన్నుండు ప్రేమంపుటి
ల్లాలిన్ దీని గృహేందిరన్ బ్రిసవవే ♦ లాలోలయూ నిండుచూ
లాలిన్ హా! దయమాలి నేఁడు బలిఁగా ♦ నర్పించుచుంటిన్, మహా
త్తాలాభీలకరాళకాననకిరా ♦ తవ్రాత మధ్యంబునన్ ॥

(తెరలో) అబ్రహ్మణ్యము అబ్రహ్మణ్యము.

రాము—(ఆకర్ణించి) ఎవరక్కడ ఆగగ్గోలేమో తెలిసికొనుము.

(మరలఁ దెరలో)

గీ॥ యామునీయతటంబులం ♦ దత్యుదగ్ర
తపము గావించుకొను తపో ♦ ధనులు వారు,
క్రూరలవణాసురుని బారిఁ ♦ గుతిలపడుచు
దేవ! నీప్రాపుఁ జేర నే ♦ తెంచినారు॥

రాము—(కోపముతో) ఏమి ఇంకను రాక్షసభయమా! ఇదిగో దురాత్ముఁడగు నాకుంభీనసపుత్రుని సంహరించుటకు మాశత్రుఘ్నుని బంపెదను. జడియవలదనుము సౌమ్యా. హా దేవీ! ఏమి కానున్నావో, నిన్నెవ్వరి కొప్పగించి పోవుదును.

సీ॥ నీకన్నకూన నీ ♦ వే కాచికొనుమమ్మ భగవతీ! భూదేవి! ♦ భద్రిమమ్మ
నీయింటికోడలీ ♦ నెలఁతఁ బాలింపుమా లోకబంధూ! కృపా ♦ లోకనమున
మిముఁ జూడవచ్చు నీ ♦ మేదినీసుత సీత వరయరే తబిసి ము ♦ త్తైదులార!
జనకరాజర్షి పెం ♦ చినముద్దు గూఁతు నీ చానఁ బ్రోవరె దివ్య ♦ మానులార!
గీ॥ దిక్కుఁలేనిసీత కిఁక నీవె ♦ దిక్కటంచుఁ దలఁచి నీకొప్పగించి నేఁ ♦ దొలఁగుచుంటి
అరయఁ మెల్లని యాపన్న ♦ యైన దీనిఁ గరుణఁదలఁపూని దివిజగంగాభవాని! ॥

(నిష్క్రమించును.)

సీత—(కలలో) హా! ఆర్యపుత్రా! హా సౌమ్యా! (దిగ్గున లేచి) ఆర్యపుత్రవియోగముచే నల్లాడుచున్నట్లు లెంతపాడుకలఁగంటిని! (అటు నిటుఁ జూచి) హా! హా! నిద్రపోవుచున్న నన్నొక్క—

దానిం జేసి యార్యపుత్త్రుఁడు వెడలిపోయెనా? కానీ! ఎవ రక్కడ!

దుర్ము—(ప్రవేశించి) "అమ్మా! రథము సిద్ధముచేసితిని, ఆరోహింతురుగాక" అని కుమార లక్ష్మణులు తమతో విన్నపముచేయుమని సెలవిచ్చినారు.

సీత—(ఆలోచించి) ఇదిగో వచ్చుచున్నాను.

దుర్ము—దేవీ! ఇటురండు, ఇటురండు.

సీత—రఘుకులదేవతలకు నమస్కారములు. తపోధనుల కభివందనములు.

(అందఱు నిష్క్రమింతురు.)

ప్రథమాంకము.

సంపూర్ణము.

శ్రీరామచంద్ర పరబ్రహ్మణేనమః.

ఉత్తర రాఘవము.

ద్వితీయాంకము.

(అరణ్యమున సూతచోదితమగు రథముపై సీతయు, లక్ష్మణుఁడును బ్రవేశింతురు.)

సూత—అమ్మా! రథము నడుకానలోఁ బ్రవేశించినది. ఇచ్చటిదారి, కడుమిట్టపల్లములతో నున్నది. హెచ్చరిక విన్నవించుకొనుచున్నాను.

సీత—ఆర్యా! రథ మాపుఁడు. కుదు పెక్కువగ నున్నది. కూరుచుండ లేను. కొంతదూరము నడచెదను. సౌమిత్రీ! దిగుము. (అందఱు దిగుదురు.)

లక్ష్మ—సూతుఁడా! నే మరలివచ్చునంతలో గుఱ్ఱములఁగడిగి మేఁపుకొనుచుండుము. అమ్మా! మెల్లఁగ దారి చూచినడువుము. (నడుచుచుఁ దనలో) గమ్యస్థానము చేరువరకు నీయమ కేదే నొకముచ్చటఁ జెప్పుచుండవలయు. (ప్రకాశముగా) అమ్మా! చూడుము. ప్రకృతిరమణీయమైన యీయరణ్య సౌభాగ్యము పరిచితులమగు మనకే వింతగనున్నది!

సీ॥ తఱచుగానల్లి క్రిక్కిఱిసి, చీకటులీను తరువల్లికల పర్వ తములచఱులు
చఱులవెంబడిసన్న జాలులై ప్రవహించు నిసుకదేఱిన సెల యేళ్ళగములు
సెలయేళ్ళ యిరుగెలం కుల గోవజవ్వాది బుగబుగ ల్వాలయించు పొదరుటిండ్లు
పొదరుటిండులఁ జెంచు ఖ్యూఁబోండ్లు పిల్లనగ్రోవులం బాడు మేలుకులుకుఁబాట

గీ॥ పాటనాలించి, పరవశత్వమున మేఁతమాని వీనులనిక్కించి మ్రానుపడుచు
తేళ్లు నిలఁబడు పచ్చిక బీళ్లకలిమి నద్భుతావహమీయర ణ్యంబు సృష్టి॥

సీత—స్వామిత్రీ! నేను చిన్నబుచ్చుకొందు నేమోయని, యడిగినదే తడవుగా మీయన్నగారు నాప్రయాణమున కంగీకరించిరి. కాని బయలుదేరు నప్పటి నుండియు నొకటిపై నొకటిగా దుర్నిమిత్తములే నాకుఁబొడగట్టుచున్నవి. నిర్నిమిత్తముగ నాకసము విఱిగి నెత్తిపైఁ బడునట్లున్నది. మనసేమో పరిపరివిధముల విలవిలలాడుచున్నది. మఱిది! యెందులకో కాని,

గీ॥ సప్త్రిలో నేదిగన్గొన్న ♦ నేది విన్న
నాత్మ, భయసంశయముల న ♦ ల్లాడఁజొచ్చె
నేఁ డదేమో చెలంబడ్డ ♦ నాఁడువోలె
మనసు చెయివెట్టి కలఁచిన ♦ మాద్రి నుండె॥

లక్ష్మ—(స్వగతము) పాపమీమంద భాగ్యురాలికి రానున్న దురవస్థ యీదుర్నిమిత్తము వలననే సూచితమగుచున్నది. ఈయమ సంశయములకు నేనేమని పరిహారములు చెప్పఁగలను. (ప్రకాశముగా) అమ్మా! ఈశకునము లొక్కొ—కతఁటఁగాకతాళీయముగ సరిపోవు నవి, వీనికేమి.

చ॥ ఇలజనియించి నీవొకరి ♦ కెగ్గొనరింపవు; పూర్వకర్మదు
ష్ఫల మనుభోగ్యమౌటఁ జేసిఁ ♦ బొసి చిరంబు విపత్పరంపరఁ
వలసెఁగృశింపఁగా; విధివి ♦ పాకము దాటఁదరంబె, యేలయు
మ్మలికఁగలంగఁ జింతిలిన ♦ మాత్రము తప్పునె వచ్చుకష్టముల్?

సీత—వత్సా! నీవెంతధైర్యముఁ జెప్పుచున్నను నామదికేమియు సమాధానముగాలేదు. ఈప్రయాణము నాకెంతమాత్రము సంతోషాస్పదముగాలేదు. ఇక్కడినుండి పురంబునకు మరలి పోవుటయే మేలు. రథం బింక మరలింపుము.

లక్ష్మ—(స్వగతము) అయ్యో! నాకిప్పుడేది తెలివు.

గీ॥ అరదముమరల్ప నన్ను భ ♦ యార్తయగుచు
వేడికొను జానకింజూచి, ♦ విభునియాజ్ఞ
దలఁచుకొన్న; రథంబు ముం ♦ దరికిఁగాని
పిఱిఁదికింగాని నడిపింప ♦ వెఱచు మనసు॥

రాజాజ్ఞ నే కారణమునఁగాని యుల్లంఘింప రాదుగదా. (ప్రకాశముగా) జానకీదేవీ! దిగులొందినకొలంది డెందమున కేవియో పాడు తలంపులూరుచునేయుండును. హృదయము కొంత కుదురుపఱచుకొనుము.

సీత—వత్సా! సౌమిత్రీ! నిర్నిమిత్తంబుగ నాచిత్తమున కిట్టిపరితాపము కలుగుట కేమికారణమో తెలియకున్నది. అవస్థలంబడి చెడియున్న ప్రాణముగావున నేమాత్రము మనసుచివుక్కుమన్నను వెనుకటినాదురవస్థ స్మరణకు వచ్చుచుండును. నాయనా! ఋష్యశృంగాశ్రమమునుండి మఱేమియు దుర్వార్తవచ్చియుండదుగదా. ఇంతకు నేనుబయలుదేరునప్పటి కార్యపుత్రుఁడు కొలువుకూట మందుండుటచే నొక్కమారు చూచివచ్చుట కవకాశము కలుగదయ్యెను. వత్సా! నీవు మీయన్నగారినిజూచియే వచ్చితివిగదా? వారు క్షేమముగానున్నారా? చెప్పుము.

లక్ష్మ—దేవీ! యెవ్వరిక్షేమమున కేకొఱంతయు లేదు. చూడుము,

మ॥ అణఁగుఁగ సంశయమెల్ల, నల్లదె తరం ♦ గాభంగ గంగాతరం
గిణి; యాపొంత తపోవనంబు; సవనా ♦ గ్నిద్యోతమానంబు, కా
రణదేహుల్ నిరవగ్రహుల్ నిగమతం ♦ త్రివ్యగ్రులౌ తాపసా
గ్రిణు లచ్చోఁవసియింతురు; వారల సప ♦ ర్యల్ నీకు శ్రేయంబగుఁగ॥

సీత—ఏమోకానిమ్ము. మిగిలివచ్చితిమి. మున్యాశ్రమదర్శనాభిలాషము నాకుఁ గలుగకుండినను బాగుండెడిది. ఆర్యపుత్రునివిడిచి

నేఁటికప్పుడే రెండుదినములు కావచ్చుచున్నది. అందువలన నాడెందము మఱింత దిగులొందుచున్నది. కానీ! ఆకనఁబడునది యేనా భాగీరథి? వత్సా! రఘుకులదేవతయగు నీభాగీరథీజన్మ మెంతపవిత్రమైనది.

లక్ష్మ—అమ్మా! ఒక్కజన్మమే యేల? ఈయమ చారిత్రమంతయుఁ బవిత్రమైనదే.

సీ॥ దేవదేవేశ్వర ◆ ధ్యేయమహా హరిపాదకమలనాళము సూతి ◆ కాగ్రహంబు
పరమౌషధీలతా ◆ వాలమూలంబైన ప్రాలేయనగ ముగ్ధ ◆ బాలగిండి
దరచంద్రచంద్రికా ◆ ధౌతనిర్మలమైన భవుజటాజూటంబు ◆ పడకటిల్లు
ప్రాజ్యమహీశ్వరయజ్ఞ ◆ వాటీపవిత్ర మార్యావర్తభూమి క్రీ ◆ డాంగణంబు
గీ॥ పరమపావనమైన జీ ◆ వనసమృద్ధి వెలయు యమునాతరంగిణి ◆ చెలిమికత్తె
ప్రియబలరత్నాకరసతితోడి ◆ బాంధవంబు పొగడఁదరమె వియన్నదీ ◆ పుణ్యచరిత॥

(సీతా లక్ష్మణులు నదీతీరమున కేగుదురు.)

సీత—భగవతీ, భాగీరథీ! నమస్కారము. (నమస్కరించును.)

లక్ష్మ—దేవీ; మనమింక నావలిదరికిఁ జేరుదము, ఓరీ పల్లీ! మాకుఁ బడవసిద్ధము చేయుము.

పల్లె—దొరా! దయచేయుండి, చిద్ధముగానే ఉంది.

(సీతా లక్ష్మణు లవ్వలిదరికిఁ జేరుదురు-రథముతో సూతుఁడివ్వలనే నిలిచియుండును.)

సీత—వత్సా; సౌమిత్రి! మనము దారితప్పి పెడదారింబడలేదుగదా? నాకేమో భయమగుచున్నది. ఇక్కడ నెక్కడను జడదారుల యాశ్రమస్థలంబులజాడయే కనఁబడదు చూడు; పోను బోను నాధైర్యముతోపాటు ప్రొద్దుగూడఁ గ్రుంకుచున్నది. చెవులు చిల్లులుపోవనఱచు కీఁచురాళ్ల యలికిడిదక్క మానిసియలికిడియే గానరాదు.

సీ॥ మునిమాపు సందెవా ◆ ర్పునకునై మిన్నేటిపాయ కేతెంచు తా ◆ పసులుగాని
లేఁగదూఁడల మరుల్ ◆ రేగి యంభాయంచు సందెమల్లెదునాల ◆ మందగాని

తెలియేటియిసుక, వె ♦ న్నెలనప్పలాడి, యిండ్లకుఁబోవు మునికుమా ♦ రికలుగాని
కుశపత్రములఁ గోసి ♦ కొని, యొండొరుం గెల్చుపరుగులఁ జను పిల్ల ♦ వటులుగాని
గీ॥ తీరి నలిగిన కాల్నడ ♦ దారిగాని, యిచటఁగవరాదు మునిపల్లె ♦ లెంతదవ్వొ
మూసికొనివచ్చుచున్నవి ♦ మొలకయిరులు నేమిటికివచ్చిన ప్రయాణ ♦ మిది మఱంది!

లక్ష్మ—తల్లీ! యిది నీకై నీవేకోరి తెచ్చికొంటివి. చింతించుట యెందులకు? మున్యాశ్రమములు చూడవను భయ మక్కఱలేదు. చేరువకే వచ్చితిమి.

సీత—అయ్యో సౌమిత్రీ! మన మంధకారమునఁ బడిపోవుదుమేమో

లక్ష్మ—అమ్మా! మనమేమి లోకమే యంధకారమునఁ బడనున్నది.

సీ॥ లోకబాంధవుని యా ♦ లోకంబునకుఁ బాసి ప్రకృతి తేజోదరి ♦ ద్రాణమయ్యె
నెఱసంజచిచ్చునం ♦ దుఱికెఁ జెన్మటితోడ ఛాయాపురంధ్రి య ♦ స్తంగమించె
కవఁబాసి పెంటిజ ♦ క్కవ దుస్సహవియోగమున నెలుంగెత్తి వా ♦ పోవుచుండె
తననాథుని ప్రవాస ♦ మునకు గాసిలి తేఁటియెలుఁగునఁ బద్మిని ♦ యేడ్చుచుండె
గీ॥ వీరిఁ గని గుండెనీరయి ♦ విపినరమయు విపులవిహగారవంబుల ♦ వెక్కివెక్కి
యేడ్చుచున్నది, తల్లిరో! ♦ యెన్నఁడరమె కాలమహిమంబులో నెన్ని ♦ కళలుగలవొ॥

సీత—ఏమిసౌమిత్రీ! ఏమో యుపన్యసించుచున్నావు. నేఁడు మొదటి నుండియు నీవున్నవిధము నాకు మిక్కిలిసంశయాస్పదముగా నున్నది. నాయనా! ఎన్నఁడుగాని ప్రసన్నతంబాయని నీవదనం బిటు చిన్నవోవుట కేమికతమయ్యా?

సీ॥ అన్నగారేమైన ♦ నాగ్రహించిరటన్న నీయందుఁగాసంత ♦ నెపమురాదు
ప్రియభార్య ప్రతికూల ♦ విధిఁజేసెనా యన్న ననుకూలదాంపత్య ♦ మన్నమీదె
పొరపాటుచే నాడి ♦ బొంకితి వనియన్నఁ దారలు తమగతు ♦ ల్దప్పలేదు
యుద్ధరంగమునందు ♦ నోడి వచ్చితివన్న సురలైన నిను దేరిఁ ♦ జూడలేరు
గీ॥ ప్రజ లతిక్రాంతగౌరవ ♦ భావులగుచు నందునిందున నిన్నెగ్గు ♦ లాడిరనినఁ
బ్రజలకు విరోధిగాదు నీ ♦ వర్తనంబు కటకటా! యేలనీకింత ♦ గానిచింత॥

లక్ష్మ—(స్వగతము) అయ్యో ఈ యిల్లాలికిప్పుడు నేనేమని సమాధానముఁ జెప్పుదును. కర్ణకఠోరమైన శ్రీరామాజ్ఞ నీ సాధ్వీమణి

కెట్లు వచింతు. ఛీ! లక్ష్మణా! జన్మమెంతటిపాతకమునకు హేతు భూతమైనది. ఇంతకుమునుపే నీ జీవితమంతమైయుండిన నింతటి దారుణకృత్యము నీవలనజరిగియుండకుగదా. (కన్నీరుగార్చును)

సీత — (ఆతురతతో) ఏమి నాయనా! వెక్కి వెక్కి బాష్పజలంబుల విడుచుచున్నావు. చెప్పుము, నీపరితాపకారణమేమో తెలిపి నాకు మనశ్శాంతి కలిగింపుము.

లక్ష్మ — తల్లీ! నీకింకెక్కడి శాంతి.

గీ॥ సాధుజనములఁ బీడింప ♦ జన్మమెత్తి
చావకున్నాఁడు పాపి ల ♦ క్ష్మణుఁడు వీఁడు
మఱేది గాఁడమ్మ సీతల్లి ♦ భరముదీరు
కఠినశాపంబొసంగి పో ♦ కార్పుమమ్మ.

సీత — నాయనా! అదేమోయీ అట్లనుచున్నావు? ఇంతటిదైన్యమునకుఁ గారణమేమో యెఱింగింపవేమి?

లక్ష్మ — ఉ॥ తెంపున నింతదూరమరు ♦ దెంచి రఘుప్రభునాజ్ఞ నీకెఱిం
గింపకపోదునమ్మ! పురి ♦ కిఁక? వినుతల్లిరో! లోకనిందకుఁ
గంపిలి రామచంద్రుఁడు వ ♦ నంబుల నిన్ విడిరమ్మటంచు న
న్నంపె దురంతఘోరదురి ♦ తాళికిఁ జాలినవాఁడ నౌటచే॥

(అని సీతపాదములపైఁబడును)

సీత — హా! రామచంద్రా! (మూర్ఛిల్లును)

లక్ష్మ — అయ్యో! ఈ యిల్లాలికెంతటి దుర్వార్త వినిపించితిని. హా రాఘవేంద్రా! సౌశీల్యగుణాభిజాతయగు నీ సీతామహాదేవిని జేతులార నీ కీకారణ్యంబున డించి యీమె దురవస్థనంతయుఁ గన్నులారఁ జూచి యోర్చుటకుందగిన కటికమానిసిననియా నన్నే యీమహాకార్యమునందు నియమించితివి? అక్కటా!

దుఃఖపారవశ్యముచేఁ గలిగిన యీమూర్ఛ యింకనెంతటి ముప్పునకుఁ గారణమానోగదా? అయ్యో! దైవమా! దిక్కుమాలిన యీరామకుటుంబిని నీవిపత్తునుండి దరిఁజేర్చువారు లేరుగా! కానీ,

శా॥ నాచిత్తంబు పవిత్రరామపదచిం ♦ తాయత్తమేనిన్, మనో
వాచాకర్మములందు ధర్మనిరతిన్ ♦ వర్తింతునేనిన్, ధరి
త్రీచక్రంబున "సత్యమేవ జయ"తీ ♦ తి ఖ్యాతి నిక్కంబయే
నీ చూలాలి కపాయముల్ దొలఁగు గా ♦ కీ ఘోరమూర్ఛాగతిన్॥

సీత—(మూర్ఛనుండి లేచి) నాయనా! ఇదేమి కలయా? మునిపత్నులఁ జూచిరమ్మని కదా మీయన్నగారు నన్నంపినది? మఱిది! మాటాడవేమి?

శా॥ అన్నా! లక్ష్మణ! నిందయేమి, ననుబా ♦ యంబూను టేమీ, కలం
గన్నావో? కలఁతన్ వచించితివో వ ♦ క్కాణింపు మింకొక్కమా
ఱెన్నిక్షేతుకదుర్వియోగము నిజం ♦ బే యైనచో నింక నే
నున్నా, నున్నదిగంగ చెంగటనె, యె ♦ ట్లో యోగమట్లయ్యెడున్॥

లక్ష్మ—తల్లీ! ఆత్మహత్య యెంతేనిపాతకము. అందున వీరమాతవు కానున్ననీ విప్పుడే దేని తెంపునకుఁ బూనితివా భ్రూణహత్యకుఁ గూడ బాల్పడినదానవగుదువు. దేవీ! కలరూపు నీకు నా నోట నేమని విశదీకరింతునమ్మా.

చ॥ పనిగొని నిన్ను నట్టడవి ♦ పాలొనరించినయట్టిపాపమే
నను దహియింపనుండ భువ ♦ నత్రయపావనివైన నిన్ను దు
ర్జనుఁ డొకఁ డాడినట్టి యపు ♦ రాధ మరుక్తుల నోటమీఁదుగా
వినుచు దురంతపాపపరి ♦ వేదన కేమయిపోదుఁ దల్లిరో.

దేవీ! నాహృదయము బ్రద్దలగుచున్నది. వక్కాణింపఁ జాలను. ఇదిగో రాజుగారి యాజ్ఞాపత్రము.

సీత— (లోనఁ జదివికొని) అయ్యో! ఈనిందోదంతంబు వినియు నిలువు సిరుగా నాశరీరము భస్మీపటలముగాకుండెనే. అయ్యో! నేనెంత పాపమున కోర్చితి. హా రామచంద్రానుజా! మందభాగ్యురాలైన యీజానకి సౌఖ్యమున కేదియో యొకయంతరాయము సంభవించుచునేయుండును. సౌమిత్రీ! నాఁడామాయామృగరంగంబును, నేఁడీ ప్రజాపవాదమును నీసీత జాతకమునకు దుష్టగ్రహంబులై యామరణాంతము వేధింపఁజొచ్చెనే అయ్యో! అయ్యో! ఎంతటిమాటపుట్టెను. అన్నా! ప్రాణముకన్న మిన్నగమన్నించు మీయన్నగారు నన్నీలాగున నడవిపాలు చేసెనన లోకమీపరివాదముఁగూర్చి నిజమని విశ్వసింపకుండునా? సౌమిత్రీ! నిన్నఁగదా మీయన్నగారు "దేవీ! నీవు నాప్రాణముకన్నను నెక్కుడు ప్రేమాస్పద"వని బహూకరించినది. ఇంతలో నింత విపర్యయంబెట్లు సంభవించెనయ్యో? నాయనా! ఇట్టి యపనింద మీరేచందమున విశ్వసించితిరి?

శా॥ ఆనాఁ డంతపరీక్షతోఁ దెలియ లే • దా? పాపమో పుణ్యమో
ఆనిర్ణాయకు లిప్పుడేమయిరి? లేఁ • డా వేల్పుఱేఁ, డగ్నిలేఁ
డా, నీరేజభవాది దేవతలు లే • రా? వారువీరేల లే
దా నన్నింతకునేలు నాపతి మన • స్సాక్ష్యంబు సల్లక్ష్యమై॥

సౌమిత్రీ! ఆఁడుదాననైన నాకు బుద్ధి యత్యల్పమైనను సకల ధర్మాధర్మ కోవిదుఁడవై సుగుణములయందు మీ యన్నగారి కెందును దీసిపోనివాఁడవు నీవైన నిష్పక్షపాత బుద్ధితో నాయవస్థ యించుక యోజింపుము,

సీ॥ నిందించెనేచూడు ♦ నీచాధముఁడెవండో పతి తాఁగణించుటే ♦ పాడియయ్య
పాడియే యనిచూడు ♦ నాఁడగ్నియందునే నఱికిన కథగూడ ♦ మఱతురయ్య
మఱతురేచూడు మీ ♦ మాటతా నేనాకు మునుదెల్పనే మొగ ♦ మోటమయ్య
మొగమోటమేచూడు ♦ తగవెంచి నన్ను నీరాడుదాక భరింపఁ ♦ గూడదయ్య
గీ॥ అకటకట! నిందుమూలాలి ♦ నైననన్ను విడిచి తద్ధ్యానమైన యీ ♦ యడవియందు
దిక్కెవరు లక్ష్మణా! మీవ ♦ దినరు నింకనెవరు నీరార్చువారు నా ♦ కేది తీరు॥

మఱఁదీ! ఎంత వైపరీత్యము సంభవించెను. భగవంతుండగు నగ్ని భట్టారకునిచే నాఖ్యాతంబైన నాచరిత్రమున కిప్పుడు మరలఁ బ్రత్యాఖ్యానములు బయలుదేరినవిగా?

లక్ష్మ—దేవీ! దేవయజనసంభవా! మా దురదృష్టవశమున నిట్టియనాచ్యప్రవాదములు సంభవించినవిగాని, నీసౌశీల్యమొక్కరు నిర్ణయింపవలసినదా ?

మ॥ అనలుం డెవ్వఁడు నీచరిత్రకు నుపా ♦ ఖ్యానంబుగావింప, నీ
తనుసంస్పర్శము సర్వభక్షకతచే ♦ తం గల్గు దుష్పాప మా
తనికింబాపె, భవన్మహామహిమయూ ♦ తంగాక, లోకత్రయీ
జనవిద్రావణరావణాద్యసురహిం ♦ సల్ మాకునుఁ శక్యమే ?॥

తల్లీ! ఇట్టి సుశ్లోకవు నీవు పలుగాకులగు నీలోకులకుఁ గాకపోయితివి.

సీత—నాయనా! ఇది నానోఁచిన నోము ఫలము. ఇందులకు లోకులు దూష్యులుగారు.

లక్ష్మ—తల్లీ! లోకులుగారు మొదటినుండియు నేనే దూష్యుఁడను. నీకింతటి ఘోరపర్యవసానమునకుఁ గారణమైన యారావణాపహారణమునకు నాదికారణమే నేను గదా.

మ॥ "దనుజుల్ గ్రుమ్మఱుచుండ్రు, మీవదినెభ ♦ ద్రింబంచు మాయన్న నా
యునికిన్నమ్మ, కురంగమేయఁజన న ♦ య్యో! యోర్మిలే కొంటిగా

వనవీథిఁ నినుడించి రావణున కొ • ప్పంజెప్పితిఁ నాఁడు, త
ప్పనిపాపంబున నేఁడు నీయడవికొ • ప్పంజెప్పితిఁ దల్లిరో॥

సీత—తండ్రీ! ఆవృత్తాంతము తలపెట్టకుము. అప్పటి నాగట్టివాయితనమునకు నాయంతరాత్మ యిప్పటికెంత క్షోభించుచుండునో యా పరమేశ్వరుఁడెఱుంగు. ఒప్పులకుప్పవైన నీయం దొకనాఁడైనఁ దప్పు గలుగునయ్యా? కలలోనైన నీవు నాకపకారంబు దలఁతువా నాయనా?

ఉ॥ నీవు మఱందివా తలఁప • నిక్కము బిడ్డవుగాక నాకు, వ
త్సా! వనవాసదుఃఖ మిసు • మంతయుఁ గన్పడకుండ నిత్యముం
బూవులఁ బండులందనిపి • ప్రోచితి నన్నుపచారభంగి; నీ
పావనశీలమెంచక య • వాచ్యములన్ నినుఁ దిట్టితిన్ గదా॥

బిడ్డా; ఏపాపమెఱుంగని నిన్నుఁ బాపపుఁబలుకులాడిన యీపాపాత్మురాలి కప్పటి శిక్షానుభవము చాలునా? మరల నింతటిదురవస్థ రాఁదగినదే. తండ్రీ! అందునఁగాని యిందునఁగాని నీవుచేసినదేమున్నది? మొదటినుండియు నన్నుఁగట్టఁ దాళ్లు నేనే తెచ్చికొంటిని చూడు;

సీ॥ మాయదారిమెకంబుకై యాసపడి, నాఁడు పతి నలయించిన • పాతకంబు
మతిమాలి నాఁడు నీ • హితబోధకైకొక యనఘాత్మ నిన్నాడు • రిన యఘంబు
కలుషరక్కసునింటఁ • జెఱఁబడి యన్నినాళ్ళాసఁగాలముఁబుచ్చి • నట్టిదోసఁగు
పతిచేతనిరసింపఁ • బడి చిచ్చునన్ జొచ్చి మొండినై జీవించి • యుండుకలుష
గీ॥ మన్నిఁటికి నెల్లముఖ్యమె • యవనిపైన నాఁడుపుట్టువునై పుట్టి • నట్టిపాప
మింతయును బండి నన్నిట్టు • లేఁచుచుండఁ బరులు కారకులనుటకా • స్పదముగలదె॥

లక్ష్మ—తల్లీ! సతీమతల్లీ! ఎంతమాటాడికొంటివి. ఆజన్మపరిశుద్ధురాలవగు నీకుఁగూడ నొకపాపమా?

ఉ॥ నీవు పతివ్రతామణివి • నిజజననం బిలకున్ విశేషపు
ణ్యావహమయ్యె, నీచరిత • మా మగనాండ్రకు మేలుబంతి, నీ

పావనమూర్తి నిత్యము ప్రభాతమునన్ గనుఁగొన్న జన్మజ
న్మావిలపాపముల్ దొలఁగ వా ననుఁబోలిన దుర్జనాళికిన్ ?॥

అమ్మా! ఇట్టి లోకమాతను నిన్నుఁ జేతులార నీక్రూరారణ్యమున కొప్పగించిన నా ఘోరపాప మెన్నిజన్మాంతరములఁ దీరవలయు? ఇప్పుడు నిన్నూఱడించుటకైన నాకు నోరు లేదుగదా.

సీత—సౌమిత్రీ! నీవమాయికుఁడవు! ఈమందభాగ్యురాలి కూఱట గలిగింపఁగలవా రెవ్వరు? దుర్భర దుఃఖానుభవమునకై యేర్పడినదే కదా యీజన్మము. కాకున్న నీదుర్యోగమేమి? పుట్టినింటఁజూచినను మెట్టినింటఁజూచినను గంపంత బలగమే; జగదేకప్రాజ్యమగు సామ్రాజ్యవైభవమే; లోకేశ్వరేశ్వరుండనందగిన ప్రాణేశ్వరుఁడే; వినయధురంధరులగు నీయట్టివారు మఱందులే. ఇంత యుండియు నేమి ప్రయోజనము,

చ॥ 'బ్రతికినయంత కాల మపవాదములన్ భరియించి, భార్యయున్
బతియును ముద్దుముచ్చటల భాగ్యము లేమియు లేక, మొండివై
బ్రతుకు'మటంచు నానొసట వ్రాసెను తీరిచి మూఁడుబంతులన్
మతకరిబ్రహ్మ, నీవిపుడు మార్తువె నాతలవ్రాఁత లక్ష్మణా!॥

లక్ష్మ—తల్లీ! దుఃఖింపకుము. ఎల్లకాలం బీకష్టములే కాఁపురములు చేయునా? ఎప్పటికేమో యెవరెఱుంగుదురు. బండ్లోడలగును, ఓడలు బండ్లగును. ఏనాఁటికైన నీకు శుభదినములు రాకపోవు?

సీత—నాయనా! ఇప్పటికి నిట్లయినదికదా!

సీ॥ కఱకంఠుచాపంబు విఱిచి నన్నుద్వాహమాడిననాఁటిగాఢానురక్తి
అవినయున్ గ్రూరకాకాసురున్ వెఱపించి నన్నుఁగాపాడిన నాఁటిప్రేమ
నరహంత్రియగు చుప్పనాతిముక్కుంజెవుల్ నఱికి నన్మన్నించు నాఁటిచెలిమి
వనతాశిఁగట్టి రావణుఁగొట్టి నాచెఱంగడ తేర్చినట్టి నిక్కంపునెనరు

గీ॥ నేఁటితోనొక్కపౌరుని ♦ మాటచేత వ్యర్థమగుటల్ల నాపాప ♦ వశతఁగాక
రామచంద్రుని దూఱంగ ♦ నేమిగలదు విధివిధానంబునెవరు త ♦ ప్పింతురయ్య॥

ఇంతకు సౌమిత్రీ! సత్యసంధునకు శ్రీరామచంద్రునకు నాపైఁ గల యపూర్వప్రేమానుబంధ మీయపవాదము వలనఁ దొలంగెనని తలంతునా ?

లక్ష్మ—తల్లీ! ఛాయాప్రభాకరుల యనుబంధమెన్నఁటికైన మాఱునా?

సీత—వత్సా ! మాఱదు నిశ్చయమేకాని, ఒక్కవిషయము మాత్రము నాహృదయమును వేధింపక మానదు. చూడు,

చ॥ తనయపనిందఁబాపికొను ♦ దారికి నేనును లోనుగానె? యి
ట్లని తుదిమాటకేని తగ ♦ నా? మొగమోటముఁబెంచి తేనియా
జ్ఞను మరలింతునయ్య? కడ ♦ సారి దనుం బెడఁబాయుచో మనం
బునఁగల నెయ్యముం దెలుపు ♦ ముచ్చటకేనియు నోఁచనైతినా ?

లక్ష్మ—తల్లీ ! అట్లనకు, తనప్రాణముకన్నను బ్రేమాస్పదవగు నిన్ను, పరమపతివ్రతాశిరోమణివగు నిన్ను, నిరపరాధవగు నిన్ను గృహిణివగు నిన్నుఁ దనహృదయము విశ్వసింపని కేవల మిథ్యాప్రవాదమునకై మొగమెదుటఁ గఠోరముగ "నన్నువిడిచి యెందేని యరణ్యభూములకుం బొమ్ము" అని యాజ్ఞాపించుటకుఁ గరుణాస్వభావుండగు శ్రీరామచంద్రునకు నోరాడు నమ్మా? చూడు,

చ॥ ఒకయెడ స్వప్రజానికృతి ♦ యొక్కెడ నాత్మసతీవియోగ మా
త్మకువిషమంబులౌ, బలువి ♦ ధంబులయోజనఁజేసి, భూమినే
తకు జనరంజనంబె విహి ♦ తంబగుటన్, మొగమోటమెంచి యిం
తకు ననుఁ బంపె నీపతి మ ♦ నంబెటువంటిదిదో నీవెఱుంగవే ! ॥

క॥ శరణంబిఁక నీచరిత
స్మరణంబే నీదుపతికి ♦ జానకి ! జీవ

స్మరణంబునఁ దగు తన సం
సరణంబుఁ దరింప విరహ • సంతాపమునన్ ॥

సీత—వత్సా! దుఃఖపరవశత్వమున నేమో యాడితిఁగాక, సరళహృదయుండగు నాపతికి నాపైఁగల స్నేహవాత్సల్యం బెఱుంగని దాననుగాను. నేను మున్ను రావణక్రూరనిర్బంధమునయున్న సమయమునఁ గరుణాసముద్రుం డాతండు నాకై యనుభవించిన పరితాప మాంజనేయునిచే విన్నదాననుగానా? అక్కటా! రాజధర్మ మెంతదారుణమైనది. చేపట్టిన యిల్లాలియెడనైన జాలిదలంచుటకు స్వాతంత్ర్యము నొసంగదయ్యెనే? నన్నుఁగూర్చి ప్రజాసముదాయమున వ్యాపించినది మిథ్యాప్రవాదమని తెలిసియుండియు నింతటిసాహసమునకుం దెగి జగదారాధన దీక్షాధురంధరుండగుట, కాకుత్స్థాన్వయప్రదీపకుండగు శ్రీరామభూపాలున కొక్కనికిం జెల్లెఁగాక, యొరులిట్టి వీరవ్రతంబొనరింపఁ గల్గుదురే! ఇంతకు నాయనా! నాకీజన్మమున శ్రీరామచంద్రచరణారవిందపునస్సేవాభాగ్య మెన్నఁటికైన లభించునా?

సీ॥ ఈకనుంగవ యెన్నఁ • డేనిఁ గన్గొనునొకో కామితస్ఫూర్తి శ్రీ • రామమూర్తి
ఈకర్ణయుగ మెన్నఁ • డే వినం గలుగునో కపురంపుఁ బలుకు రా • ఘవుని పలుకు
ఈకరద్వయ మెన్నఁ • డేని సేవించునో మోక్షప్రదంబు రా • ముని పదంబు
ఈజీవితం బెన్నఁ • డేని పావనమౌనో ప్రాణేశు చెలిమిఁ ద • పంబు కలిమి
గీ॥ ఎన్నఁటికినైన నేవేల్పు • లేని, నేమునీశులేని దయాళులై • యీదురంత
విరహవారాశిలోనుండి • వెలికివైచి జీవితేశ్వరుపజ్జ నన్ • జేర్తురయ్య!॥

లక్ష్మ—తల్లీ! నీవంటి పతివ్రతామతల్లుల సంకల్పంబు లేనాఁటికైన సఫలములుగాకపోవు. దేవీ! నీకింక విన్నవింపవలసిన దేమున్నది?

ఉ॥ దాయలకైన రాఁదగని • దారుణమైన యవస్థ నీకు నె
ట్లో యనుభావ్యమయ్యె, నిఁక • నుమ్మలికం దిగమ్రింగి నీమనో

నాయకు రామచంద్రుని మ • నంబున నిల్పి దినంబు లెట్టి
త్రోయఁగదమ్మ, తాపస వ • ధూటులతోడఁ దదాశ్రిమ

సీత—వత్సా! నీకునాపైఁగల భక్తివాత్సల్యముచే నిట్లా
నాయనా! నేనిప్పుడున్న తెఱంగునకుఁ దోడ్పాక్కరిప
నలసిన దినములోయివి.

మ॥ కలకాలంబిటు చేసికొన్నపతికిం • గాకుండ నేకాకినై
యిల జీవించుట యెంతహైన్యమగు? న • న్నేరైన "నేలా
డిలు వెళ్ళించె వచింపు"మన్న నపుడే • యీప్రాణముల్ పో
తలఁగోసం దలయెత్తి నే బ్రతుకఁజ • న్నా యింతకుం బాత

వత్సా! దురంతమైన నాయీ వియోగదుఃఖముః
కు నిపరిమితిలేదుగదా. హతాశురాలనై యొరుల పం
నీచత్వమునకోర్చి యెవ్వరికొఱకై శరీరయాత్ర సాగింతును?

లక్ష్మ—తల్లీ! సకలధర్మ రహస్యంబుల మూలముట్టముగ
నీకెద్దియేని బోధించుట కేనెంతవాఁడను కాని,

సీ॥ తనువుపైఁ బ్రోసి కూ • డని సాహసముఁజేసి పతినిరాముని నిందఁ • బఱుప
తాల్మిమై మెచటనో • తలదాఁచికొనియుండి కష్టకాలం బెట్లొ • గడుప
ఏనాఁటికైన మా • కింతయాధారమౌ నీగర్భమేని మ • న్నింపు మమ్మ
పతియాజ్ఞ మున్నె చె • ప్పక నిన్ను వనికీడ్చు తెంపటికె నన్నుఁ దు • మిఁ

గీ॥ ఒదిగి భవితవ్యమనె నమ్మి • యుండుమమ్మ వేల్పులే నిన్ను విభుని క • ర్వి
సెలవొసంగుమమ్మ నన్ను రక్షింపుమమ్మ కడపు సీతమ్మ! యిదె నమ • స

తల్లీ! నేనగ్రజుని పాదోపజీవినని యెఱుంగుదువు. ప్రాణ
సమయమునకైన నేనుమాయన్నగారి యాజ్ఞనుల్లంఘించియె
కావుననే యింతటి ఘోరకార్యనిర్వహణమునకై యార్యుః
నన్నేనియమించె. తదాజ్ఞానువర్తినై మీయెడ మహాపరాధము?
దుర్భరగర్భాలసవగు నిన్నేకాకినిఁగా నీకీకారణ్యమున డించి

నింటికిఁబో సెలవడుగుచున్నాను. మన్నింపుము. తల్లీ! నాయెడఁ బుత్రవాత్సల్యము మఱవకుము.

(అని పాదములపైఁబడి నమస్కరించి దుఃఖించును)

సీత—(చేతులంటి) నాయనా! దుఃఖింపకుము. మనోవాక్కాయకర్మంబుల నీయందు నాకెంతమాత్రము కోపము లేదు. అట్టి జీవితేశ్వరుఁడే కాదు. పుత్రసమానుఁడగు నీయట్టి మఱఁదియు లభించుటచేతనే నిజముగా నాజన్మము పవిత్రమైనది. జన్మజన్మంబులకు శ్రీరామచంద్రుఁడే ప్రాణేశ్వరుండై లక్ష్మణుఁడే మఱఁదియగుటకు నిత్యము వేయిదేవతలకు మ్రొక్కుచుండెద. నాయనా! నీవిఁక మరలిపొమ్ము.

సీ॥ కన్నీరు మున్నీరు ♦ గా నేడ్చి నీవు నా విధివిధానంబు ద ♦ ప్పింతువయ్య
తడవైన చోమాట ♦ వడుదు వింటికి నేగి మఱఁది లక్ష్మణ! నన్ను ♦ మఱవకయ్య
ముగురత్తలకుఁ గేలు ♦ మోడ్చితినని సీత కాఁపురంబడవిలోఁ గలసె ననుము
విభునకు నామాట ♦ నభివాదన మొనర్చి ప్రాణానందనచింత ♦ బాయ ననుము
గీ॥ సడికి నోడి తెగించి నన్ ♦ విడిచి మొదటఁ బిదప నాకయి తపియించు ♦ విభునికంటఁ
దొరఁగు కన్నీరు నీవైన ♦ దుడువుమయ్య బ్రతికితిననయేని గాంతు ♦ పుట్టిక్కైన॥

నాయనా! నే నదృష్టహీనురాలను అటువంటి జీవితేశ్వరునితో భోగభాగ్యము లనుభవించునంతటి యదృష్టము విధి నా నొసటలిఖింపలేదు. అట్టిచిరదుఃఖినినైన నాకై నీవుగూడ నేలపరితాపము నొందెదవు. మహైశ్వర్యములఁ దులతూఁగుచున్నను నార్యపుత్రుని జీవయాత్ర నామూలమున దుఃఖభాజనమైపోయెఁగదా. కరుణాస్వభావుండగు నార్యపుత్రుండీదుర్భరవియోగదుఃఖమున నేమైపోవునోయని దుఃఖించుచున్నానుగాని వత్సా! నాయవస్థకై నేనంతగాఁ జింతింపను. నేనెక్కడ నుండినను, నార్యపుత్రుని కుశలవార్తమాత్రము నాకుఁ దెలియుచుండినఁజాలు. ప్రాణేశ్వరుని క్షేమమే నా క్షేమము.

నాయనా! సౌమిత్రీ! నీవుమాత్ర మెట్టిసమయమునను నార్యపుత్రుని నొంటరిగా సంచరింపనీకుము. నిరంతరము మీ యన్నగారి సన్నిధినే కొలిచికొనియుండుము. చిరంజీవులయిన భరతశత్రుఘ్నులు గూడ నార్యపుత్రుని సేవావిధియం దేమరకుండునట్లు నామాటలుగా వచింపుము. నా చెలియండ్రు నాకొఱకై బెంగపెట్టుకొందురు. వారి నెట్లోయూరార్చెదు. అయ్యో! మందభాగ్యురాలనగు నావలననెందఱెందఱి కెంతటి సంతాపము సంభవించినదో చూడుము; తండ్రీ! ఇంతకంటె నేనెవ్వరి కేమివార్తలనంపుటకుఁ దగియున్నాను. ఇంతకు నాజీవితేశ్వరున కేమని సందేశమంపుదును వత్సా! నన్నివిధికిం బాల్పఱచి నందులకు నేను తనపైఁ గినుకవహించితినని యార్యపుత్రుఁడు తలంచునేమో, వారితో నిట్లనుము,

సీ॥ తనకు లోకాపవా • దము మాసినఁ జాలు జీవమే నీయసం • సిద్ధ ననుము
తనకంటె నావని • కిఁ బరంబేమి నాతనువాత్మ సర్వంబు • తానె యనుము
తనయాజ్ఞఁ దలమోసి • కొని తపోవనభూమి శీలమే నమ్మి వ • సింతు ననుము
తనువులే దూరము • య్యెనుగాని యాత్మలం దైక్యమిద్దానఁ బెం • పయ్యె ననుము
గీ॥ విరహపరితప్తమయ్యు నా • ప్రేమలతిక యశ్రుజలసేకమున వృద్ధి • నందు ననుము
నిజమెఱిఁగి లోకమెపుడు మ • న్నించు నపుడె మరల నన్నేలుకొనుట ధ • ర్మంబయనుము

లక్ష్మణా! నాకు సంభవించిన యీదుర్భరవియోగమున నేను దుఃఖించుచునే యున్నచో నాకిక్కడ నొక్కక్షణమైన సాగునా? నేను దుఃఖము పూర్ణముగా విడిచిపెట్టినాను. నాజీవితవిషయమై యార్యపుత్రుఁడు సంశయవిహ్వలుఁడుగాకుండ నావచనములుగా నిట్లనుము.

మ॥ లలితస్మేరకలావిలాసము, విసీ • లభ్రూలతావిభ్రమం,
బలఘుప్రేమరసప్రసన్ననయనా • బ్జాలోకనప్రౌఢ, ము
జ్జ్వలతేజస్స్ఫురణంబు, శాంతరసభా • వస్ఫూర్తి మీమూర్తి నీ
స్తిమితానందమునన్ భజించుచుఁ దరిం • తున్ జన్మమాత్రేశ్వరా!॥

మ॥ కమనీయంబులు తావకీనగుణము • క్తారత్నముల్ ప్రేమ సూ
త్రమునన్ గ్రుచ్చి, జపక్రమాకలనఁ జే • తఃపీఠి మీఁదివ్యరూ
పమునంధించి, నిరంతరానుభవ సే • వా భావనా పారవ
శ్యమునన్ బుచ్చెద జీవయాత్ర, రఘురా • మా! దీనచింతామణీ!॥

వత్సా! సౌమిత్రీ! పొమ్ము నేను భవితవ్యమును బ్రతీక్షించుచు నిచ్చటి తపోవనక్షేత్రంబులఁ గాలక్షేపముఁ జేసికొనుచుందు. నేను దుఃఖమును మఱవనే మఱచితిని.

లక్ష్మ—మేలు, వీరపతివ్రతాశిరోమణీ! మేలు; ఇట్టి విషమస్థితియందు సహిత మేదోయొకధర్మనిర్ణయమునఁ గట్టుబడి చిత్తస్థైర్యము నిర్వహించుట ధీరమానసులగు పవిత్రదంపతులకు మీకు సులభసాధ్యమై చెల్లుఁగాక, అయ్యో! అల్పజ్ఞుఁడనైన నేనిట్టి ఘోర కర్మంబు చేతులారఁగావించి ప్రాణములభరింపఁగలనా, తల్లీ!

ఉ॥ 'నా' యనువారు లేని విజ • నంపు టరణ్యమునందు నిన్నుఁ ద
ల్లీ! యెటుడించిపోదుఁ బురి, • కేగక యిచ్చట నీపదాబ్జముల్
పాయక సమ్మికొల్చి నిర • పాయముగా వసియింతమన్న నే
మో! యెటులాడునో జగ, మ•యో! యెటుఁబోయిన నేమిమూడునో॥

ఎట్లో మనసు రాయిచేసికొని నిన్నీయరణ్యమధ్యమున డించి పోయినమాత్రము నన్నులోకము మన్నించునా?

మ॥ వికలత్వంబున రాముఁడింతపనికం • పెన్ జూడు, తానేమి యు
ర్వకుఁడా? దుర్భరగర్భభార, భయదా • రణ్యంబునన్ డించె, ఘా
తుకుఁ డాలక్ష్మణుఁడంచు నన్నుజనసం • దోహంబు నిందించు మా
టికి; వేయేటికి నింకనే బ్రతుకు కం • టెన్ జచ్చుటే మెచ్చగున్॥

తల్లీ! అసమర్థుఁడనైన నే నాత్మహత్య చేసికొనవసినదే కాని నిన్నీ దురవస్థనుండి తప్పించు యోగ్యతకు నోఁచుకొన లేదు గదా! నామాట యటుండ అమ్మా! ఈనీ పరిభవోదంతము శ్రవణగోచర

మైన యుత్తరక్షణమున, నెంత వైరాగ్యవంతుఁడైనను నీతండ్రి జనక క్షితీశ్వరుండు తన ప్రాణవాయువుల విసర్జింపకుండునా ? అయ్యో! ఎంతఘోర మెంతఘోరము నాతల్లీ! జానకీదేవీ; లేక లేక నేఁటికి నీగర్భమున రఘువంశ విస్తారకంబగు నింత యంకూరము చేకూరనున్న దని యీవల మేమందఱమును, నావల నీపుట్టినింటి బాంధవులందఱు నమందానందభరితులమై యెన్నియో కోరికల నువ్విళులూరుచుండ నన్నిటికి హేతుభూతవైన నీవే కన్నుల యెదుట లేకుండ నీప్రచం డారణ్యమున అయ్యో! పతిబంధువిదూరవై, నిర్గతికవై, నిరాధారవై, 'నా' యన్నవారు లేకుండ నల్లాడవలసి వచ్చెనే. అకటకటా; ఏకాకి నివై యీ కీకారణ్యమున నెట్లు ప్రాణములు రక్షించుకొందువు? మిట్టాడ నరుండు లేసి యీనట్టడవిలో నిన్నురక్షింపుమని యెవ్వరికొప్పఁజెప్పి పోవుదును? నారాయణా! దీనత్రాణపరాయణులైన కరుణామయు లలో నొక్కరును దిక్కుమాలిన యీరామకుటుంబినిం గాపాడువారు లేరుగదా! నావలెనే లోకమంతయు నిష్కరుణమై పోయెనా ? ప్రపంచమున విపన్నులయిన సాధుజనములఁ బరిపాలింపఁజాలిన నిర్హే తుకజాయమాన కరుణాలోకనస్వభావు లొక్కరును లేరా! ఓహో! లోకరక్షాదిదృక్షాశాలురగు లోకపాలకులారా ! మీలోనెవ్వరైన నీక్షణమునఁబ్రత్యక్షమై యీరామక్షితీశ్వరునర్ధాంగిని రక్షింపలేరుగా! హా నిరంతరాభ్యాగత సేవానిరతులైన యోతపోధనులారా! రామ మయజీవిత, పరమపతివ్రతాశిరోరత్న, మీసీతామహాదేవిని మీరైనఁ గాపాడలేరా ! ఓహో !! సిద్ధవిద్యాధరయక్షగరుడగంధర్వులారా! మీ రందఱేమూలలడాగియున్నారు? అయ్యో! ఎంతమొఱలిడినను నాయది యరణ్యరోదనమైపోయెనే! నాయట్టిపాపాత్ముని మాట లెవ్వరాలిం తురు కాని, పరమేశ్వరుని పరమాద్భుతసృష్టివిలాసమంతయు లోక మున వెల్లడించుచు, ననేకజంతుసంతానములకుఁ గన్నతల్లివలెనున్న

యీవనదేవతామతల్లికే యీనాతల్లి నొప్పఁజెప్పిపోయెదను. అమ్మా! వనదేవతా! నీవు సుగుణవల్లివి. ఆర్ద్రమానసమున నామనవియాలింపుము. కాలకర్మవశంబున నీకడ నివసింపవచ్చిన యీయిల్లాలెవరనుకొంటివో,

సీ॥ జనకరాజర్షిపా • వనయజ్ఞవేదియం దవతారముందిన • యాదిలక్ష్మి
శివధనుర్భంగము • నవగాఁగ శ్రీరాము కేలువైకొన్నద • ధూలలామ
కసిఁడికోఁతలకోర్చి • యసురాధమునివీటఁ గులసతీత్వమునిల్పి • కొన్నసాధ్వి
తనవినిర్మలచరి • త్రను నగ్నికీలలఁ బ్రకటీకరించిన • భవ్యశీల
గీ॥ భగవతి యరుంధతీదేవి • ప్రస్తుతించు పోలఁతులవలంతి, నిందుపాప్రి • ద్దులపడంతి
పతివిమోగార్త, సీతఁ గా • పాడుమమ్మ ధన్యగుణవల్లి! వనదేవ • తామతల్లి !॥

తల్లీ వైదేహీ! పాపభూయిష్ఠమగు నాజన్మమున కెయ్యది ఫలమో యయ్యది నెఱవేర్చితిని. నేనింకఁబోయెదను. పరమపావనములైన నీచరణారవిందములఁ గడసారి నాశిరంబునఁ జేర్చికొననిమ్ము అమ్మా! నాజన్మమున కింతకంటెఁ బుణ్యావకాశము లేదుగదా.

(అని నమస్కరించును).

సీత—నాయనా! పోయెదవా! నిన్నుఁజూచుచున్నవరకు నాకుదుఃఖము కుదుటఁబడదు కాన నీవు శీఘ్రముగఁబొమ్ము

లక్ష్మ—తల్లీ! పోవుచున్నాను. (కొంతదూరముపోయి మరలవచ్చి సీత పాదములపైఁబడి) అయ్యో! ఎంతయుని తెంపువహించెదను. ఇంతలో నెవ్వరేని నీగతుణకు నేతెంతురేని కొంతసంతసముతో నింటికిఁజేరుదునే. పొద్దుబొత్తుగాఁ గ్రుంకిపోవుచున్నది. నిబిడ తరుచ్ఛాయాసముదాయముచే నీయరణ్యము మఱింతకాఱు చీఁకటుల కాకరమై భయజనకముగ నుండునే ఎట్లుపోవుదును. కాలెట్లాడును ? తల్లీ!

సీత—లక్ష్మణా! నీవు మరల నాకు దుఃఖమును గలిగించుచున్నావు. నీవు పొమ్ము. నాకెవ్వరివలన నేభయము లేదు. వత్సా! నీకు వెఱ్ఱి

గాని నాయట్టిమందభాగ్యురాలికి సులభముగ మృత్యువు సంభవింపఁగలదటోయీ ?

లక్ష్మ—తల్లీ! అట్లుగాదు వీరపతివ్రతాత్వతేజోవిభ్రాజివగు నిన్నుఁ జేరి చూడ నెవ్వరికి సాధ్యము ! ఈ యరణ్యమునందైన నేమి నీకు సాయపడని వారెవ్వరు ?

సీ॥ నాగాంగనలు మణీ • భోగాతపత్రంబు లెండ వేళల నుద్వ • హింత్రుగాత
లీలాకురంగ బా • లికలపోలికఁ గ్రోలుపులులు మాలిమితోడ • మెలఁగుఁగాత
తఱియెఱింగి, తమంతఁ • దరులు వాచవులూరు వివిధఫలంబు ల • ర్పించుఁగాత
విపినదేవత లూడి • గపు సానులై రేయి జోకొట్టి నిదురఁ బు • చ్చుదురుగాత
గీ॥ ఎచటనుండినఁ గానివా • రెవరు నీకు, కాలములు పంచభూతముల్ • గ్రహచయంబు
వేదములు నిన్నియేల నీ • విమలమైన యాత్మశుద్ధియె నీకు వ • జ్రాంగిజోడు॥

కావున నిర్భయముగా నింకఁ బురికేగెదను. తల్లీ! ఇవే పునః పునఃప్రణామములు. (అని పోవుచు) ఓహో సకలధర్మాధర్మనిర్ణయాధికారధారేయులై లోకత్రయీశాసన ప్రక్రియా ధురంధరులై ప్రకాశించు నోలోకపాలకులారా! చరాచరవిశిష్టంబగు నాపరమేష్టిసృష్టిప్రపంచంబునంజరుగు కర్మసంఘాతమునకెల్ల సాక్షీభూతులరై యుండు నోసూర్యచంద్రులారా! యమనియమాద్యష్టాంగ యోగానుష్ఠాన సిద్ధులై కేవలధర్మసంస్థాపనార్థమై కారణశరీరముల నవతరించిన యోతపోధనసత్తములారా! ఓతల్లీ! రఘుకులదేవతా భాగీరథీ! నన్నుఁ బరిపాలించు ప్రభూత్తముఁడును విశేషించి నాకు నగ్రజాతుండును నగు శ్రీరామచంద్రధరణీంద్రునాజ్ఞాబలమున నేఁ డీపరిణతగర్భభరోపేతను, అయోనిజాతను, భువనత్రయ ద్యోతమాన పతివ్రతాత్వతేజోవిఖ్యాతను, లోకమాతను, నీసీత, నీ యరణ్యభూముల విడిచిపోవుచున్నాను. మనోవాక్కాయకర్మంబుల నే నిందేయపరాధ మెఱుంగను. నాభావపరిశుద్ధింబరీక్షించి మీరందఱునాకు సాక్షీభూతులరై యుండి యిహపరంబుల నన్ను శిక్షాపాత్రునిఁ జేయక రక్షింపుఁడు.

(అని పోవుచుండఁ దెరలో)

అయ్యో, దండాయనా! ఈప్రాంతమునుండి దీనారవము శ్రవణగోచరమగుచున్నది. పోయి కనుఁగొందము రమ్ము.

సౌధ— అవును. ఎవరైన నభ్యాగతులు వచ్చిరేమో చూచి గురువులగు వాల్మీకులవారికిఁ జెప్పుదమురా.

లక్ష్మ— (ఆకర్ణించి) ఓహో! ఇది భగవానుఁడగు ప్రాచేతసుని యాశ్రమోపాంతమే. హృదయమా! ఇప్పుడు నీవు నిర్భయముగా నుండుము. నేనింకఁ బోవచ్చును. (నిష్క్రమించును.)

సీత— అక్కటా! పుణ్యమూర్తి మా లక్ష్మణుఁ డేగుచున్నాఁడుగదా? నాయవస్థయటుండ నాతనిదైన్యస్థితిఁ బరికించిన నాకు దుఃఖ మినుమడియగుచున్నదే! అయ్యో! ఎంతటి కరుణాసముద్రుఁడు, ఎంతటి భ్రాతృసేవాతత్పరుఁ డీ లక్ష్మణుఁడు.

సీ॥ కనుఁగవ నిండ నా • రునితాంతబాష్పముల్ వెలికి ఱెప్పల నప్ప • ళించుకొనుచు
నాదెసఁ భయము, దై • న్యము, విస్మయము, జాలి దేలు చూపుల వెన్కఁ • దిరిగికనుచు
ననుఁ బోవు దీనబాం • ధవులకై యాసతోఁ బలుమాఱు దెసల వి • భ్రాంతిఁ గనుచు
కనుఁజూపుమేర ద • ప్పిన వెన్కకే తెంచి మరలుచు వచ్చుచు • మరలఁ జనుచు
గీ॥ చిత్తమేలాగొ రాయిచే • సికొని తనదు ప్రాణముల నాపదంబుల • రక్షగట్టి
పురికిఁ బోలేక పోలేక • బొందితోడఁ బోవుచున్నాఁడు సౌమిత్రి • పుణ్యమూర్తి॥

ఇప్పటికాతని దివ్యమూర్తి నాకన్నులకుఁ జాటైపోయినది. ఈపాటికి గంగ కవ్వలిదరికిఁ జేరియుండును. అతనితో నేమేమో ధైర్యవచనములాడితిఁగాని యొంటినైన యెక్కడికేగుటకు నాకిపుడు ధైర్యమాగుటలేదు. (వినుట నభినయించి) ఈవంకనుండి మాటలు వినవచ్చుచున్నవి.

(పిమ్మట వాల్మీకి శిష్యద్వయముతోఁ బ్రవేశించును)

సౌధాతకి— గురూత్తమా! ఈయమయేకాంబోలు నింతకుఁ బూర్వమేడ్చుచున్న దీనురాలు.

వాల్మీ— వత్సా! సౌధాతకీ! ఈయమయెవరో నేనెఱుంగుదును. (అని సీతనుసమీపించి) వత్సా! జానకీ! ఊఱడిల్లుము.

సౌధా—(స్వగతము) జానకియనుచున్నారు. ఈయమ శ్రీరామ చంద్రుని దేవేరియా యేమి !

సీత—తాపసోత్తమా ! అభివాదనము. (నమస్కరించి) భగవానుఁడా ! ఆర్తనైయున్న నన్నురక్షింపవచ్చిన దివ్యర్షులు తామెవ్వరో నే నఱుఁగనచ్చునా ?

వాల్మీ—తల్లీ : నీవు నన్నెఱుఁగవుకాని నేను నిన్నెఱుఁగుదును.

మ॥ వినుు వాల్మీకి యటండురమ్మ నను; నీ ♦ వృత్తాంతముఁ యోగదృ
ష్టినెఱుఁగంబడె, మాకు నీవిభునకుఁ ♦ స్నేహం బనల్పంబు, నీ
జనకుండుఁ బరమాప్తుఁ, డాదశరథ ♦ క్ష్మాభర్తయుఁ మేమెఱుం
గినవాఁడే, దిగులొందకమ్మ యనుర ♦ క్తిఁ నిన్నురక్షించితిఁ॥

సీత—తండ్రీ ! పొరపడితిని. పురాణబ్రహ్మవాదులగు ప్రాచేతసుల మిమ్ము నేనుమాత్ర మెఱుంగ కేమి ? శోకమూర్ఛావివశత్వ మున మతిమాలి మీయెడ నపచార మొనరించితి, క్షమింపుఁడు.

వాల్మీ—కుమారీ ! యపచారమేమి నాబిడ్డవేకదా నీవు ?

చ॥ మన మునిపల్లె యీతరుల ♦ మాటుననే యొకకూఁత వేటుదా
పునఁగల, దర్ఘ్యముఁ గొనుము ♦ పోవుద, మచ్చట మాతపస్వినీ
జన మరచేతఁ గన్నులిడి ♦ సాకుదు, రీయది నీ గృహంబు, నీ
యనుచరదాసికాసముద ♦ యంబులు సంయమిబాలికామణుల్॥

సీత—తండ్రీ! ఇట్టి కష్టకాలమున మాపంచకు రమ్మని నన్నాదరించు నాప్తబంధువులు మీకంటె నాకెవ్వరును లేరు, కాని

చ॥ ననుభరియింపఁ గష్ట, మొక ♦ నాఁటిదిగాదిది నాకు; నెన్నినా
ళ్ళని మిమువంటి బంధుల గృ ♦ హంబులలోఁ దలదాఁచికొందుఁ,గా
దనివచియింపఁ గాని జన ♦ కా ! కలకాలము మీకు భారమై
దినములఁద్రోయఁగా ననుమ ♦ తింతు నె యీకొఱగాని మేనితోఁ?॥

వాల్మీ—బిడ్డా, యెంతమాటాడితివి! నీవంటి పతివ్రతామతల్లుల సత్క రించుటకంటె మాతపంబులకు ఫలంబు లితరములుగలవా? అద్ది

గాక మేము నిమిత్తమాత్రులమే కాని మాయాశ్రమవనీతలంబే నీయట్టివారి నెందఱనో భరింపఁగలదు. కావుననే,

చ॥ తడవులనుండి శిష్యసము ♦ దాయముతో నివసింతుమిందు, నె
వ్వఁడు తనుయాత్రకై కఱవు ♦ నంబడ, మావని నేల్పుటావుకై
వడి భరియించు మమ్మతిథి ♦ వర్గము, నెందఱికైన లేదనక్
గడ కిట మాకుటీరహరి ♦ ణంబులకైనను లేదు మానినీ! ॥

జానకీ! వేయేల? యీపరిసరవనీతలంబంతయుఁ జిరకాలము నుండి యథేచ్ఛగా మేము పరిపాలించుచున్నారము. మీరాజులకున్న పరిఢవమంతయు మాకును లేకపోలేదు వినుము,

సీ॥ గంగాపగాతరంగములఁ దోఁగిన శీతవాతాంకురములు సే ♦ వకులు మాకు
సవనధూమపయోద ♦ సమితిఁ గాంచి నటించు నలమయూరములు గా ♦ యకులు మాకు
అరివర్గములకసా ♦ ధ్యములైన పావనాశ్రమములు కొల్వుకూ ♦ టములు మాకు
ఫలసమిద్వల్కలా ♦ దులఁ గానుకలొసంగు తరులు సామంత సం ♦ తతులు మాకు
గీ॥ నాటకయె పండు నీవరిధా ♦ న్యములపంట, ఆలమందలపాడి భో ♦ గ్యంబు మాకు
పావనంబిందు స్వచ్ఛంద ♦ జీవనంబు అవనిపుల కింతకంటె సౌ ♦ ఖ్యంబు గలదె? ॥

సీత—జనకా, ఇచ్చటనాకు సౌఖ్యలోపముజరుగునని నేనెంతమాత్రము దలంపను గాని, అక్కడిమునిపత్నులొకప్పుడు "జానకీ! నిజముచెప్పుము నీప్రాణేశ్వరుఁడేల నిన్ను విడనాడవలసివచ్చె" అని నన్నడిగినచో వారికేమని సమాధానము చెప్పఁగలను. నా మనోనాథుని కరుణాస్వభావము వారెఱింగినవారగుటచే జరిగినవాస్తవమిదియని చెప్పినను విశ్వసింపరు. నాయందేదియో మహాపరాధమున్నదనియే తలంతురు. నేను నిరపరాధనని నాయంతరాత్మ యెఱుంగును. దైవ మెఱుంగును. ఆర్యపుత్రుఁడు గూడ నెఱుంగకపోలేదు. ఏనాఁటికేమో వంశోచ్ఛేదమొనరించి భ్రూణహత్యాపాతకముగూడ నేలకట్టుకొనవలయునని యింత వఱకతిభారముగా నీపాపశరీరము మోయుచున్నానుగాని

నాయనా! లేకున్న నీవటకే యీగంగలో మునింగియుండనా?
తండ్రీ! అటువంటి జీవితేశ్వరు నెడఁబాసి యింకను మొండినై
జీవింపవలెనా?

చ॥ అంతటికాఁపురంబునకు నాఁడిడియై, సడిమోసి, మానిశు
ద్ధాంతముపొంతకేఁ దగుదు నంచెటుపోవుదు; నీవనాంతమం
దంతటిదాననై రఘుకు లాంకురమేర్పడు నంతదాక నీ
వంతభరించి, యంత బల వంతముమై తరియింతు జన్మముల్॥

వాల్మీ—బిడ్డా! నీవు కంటనీరిడిన నేఁ జూడఁ జాలను — దుఃఖింపకు —
ఈ నిందకుంగల కారణార్థము వేఱు

ఉ॥ పుట్టువుతోడనే పరమ పుణ్యవు నీవయి నేఁటికెట్లొ యీ
పుట్టిననింద యేమరిత మ్ముఁ బొనరింపఁగ లేదుగాని నా,
పుట్టువు మంచిదై, జనక భూపతిపోలిక, నిన్ను నేను నా
పట్టిగ నెంచి, పెంచికొను భాగ్యము నాకు ఘటించె జానకీ!॥

తల్లీ! నీపాతివ్రత్య మెఱుంగనివారు లేరు. నిన్నెవ్వరో శంకింతురను భయ మక్కఱలేదు. నీయుపచారమునకై నేను నియమించు నొకరిరువురు దివ్యపురంధ్రులకుఁ దక్క నన్యులకు నీ వదృశ్యవైయుండునట్లు నీకు వరమిచ్చితిని రమ్ము.

సీత—తండ్రీ! ఇంక నిర్భయముగ నీకడుపున దాఁగియుండెదను.

వాల్మీ—బిడ్డా! నీవు పెఱచోటికెక్కడికో రాలేదు రమ్ము నీపుట్టినింటికి;
పరమేశ్వరుఁడు నిన్నుఁ జేర్పవలసిన చోటికే చేర్చినాఁడు.

ఉ॥ ఈ మునిపల్లెయే మిథిల, యే జనకుండఁ, దపస్వినీజనం
బే మదినమ్ము బాంధవ, మిఁ కేటికొఱంత, పడంతులెందురా
రా మునుగానుపుంబురిటి కై, తమ పుట్టినయిండ్లకుల్? కుమా
రీ! మిథిలేశ్వరుండొకఁడు నేనొకఁడా? నినుఁగూర్మిఁ బెంపఁగన్॥

సీత—నాయనా! అట్లెన్నఁడుఁ దలంపను. ఆ జనకుఁడు నన్ను నాసంతోషకాలమునఁ బెంచెను. నీవో నాయాపత్కాలమునఁ గడుపున నిడికొని పెంచుకొనుచున్నావు. ఆజనకునికన్న నీజనకుఁడే నాకు మిన్నయనుకొన్నను దోషముగాదు.

వాల్మీ—బిడ్డా! అతఁడు జగదేకపూజ్యుఁడు కడుపునఁ గనకున్నను జగదీశ్వరి వగు నీయట్టికూఁతునకుఁదండ్రియై సార్థకనామధేయుఁడయ్యె! నేఁటికి నాతపము సఫలమై నాకులభించితివి. కాని, యతఁడు రాజాధిరాజు. నేనో యడవికాఁపరినగు తాపసుఁడను. అంతటిభోగ భాగ్యములతోఁ బెంపలేనుగాని జీవయాత్రకు లోపముండదు.

సీ॥ కలమాన్నముం బెట్టఁ • గలనో లేనో కాని వెదురుబియ్యమున కే • కొదవలేదు
మేటిపణ్యారంపు • మాట యేమో కాని కందమూలములకే • కఱవులేదు
కలధౌతమణి సౌధ • ములు గల్గవే కాని పర్ణశాలలకు లో • పంబులేదు
జిలుఁగు మేలిమి పట్టు • చీర లేమో కాని వల్కలంబుల కేమి • బాఁతిలేదు
గీ॥ పడకకై దూదిపాన్పులె • క్కడివిగాని పూరిసెజ్జలు వెండి బం • గారుగావు
పెట్టిపోఁతల కొకవేళఁ • బేదనైనఁ గరుణకును నాకుఁ బేదఱి • కంబులేదు॥

తల్లీ! రమ్ము ఇప్పటి నీయవస్థకుం దగిన జీవనమునకు నా పెంపు దగియే యున్నది.

సీత—నీయాదరణము నన్ను దుఃఖము మఱపించినది.

వాల్మీ—బిడ్డా! కన్నులు దుడిచికొని, దారిచూచి నడువుము. సందె చీఁకటిగూడను. (అందఱు నడుచుచున్నారు.) అమ్మా! ఇక్కడ హెచ్చరిక.

సీ॥ పునుఁగు దట్టముగఁ జే • రిన రాలు కాల్జారు; పూనికమై తీవ • లానుచున్న
సెలయేటిజాలు నిం • చిన యూబు లిచ్చోట నవ్వురుదుబ్బుల నడ • యాడుచున్న
కుశసూచి కంటకాం • కుర పథంబిది కాలినడజాడలనె మెల్ల • నడువుచున్న
నేలమీఁదికిఁ జాల • వ్రాలె నీతరుశాఖ తలవాంచి, మెలప్రనఁ • దొలఁగుచున్న
గీ॥ అల్లదే మనయాశ్రమం, • బాలమంద రొప్పికొనువచ్చుబ్రహ్మచా • రులును వారె,
అలరి నారాక లోనికిం • దెలుపనేమొ హరిణకం బదె రివ్వునఁ • బరుగువారె॥

(అందఱు నిష్క్రమింతురు)

ద్వితీయాంకము
సంపూర్ణము.

శ్రీరామచంద్ర పరబ్రహ్మణేనమః.

ఉత్తర రాఘవము.

తృతీయాంకము.

(లక్ష్మణుఁడును జనార్దనభట్టును బ్రవేశించి యుందురు.)

లక్ష్మ—నాకు మొదటనుండియు నిదియే నమ్మకము.

జనా—ఇంక సందేహమెందులకు ? వయసుకూడ మీయూహకు సరిపోయినది.

లక్ష్మ—ఎన్నియేండ్లుండును ?

జనా—పండ్రెండేండ్లకు మించ లేదు.

లక్ష్మ—సరిపోయినది. దేవిగారిని విడిచివచ్చి పండ్రెండేండ్లే యైనది. ఉపనయన మైనదా ?

జనా—చెప్పితినిగా క్షాత్రకల్పమున నైనదని.

లక్ష్మ—అవును. మఱచిపోయితిని. ఈయమితోత్సాహముతో నాకు మతి తిరుగుడువడుచున్నదిసుమా కాని, జనార్దనభట్టూ! బాలురక్కడనేయుండి జానకీదేవిమాత్రము లేకుండుటేమి ? వారు సీతాతనూభవులు కాకుందురా?

జనా.—కాకున్న నాక్షాత్రతేజమునకును ఆధనుర్విద్యావైశద్యమునకును నేమందువు?

లక్ష్మ—వీరు పరశురామునివంటి యపూర్వ బ్రహ్మసంతానమేమో?

జనా—అట్లయిన సీతారాముల ప్రతిబింబము లగుటెట్లు ?

లక్ష్మ—అప్పటికి సీతయేమైయుండును! భర్తృవియోగసంతాపమున ...

జనా—బాబూ! వాల్మీకి భగవానుఁడుండఁగా నంతపని జరుగనిచ్చునా?

లక్ష్మ—అదియు విచార్యమే. పత్యాజ్ఞలేకయే జానకియంతటి పతివ్రతా తిలకం బాత్మహత్యఁ గావించుకొనునా? అదియుంగాక నిరంతరము, నిజహృదయాంభోరుహ కర్ణికాపీఠమున సుప్రతిష్ఠించుకొని నిర్భరప్రేమ సూత్రమునఁ గూర్పఁబడిన శ్రీరామగుణముక్తారత్నములతో జపధ్యానపారవశ్యమున జీవించియుండునని చెప్పిన దేవి తన వాఙ్నియమము తప్పదు. అట్లు తలంచుట పాపాతిపాపము కానీ! జనార్దనభట్టూ! మాజానకీదేవిని రఘుకుల ధురంధరులైన పుత్రులతో మరల మారామచంద్రున కొప్పగించు భాగ్య మీమంద భాగ్యునకు లభించునా?

జనా—నాయనా! నిరుత్సాహమేల. నిజముగా నేదేని దుర్యోగమే సంభవింప నుండినచో నీయాశాంకురములకే యవకాశము లేకుండును. ఇంతలో నీతొందర యేల? నేఁడువచ్చునుగదా నారాయణభట్టు.

(నారాయణభట్టు ప్రవేశించి) చిరంజీవికి జయము జయము.

లక్ష్మ—ఏమైనది?

నారా—చూచివచ్చితిని.

లక్ష్మ—ఎవరిని దేవిగారినేకదా?

నారా—కాదు, దేవీసంతానమును.

లక్ష్మ—అయ్యో, జానకీదేవి లేనేలేదా?

నారా—ఉన్నది.

లక్ష్మ—ఎక్కడ?

నారా—ఎక్కడనున్నదో చెప్పలేదు.

లక్ష్మ—ఎవరు చెప్పలేదు?

నారా—భగవానుఁడు వాల్మీకి.

లక్ష్మ—నీవా మహామహునితో మాట్లాడితివా?

నారా—ఆయనయే నాతో మాట్లాడినాఁడు.

లక్ష్మ—నీవు మాచేఁ బంపఁబడినవాఁడవని యాయన కనుంగొనెనా యేమి?

నారా—ఆర్షచక్షుస్సున కడ్డమేమున్నది? మన మింతకాలమునుండియుఁ జేయుచుండిన రహస్యపు వేగంతయు నాయన పూసగ్రుచ్చినట్లు చెప్పివేసినాఁడు. సీత బ్రతికియే యున్నదఁట.

లక్ష్మ—అమ్మా బ్రతికితిని!

నారా—బయలుపడవలసిన యవసరమువచ్చినప్పు డామెయే బయలు పడునని చెప్పుచు నీకు రహస్యముగఁ జెప్పుమనిన సందేశమిది. 'వత్సా! లక్ష్మణా! సీతారామ పునస్సంయోగమందలి నీదృఢ ప్రయత్నము సఫలముకాఁగలదు. మనరామునిచే రాష్ట్రీయ పౌరజానపద సమావేశహేతుకమగు నేదేని మహాయాగ మొకటి ప్రారంభింపఁజేయుము. పిదపఁ గాఁదగినది దైవమే యనుసంధించుఁగాక'. అని

లక్ష్మ—విప్రోత్తమా! దైవ మిట్లనుకూలింపవలయు. లోకాతిశాయ ప్రభావులైన మహామహులకేమేని విపాకము సంభవించినను దన్నిర్వాపణమునకు దైవ మెన్నేని యలోకసాహాయ్యకముల ననుసంధించుచుండును. కాని, సంపూర్ణ వైరాగ్యముచే నేఁడో రేపో తపోవనగమనోన్ముఖులై యున్న మాయన్నగారిచే యాగము చేయించుటెట్లు!

జనా—ఎట్లో; కార్యజ్ఞునకు నీకు దుర్ఘటమేమున్నది?

లక్ష్మ—సరే విచారించెద. ఈయాలోచనలంబడి రాముని నేమరియుంటిని గదా!

జనా—అలాగైన మహారాజుగారు నీకై నిరీక్షించుచుందురు. పొమ్ము.

(నారాయణభట్టుతో నిష్క్రమించును)

లక్ష్మ— (పరిక్రమించి, రాముని మందిరము ప్రవేశించును)

(రాముఁడును, భరతుఁడును గూర్చుండి యుందురు.)

రాము—తమ్ముఁడా, భరతా ! చిరంజీవి లక్ష్మణుఁ డింకను రాకున్నాఁడేమి ?

లక్ష్మ—ఇదిగో వచ్చితి జయము జయము ఆర్యునకు ;

రాము—వత్సా ! ప్రయాణసన్నాహము చేయించితివా ?

లక్ష్మ—సన్నాహమెంతలోఁ గాఁగలదు నిశ్చయమైనచో.

రాము—ఇంకను "నిశ్చయమైనచో" అనుచున్నావేమి ? దురంతమగు చింతాభరముతోఁబాటి రాజ్యభరముగూడ నింకెంతకాలము వహింతును? పర్యాకులవ్యగ్రములగు చిత్తవృత్తులతో రాజ్య కార్యముల నిర్వహించుట యెన్నియనర్థములకో మూలము.

చం॥ తన పరిపాలనం బనవ ♦ ధానతఁ జెందినచోఁ బ్రజానురం
జనము నశించు, దాన నయ ♦ శంబు కొలంబున కెల్లఁబ్రాఁకుఁ ద
జ్జనపతియుం దురంతకలు ♦ షంబున నిందునసందు నింద్యుఁడై
చను, నటుగాన నట్టి దురిత ♦ సంతతినుండి తొలంగఁజేయన్నా॥

భర—ఆర్యా ! స్వధర్మనిర్వహణమునందు మీకుఁగల యత్యంతాసక్తిచే నెక్కడ నేధర్మచ్యుతి సంభవించునో యని యనునిమేషము మీరు సంశయించుచుందురుగాని, శోకవిహ్వలులై రాజ కార్యములందు విముఖులైయున్నారని మిమ్మెవ్వరు ననుకొనుట లేదు. ఎవ్వరి నోట విన్నను,

ఉ॥ పామరులన్న కొండొకప్ర ♦ వాదముపైఁ దనప్రాణమైన సా
ధ్వీమణిఁ గానలోఁ ద్రుణగ ♦ తిన్వీడనాడి మనంబు మోహచిం

తామలినంబుసేయక, య ♦ థావిధి రాజ్యము నిర్వహించు వి
ద్యామహిమంబు రాఘవ వ ♦ తంసునకే తగునండ్రు భూజనుల్॥

రాము—వీని కేమి ? ప్రజాభిప్రాయములు క్షణక్షణము మాఱుచుం డును. ఇదిగాక లోకమంతయు నేకాభిప్రాయనిరూఢమై యుం డుట యసంభవముగదా,

ఉ॥ "ఒడలు పరంబుగాక యెవఁ ♦ డో యొకఁడాడిన నిందకోడి, రా
ముఁడు నడికానఁ బోవిడిచెఁ ♦ బో తనయాలిని, నంతనే సడిక్
గడచెనె? మాటకై, కనుది ♦ నంబుల వ్రేఁకటిదాని నెంత్రము
క్కడి పెనురక్కసుండయినఁ ♦ గాని కటా! యిటుసేయునే సతిన్"॥

ఇట్లనువారుగూడ లేకపోరు.

లక్ష్మ—ఈమాట నాఁడే విన్నవింపనెంచితినిగాని యప్పటి మీకార్య నిశ్చయము నన్ను నోఱుమూయించినది. కానిండు. ఎవరె ట్లాడిన నేమి ?

శా॥ లోకారాధ్యులఁ బుణ్యదంపతుల సు ♦ శ్లోకాఢ్యులన్ మి మ్మెవం
డో కింపాకుఁడొకండు మైమఱచి, కూ ♦ యుంజూడుఁ డీమాత్రనే
లోకోద్దీపకమైన మీచరిత కే ♦ లోపంబు, దేశప్రజా
నీకం బేకత మీమనం బెఱుఁగకు ♦ న్నే యింతకాలానకున్॥

రాము—సోదరులారా ! సీతాపరిత్యాగమందలి పరమార్థమును లోక మేకాలమునకైన నెఱుఁగుఁగాక. నాకిప్పుడు కావలసిన దేము న్నది. నేను తపోవనగమనమునందుఁ గృతనిశ్చయుఁడనై యున్నాఁ డను. రాజకవచము దొడిగియున్నంతవఱకే కదా నాకు లోకానుసరణము. నాయనా! భరతా, ఈరాజ్యభర మింక నీవు వహింపఁదగినదే. నేఁడే నన్నుఁ బంపివేయుము.

భరత—ఆర్యా! నేటికైన నీభరతుఁడు మీచరణదాస్యమునకుం బనికిరాఁడా ? అయ్యో, ఎంతపాపకర్ముఁడను;

మీఱంగూడదని తండ్రియానతిమెయిన్ ♦ మి మ్మాయరణ్యంబులన్
జేరంబంపి, చతుర్దశాబ్దముల నె ♦ న్నే బ్రిహ్మకల్పంబుల
ట్లారాధించుచు నీదుపాదుకల, రా ♦ జ్యంబేలితింగాని, య
న్నా! రాకాసినె మీరువీడిన యయో ♦ ధ్యన్ నేను గాలూనఁగన్॥

నాఁడు సౌమిత్రి కనుగ్రహించిన మీసాహచర్యభాగ్యము
నా కనుగ్రహింపఁగూడదా? మీరిప్పుడు తపోవనమునకుఁ బోవు
తగదు. కాదని పోవుటయే నిశ్చయించితిరా చిరంజీవి సౌమిత్రికి
మొప్పగించి నన్ను మీ వెంటఁ గొనిపొండు.

—— అట్లెన్నఁడుం జరుగదు; మేమందఱము మీకోడివారమే. ఈవి
యోగావస్థయందు నార్యపుత్రి నొంటిగా విడిచియుండనలదని
పూజ్యురాలగు వదినె నాకానతిచ్చిన సందేశము వినుండు.

'ఏనెందున్నను రాఘవేంద్రుచరణం ♦ బే దిక్కుగానుందు, వ
న్నా! నీవేమఱి కెల్లకాలము తదీ ♦ యచ్ఛాయయుం బాయక
ర్యా! నామాఱుగ' నంచు మావదినె మీ ♦ మ్మర్పించె నాకెన్ని యో
మానల్ వెట్టి తదాజ్ఞమీఱి వని కే ♦ ట్లంపింతు మిమ్మొంటిమై॥

—— అయ్యో! సౌమిత్రీ! ఇంకను మీవదినె యెక్కడ ?
పారబ్ధంబగు దుష్ప్రివాద పరిభా ♦ వంబోర్చి యున్నాళ్ళు ఘో
రణ్యంబులయం దనాథగతి వ ♦ త్సా! సీత జీవించునా?
రంబందని యీవియోగపరితా ♦ పగ్లాని కామ్లానయై
దుక్ జీవలతాంత మింతవర కా ♦ శావృంతనిష్క్రాంతమై॥

—ఆర్యపుత్రా! అట్టి నిరాశ కవకాశము లేదు. మావదినె బ్రతి
కియే యున్నది. నిరంతరము పతినామామృతరజప ధ్యానాను
సంధానముతోఁ దపోవనక్షేత్రములయందు శుభకాలమును
బ్రతీక్షించుచుఁ గాలక్షేపము చేసికొనుచుండు నని కదా
వక్కాణించినది.

రాము—ఎంతయమాయికుఁడవు సౌమిత్రీ! ఈమందభాగ్యులకు శుభకాలముగూడనా? జీర్ణకాంతారమైనది నాసంసారము. అందు దుస్సహ యాతనాపోత మగునాతనువు కాలముతోఁబాటు నడుచుచునేయున్నది. మఱిశుభమనుమాట యేలోకములోనిదో చూడుము,

చ॥ క్రమముగ సీతఁబాసిన జ ♦ గంబునఁ గాలవ్రాతంబులై వసం
తములు గతించె, శారద సు ♦ ధామధురస్ఫురదిందుచంద్రికా
గమములు నిర్గమించె, సువి ♦ కస్వర ధీరమయూరగీతికా
హములు గతించె నెన్నియొ క ♦ టా; గతియింపవు రాముజీవముల్॥

భరత—ఆర్యా! ధీరతవాటింపుఁడు. ఈపరితాపమునకు మేరయెక్కడిది?

చ॥ గడచినదానికై వగవఁ ♦ గా ఫలమెయ్యది? దైవికంబులన్
గడవఁదరంబె కీళ్ల యెడఁ ♦ గాని సుఖంబులయందుఁగాని, యె
న్నఁడును మనోవికారచల ♦ నంబు లెఱుంగని మీరె యింతగా
నడలిన మమ్ముబోటి యకృ ♦ తాత్ముల కెక్కడివయ్య ధైర్యముల్॥

రాము—సహోదరులారా! ఇంకను ధైర్యమనుచున్నారా? అంతర్లీనమై రగులుచున్న దుఃఖానలముతో నగ్నిపర్వతమువలె లోలోఁగాలుచున్నను బైకిగాంభీర్యమే నటించుచున్నాను. ఇది నానాఁటికి దుర్భరమగుచున్నది.

శా॥ గాయం బేమియుఁగానరాక విషది ♦ గ్ధంబైన శస్త్రంబుగా,
నాయంబుల్ దెగఁగోయుచున్నయది; వ ♦ త్సా! యెన్నఁడీయాతనా
వ్యాయామంబున కంతమో మది నిరా ♦ శాశ్వాసితంబయ్యె నె
ట్లో యంతర్దహనంబునన్ గుములుచుం ♦ దున్ బూదిగా దింతకున్॥

నేఁడు నా ప్రాణబంధువుల మిమ్మందఱు విడనాడి తపోవనమున కేగుచున్నాఁడఁగాన హృదయము నకవశమై సంక్షోభించి శోకము వెల్లివిరిసినది.

లక్ష్మ—ఆర్యా! ఇట్టియవస్థలో రాజధానియం దుండిననే కొంత
యూరట కవకాశముండును; కాదా,

గీ॥ నిరతజగదభ్యుదయకార్య ♦ నియతిఁజేసి
చిత్త మంతగ శోకవం ♦ చితముగాదు,
కార్యగతిలేక శోకమే ♦ గతిగ, నేక
తమున వనినుంట కడుఁ బ్రమా ♦ దంబుగాదె॥

రాము—నాయనా! ఇక్కడమాత్రము నాకు శాంతి యెక్కడిది? జానకీచిరసహవాసచిహ్నితములైన యీమందిరస్థానవిశేషములఁ బరికించునప్పుడెల్ల నాహృదయము బ్రద్దలగుచుండునే; అల్లదిగో వినుండు,

మ॥ అనుగుంబ్రేయసిచేత నేర్చి, యలవా ♦ లైనాదుకోల్యేగిరా
కను దూరంబునఁగాంచి నేఁటికిని, "అం. క్కా! రాముఁడే తెంచె ర"
మ్మని ముద్దారఁగ జానకింబిలుచునె ♦ య్యారంపురాచిల్క మం
తన మింతింతగ ఉపమ్మై తునియకుం ♦ డఁగోయుహృన్మర్మముల్॥

శోకోద్దీపకములగు నిట్టివిషయము లెన్నియో నన్నేచుచున్నను, వావిడిచి దుఃఖించుటకైన నాకు స్వాతంత్ర్యములేదు. దుఃఖించిన సీతాపరిత్యాగమువలని ప్రయోజనమే భంగముకాఁగలదు.

లక్ష్మ—ఆర్యా! అట్లయిన మీతపోవన ప్రవేశమునకుఁగూడఁ బ్రజలు విరుద్ధార్థములఁ గల్పింపకుందురా?

రాము—ఆసంశయముతోడనే యింతకాల మోపికతో నుంటిని.

లక్ష్మ—ఆర్యా! ఇంకెంతకాలమో సంతపింప నక్కఱలేదు. శుభకాలము రానున్నది. ఇంతలో నేదేని యాగమనుష్ఠింపుఁడు. నిష్కంటకముగ సామ్రాజ్య మేలుచున్నారు కాని మనసనాతనధరానేతల నీతి ననుసరించి, యింద్రాదిదేవతలకుం బ్రీతిగనొక్క క్రతువునైన నాచరింపకుండుట మనవంశచారిత్రమునకు

లోపమనిపింపదా ? అశ్వమేధమనుష్ఠించి మామనోభీష్టముల నెరవేర్పుడు. సర్వానిష్టములు తొలంగును.

(తెరలో) హాకుమారా! నీ కీయపమృత్యు వెక్కడ దాపరించె నురా తండ్రీ!

రాము—(ఆకర్ణించి) ఏ మాదీనారవము. అదేమో కనుఁగొనుఁడు.

(బాలుని మృతకళేబరముతో విప్రదంపతులు ప్రవేశించి)

ఎవరయ్యా ! మీామహారాజుగా రెంచున్నారు ?

రాము—విప్రోత్తమా! మీాయాజ్ఞకై యిక్కడనే వేఁచియున్నాను. మీా కేమి యాపదసంభవించినది ?

విప్రుఁడు—రాజా ! చేతులారఁ గన్నుఁబొడిచి కన్నీ రేలగార్చెద వనుచు న్నావుగా? చూడు, (బాలునిమృతకళేబరము క్రిందఁబడ వైచి)

ఉ॥ కానుపు లేక లేక చిర • కాలమునాఁటికి నేఁటి కేము సం
తానపుముచ్చటంగని ము • దంపడుచుండఁగ నెంతకూ్రుఁడో
గాని యముండు మాసుతు న • కాలముగాఁగడ తేర్చి పుత్రదుః
ఖానల మిట్లు మాకడుపు • నందు రగుల్చుట కేమిధర్మమో ?

(అని, శవముపైఁబడి) హాపుత్రా! (అందఱు విభ్రాంతులై చూతురు)

భార్య—రాజేంద్రా! ఈయకాలమృత్యువు మాపాలనే దాపరింపవల యునా నాయనా! చూడు (అనికొడుకుం జూపుచు)

ఉ॥ అక్కట! యొక్కఁగా నొకకు • లాంకురమీాతఁడు, బ్రహ్మతేజమున్
గ్రక్కెడు మోమువాఁడు, పదు • నాలుగునిండిన ప్రాఁపపాయపుం
జక్కదనంబువాఁ డఖిల • శాస్త్రములం గడిదేఱియున్నవాఁ
డిక్కొడు కే కనంబడియె • నే భువి నీయవినీతి యున్నదే ? ॥

బ్రాహ్మ—ఓసీ! ఛాందసురాలా! నీవుండుము, ఈ యవినీతి యూరకే దాపరించినదా!

మ॥ పుడమిన్ లోకులయందుఁ దత్తదుచితం♦బుం గర్మముల్ నీతిమై
నడిపింపంగల ఱేఁడె యున్నయెడ నా♦నా యిట్టి దుర్బాధ లె
న్నఁడు మున్విన్నవిగావు ధర్మమడుగం♦టన్ బుట్టె నీ నాఁటి కీ
కడుపుంగోఁతలు, రామభూవిభు కటా♦క్షం బేమనన్ భామినీ॥

రాము — హా హా! ఈ రామునిజీవితమున కెన్నివిషమావస్థలు సంభవించినవి. విప్రోత్తమా! శాంతింపుఁడు! విచారించెదను.

బ్రాహ్మ — రాజా! విచారించిన నింతటిముప్పు వాటిల్లునా? చెప్పుము. ప్రజలలోని యీ యపమృత్యుబాధలకు రాజవగు నీ వుత్తరవాదివిగావా?

శా॥ పాపంబున్ విధి మమ్ముఁడించి పసిపా♦పం జంపుచోఁ, జూచి, పో
నీ పోనిమ్మని యూరకుంట తగవా♦నే నీకు నీ దుర్ణయ
వ్యాపారంబుల నిల్పఁగావలయు భూ♦పాలుండవై దుష్టశి
క్షాపారీణత లేనిచో నెవఁడు మె♦చ్చుంబూని తీ రాజ్యమున్॥

రాము — విప్రోత్తమా! ఇది నాయపచారమే, కాని మీరు కొంతశాంతించినచోఁ బ్రతివిధాన మాలోచింతును.

బ్రాహ్మ — రాజా; చెట్టంత కొడుకు పడిపోవఁగా మేము శాంతించుటయెట్లో నీవే చెప్పుము.

సీ॥ పది నెలల్ మోసి క♦న్నది, యేతదేకపుత్త్రిక దీని నెట్టు లో♦దార్పఁగలవొ
చేతి కక్కఱకు వ♦చ్చిన బిడ్డ పడిపోయె బ్రతుకు నాకెటు తెల్ల♦వాఱ్పఁగలవొ
అలికిన ట్లుంకురం♦బాటె నాతోఁడీలు కులముపే రెటు భూమి♦నిలుపఁగలవొ
అనపత్యుఁడైన యీ♦తని నధోగతిఁ ద్రోయుఁడను దండధరు నెట్లు♦లాపఁగలవొ
గీ॥ కన్నతలిదండ్రులము మేము♦సన్నవెనుక నెవనిచే మాకు నీళ్లు పో♦యింపఁగలవొ
గడ్డె పొంకంబు లాడుట♦గాదు నేఁడు బయటఁబడుఁగాక నీప్రజా♦పాలనంబు॥

రాము — అయ్యా! అనుగ్రహింపుఁడు. కర్తవ్యముంగూర్చి యోచించుచునే యున్నాను.

బ్రాహ్మ — రాజా! ఇంతేమాత్రము పేక్ష యొనరించితివా నీతరమున ధర్మ
ములెల్లఁ దాఱుమాఱు గాకపోవు. ఈ వైపరీత్యములకుఁ గారణ
మేమో యాలోచింపుము. చూడు

శా॥ నాపుత్త్రుఁ శమనుండు నేబ్రతికి యుం • డఁగ జంపు టేలాటిదో,
ఈపాపిష్ఠుఁడు కన్నవారిఋణ మ • ట్టేయుంచి తాఁజచ్చుటె
ట్లో, పోనీయని నీవు సైఁచుటది యె • ట్లో రాజవైయుండి, నీ
భూపాలత్వము నేఁడుచూచెదను నా • పుత్త్రుండె జీవింపఁడే॥

రాము — సహోదరులారా! ఇప్పుడు కర్తవ్యమేమో తోఁచకున్నది.
కానిండు, ఈశవమును దైలద్రోణమునఁ బదిలపఱుపుఁడు. పిదపఁ
గాఁదగినది యోచింతము.

(ఆకసమున)

గీ॥ పృథివి శంబూకుఁడనియెడు • వృషలుఁడొకఁడు
బొందితో నింద్రలోకంబుఁ • బొందఁగోరి
తపము గావించుచున్నాఁడు • దగ్రవృత్తి
వాని వధియించి బ్రాహ్మణా • ర్భకుని మనుపు॥

రాము — సహోదరులారా! చూచితిరా రాజధర్మ మెంతదారుణమై
నదో. కానిండు, మీయిష్టానుసారము యాగాశ్వము విడువఁ
బడుఁగాక! ఇంతలో శంబూకవధార్థమై పోయివత్తును. విప్ర
దంపతులారా! మీబాలుఁడు జీవింపఁ గలఁడు; రండు పోదము.

(అందఱు నిష్క్రమింతురు)

—* తృతీయాంకము *—

శ్రీరామచంద్ర పరబ్రహ్మణేనమః

ఉత్తర రాఘవము

చతుర్థాంకము

(తపస్సమాధిలోనున్న శంబుకుఁడును ఖడ్గపాణి యగు రాముఁడును బ్రవేశింతురు)

రాము—ఆహా! ఈతఁడే యాశూద్రతపస్వి కాఁబోలు; ఔరా! ఈతపో మూర్తి నిస్తరంగసముద్రమువలె నెంత గంభీరముగ నున్నది! సమీపించి ప్రశ్నించెదను.

ఉ॥ ఓ యతిలోక యోగనియ • మోజ్వల! యెవ్వఁడవీవు, దుర్ఘటం
బే యభివాంఛితంబునకు • నిట్టి మహోగ్రతపం బొనర్తు, వ
న్నా! యెఱిఁగింపు మేకులము • నం దుదయించినవాఁడవో, వివే
కాయతిఁ గన్నవాఁడవుగ • దా మది దాఁపవుగా, యథార్థముల్

శంబు—(కన్నులు దెఱచి, లేచి) ధన్యోఽస్మి ధన్యోఽస్మి దేవా!

ఉ॥ అక్షరతత్త్వ బోధకుఁడ • వైన జగత్పతి వీవు నాకుఁ బ్ర
త్యక్షముగాఁగ నింకను, య • థార్థము దాఁపఁగ నంత పాపినా?
వీక్షణముల్ ఫలించె, విను • మే వృషలుండను శంబుకుండ, సం
దక్షయకాయసిద్ధిఁ బడ • యన్ దపియింతుఁ, ద్వదేక దీక్షనై॥

రాము— భద్రా! వివేకవంతుఁడవే, ఇది ధర్మవిపర్యయంబని యెఱుంగవా?

శంబు—చం॥ ఎఱుఁగనివాఁడఁగాను జగ • దీశ్వర! యీయుగధర్మమర్మ మే
నెఱుఁగనివాఁడఁగాను మను • జేశ్వర! నీవు రమేశ్వరుండ వం
చెఱుఁగనివాఁడఁగాను ద్విజ • మిట్టిది మాకు విపర్యయంబటం
చెఱిఁగి, యెఱింగి నీ వలన • నే మృతిఁగోరి తపంబు చేసితిన్॥

రాము—భద్రా! నావలనమృతియే యేలకోరుచున్నావు ?

శంబు—మత్తేదియు నక్షరసౌఖ్య మొసంగదుగాన.

రాము—దారుణమగు నాకరవాలముచే నీకట్టిసౌఖ్యము లభించునా?

శంబు—లభింప కేమి ప్రత్యక్ష మేకదా!

ఉ॥ పాతకమూడ్చు నీచరణ • పంకజరేణు వచేతనంపుఁజ
ట్రాతిని నాతిఁజేయఁగఁ బ • రాత్పర! నీదుకరాసి నాదు మా
యాతనువ్రాడ్చి యక్షరమ • హత్తరకాయ మొసంగదా? జగ
త్త్రాత! హరీ! యెఱుంగుదుఁ గ • దా!. భవతారక! నీమహత్త్వముల్॥

దేవా ! ఆలసింపకుము. ఇట్టి నన్నువధించుట నీశరణాగతత్రాణ బిరుదమునకు లోపమగునని తలంతువా నన్ను దండించువరకు నిన్నుఁ బ్రతిఘటించి, తపమే యొనరింతు. దండ్యుఁడు దండింపఁబడకుండుట రాజునకు దోషముకదా! కానిమ్ము, మనుమార్గ ప్రతిష్ఠాపకుఁడవైన నీవు నీవిధి నిర్వర్తింపుము. ఇదిగో నాశిరము.

రాము—హా! హా! రాజధర్మ మెంతదారుణమైనది.

మ॥ మనుమార్గంబిది యోసి దక్షిణకరం • బా! విప్రసంతానముల్
మనుమార్గంబిది కాన శూద్రమునిపై • నర్గిజిమ్ము కౌక్షేయక
మ్మనుమానింపక జానకిన్ సుగుణధ • న్యన్ నిందుచూలాలినే
వని మానన్ గల రాముగాత్రమవ్వ గా • వా? జాలి యింకేటికిన్॥

(అని ఖడ్గము ప్రయోగించును.)

శంబు—(దివ్యపురుషుఁడై) దేవా! రఘుకులేశ్వరా !

చం॥ యమునిదిరస్కరించి, యభ • యంబిడుదండధరుండ వీవు మా
కమర, సజీవుఁడయ్యె విగ • తాసుఁడు విప్రసుతుండు; నాకు ని
స్సమశుభమే లభించె నల • శంబుకుఁడన్ దల నీ పదారవిం
దములధరింతు, దీనికిఁ గ • దా మృతిఁగోరితి నీ కరంబునన్॥

రాము — భద్రా! ఈ రెండును మాకుఁ బ్రియములే. ఇఁక నీయుగ్ర తపంబునకు ఫలమనుభవింపుము.

గీ॥ పుణ్యములఁ జేసి నిత్యప్రమోదములను
శాశ్వతానందములు నెందు జరుగునట్టి
తైజసములై వెలుంగు వైరాజములను
భువనములు నీకు భోగ్యంబు లవును ధ్రువము॥

శంబు — ఈ ప్రభావము నాకు మీయనుగ్రహముచే లభించినదిగాని నా తపస్సుచేఁగాదు, (యోజించి) ఆఁ కాకేమి! తపస్సే నాకు మహోపకారకమైనది. చూడుఁడు,

మ॥ నిను సర్వేశు, జగచ్ఛరణ్యు ఘను లన్వేషింతు రట్లయ్యు, నీ
వె నితాంతశ్రమకోర్చి శూద్రునను నన్వేషించుచుర్వ్ నూఱుయో
జనము ల్వచ్చుటయేదియో యది తపస్సాఫల్యమే కానిచో,
ననఘా! వెండియు దండకాటవి కయోధ్యన్ దాఁటి రానేటికో॥

రాము — భద్రా! దండకారణ్యమా యిది (పరికించి) అవునుగదా!

మ॥ లలితశ్యామలశాద్వలంబు లోకమోప్ర లక్, భీషణాభోగజాం
గలముల్ వేఱొకచో, స్రవద్గిరిఝురీకల్లోలభాంకారసం
కులదిక్కూలము లొక్కచోఁ గలకెలంకుల్ తీర్థశైలాశ్రమం
బులకాంతారము లివ్వియే పరిచితంబుల్ దండకాభాగముల్॥

శంబు — దేవా! దండకయే యిది. ఇందుండియేకదా తాము పూర్వము ఖరదూషణత్రిశిరులను పదునాలుగువేల మిక్కుటపు రక్కసుల నొక్కమ్మడి సంహరించితిరి. అందుచేతఁగదా యీజనస్థానము సిద్ధక్షేత్రమై నావంటిభీరుజనమునకుఁగూడ నిర్భయసంచారము లభించినది. చిత్తగింపుఁడు,

గీ॥ కలకలంబేమిలేక నిశ్చలతనున్న
యీ మహారణ్యసీమలం దిచటఁ గొన్ని;

కొన్ని దిక్కులుమాఱ్ఱియు • చున్నవచటఁ
జటులనిర్ఘాతమృగచయా • ర్భటులవలన॥

గీ॥ భూరిగంభీరఘోషల • బుసలతోడ
నాదమై నిద్రపోవు కా • కోదరములు
బంధురశ్వాసపవనపా • ణింధమములు
కాలకూటాగ్ను లిచ్చోటఁ • గ్రక్కుచుండు॥

గీ॥ నేలబొరియలలోఁద్రాగ • నీరు లేమి
నెండవేఁడిమి దూఁపిలి, • తొండ లిందుఁ
గొండచిలువల చెమ్మటల్ • గ్రోలుచుండు
భయదములు నిర్జలంబు లీ • ప్రాంతరములు॥

రాము—భద్రా! కనఁబడుచున్నది. ఇది జనస్థానమే. ఇదే యాఖరాసురుఁడున్నచోటు. ఆహా! యానాఁటి వృత్తాంతములన్నియు నిప్పుడనుభవసిద్ధములై కన్నులం గట్టినట్లున్నవి. (తనలో) వైదేహీకారామసీమములన్న నెంతయో ముచ్చట. ఆకాంతారములే యివి. ఇంతకన్న నాకు భయానకము లేవి (సబాష్పము)

ఉ॥ ఈవనభూములన్ శ్రమస • హించుచు జానకి ప్రేమమీర, "నా,
థా! విరిదేనెతావులకుఁ • దావల మీవని, మిమ్ముఁగూడి యా
హా విహరించుకంటెఁ గల • దా మఱిసౌఖ్య" మటంచుఁబల్కె నా
భావనిరూఢమా ప్రణయ • బంధము వాసెఁగదా హతాశమై!

ఆహా! ఆ ప్రేమరహస్య మేమోకాని

గీ॥ ఎవని కెయ్యది ప్రియజనం • బవును వాని
కదె యమూల్యంపు వింతద్ర • వ్యముగనలరు
ఏదియుం జేయ నక్కఱ • లేదు తనకు
వది. సరసనున్న నెల్లయా • పదలుఁ దొలఁగు॥

శంబు — దేవా! ఈయరణ్యములు దుర్గమములు తాము చూడఁదగినవి కావు. ఈపైవి మధ్యమారణ్యములు, మదకలమయూర కంఠ కోమలచ్ఛాయాదాయాదము లైన పర్వతసముదాయములచే నావరింపఁబడి యున్నవి. చూడుఁడు. క్రిక్కిఱిసియున్న పచ్చని లేఁతచెట్ల గుబురులలోఁ బలుతెగల జింకకదుపులు జంకులేక తిరుగుచున్నవి. ప్రశాంతగంభీరములగు వీనియందు,

చ॥ బలియుశకుంతముల్ పఱచి ♦ వ్రాలిన రాలెడు ప్రబ్బపూలతా
వులు నలువంక లోక్కటగు ♦ బుల్కొనుచల్లని తేఁటనీటితోఁ
గులుకుచుఁ బాఱు, జాంబవని ♦ కుంజము లాఱఁగఁబండి, వ్రాలి త్రో
వలనరికట్టుటన్ గుభగు ♦ భధ్వనులన్ లహరీకదంబముల్॥

దేవా! అవి యాకర్ణింపుఁడు

గీ॥ గుహల నంబూకృత మొనర్చు ♦ గున్న యెలుఁగు
లెలుఁగులవి మాఱుమ్రోఁతల ♦ వృద్ధిఁ జెందె;
కరులువిఱిచినయందుగు ♦ గణుపు లొద్దు
కమ్మతావులు కటుశిశి ♦ రమ్ముఁ లిచట॥

రాము — (కన్నీరాపుకొని) భద్రా! నీకు మార్గములు శుభములగుఁ గాక! విమాన మధిరోహించి పుణ్యలోకములకుం బొమ్ము.

శంబు — పురాణబ్రహ్మవాది యగు నగస్త్యభగవానుని సెలవుఁగైకొని శాశ్వతస్థానమునకుఁ బోయెదను. (నిష్క్రమించును)

రాము — ఈ కారణమున మఱల నీకాంతారముఁ జూడఁగల్గితిని. గేస్తులమై యారణ్యకులమై మేము చిరకాల మిందు సాంసారికసౌఖ్యములలో నోలలాడితిమి. మదకలమయూర కేంకార సంకులము లగు నాఁటి పర్వతములే యివి. ఇవిగో మంజువంజులనికుంజాభిరంజితములగు నాఁటి యేటిదరులు. అవును.

గీ॥ అదియె కాంబోలు ప్రస్రవ ♦ ణాచలంబు
జలదమాలికవోలె ద ♦ వ్వులనుఁగూడఁ
దెలియనగుచున్నయది (పరికించి) యగుఁగ ♦ దీని చెంత
భవ్యగోదావరీనది ♦ పాఱుచుండు॥

ఉ॥ ఆరయ దీనికొట్టకొన ♦ యందె జటాయువుగూఁడు, క్రింద నా
చేరువనుంటి మే ముటజ ♦ సీమల, శ్యామల తీరభూరుహా
ళీరుచి గౌతమిన్ బ్రతిఫ ♦ లించి చలించు మనోజ్ఞకాంతి కాం
తార మదే శకుంతకల ♦ నాదవినోదరసైకధామమా॥

ఆపంచవటియు నిచ్చటనే. చిరకాల మిచటనే కాఁపురముండుటచే నానావిస్రంభ సంభాషణముల కీప్రదేశములు సాక్షిభూతములై యున్నవి. ప్రియురాలి నెచ్చెలి యగు వాసంతియు నిచటనేకదా అయ్యో! ఈ రామహతకున కిప్పుడెంత యాపద సంభవించినది!

చం॥ తడవులనుండి, మేన విస్మృ ♦ తంబయి పొంగు విసంబుమాడ్కి, రా
పిడివలనన్ గలక్కుమని ♦ వేఁపెడి లోపలిశల్యఖండమ
ట్లెడద వ్రణంబుమానియు న ♦ దే మరలన్ సెలవేసి వ్రస్సిన
ట్లుడుఁగిననాఁటిశోక మిపు ♦ డైనటులే మనసున్ గలంచెడిన్॥

అయినను బూర్వపరిచితములైన యీభూప్రదేశములను జూచెదఁగాక. (నిరూపించి) అహో! మాఱిపోయినదిగదా యీ భూమి సన్నివేశమంతయు;

మ॥ మును పెదుండెఁ బ్రవాహ, మందుఁబులినం ♦ బుల్ నేఁడుగాన్పించుఁ, జె
ట్లనికాయంబున సాంద్రతావిరళతల్ ♦ మార్పందె, నెన్నాళ్ళకో
కనుటం జేసి మఱొక్కకాన యను శం ♦ కల్దోఁచునేకాని, యా
వనియే యీవనియంచు రూఢి నచల ♦ వ్రాతంబు రూపించెడిన్॥

అయ్యో; తప్పించుకొని పోవుదమనుకొన్నను బంచవటీ స్నేహము నన్ను బలవంతముగ నాఁపుచున్నదికదా!

మ॥ మునుపెం దేఁబ్రియురాలితోఁ బహుదినం ♦ బుల్ కాఁపురంబుండియున్
దనివో కెచ్చటిగాథలే సతత మిం ♦ టం జెప్పుకొంచుందు మా
యనుఁగుం బంచవటిన్ గటా! ప్రియవయ ♦ స్యన్ మాపి, పెన్పాపినై
చని యేమోమునఁ గాంతుఁ గానకె టుపే ♦ క్షుం జేసి పోఁజాలుదున్॥

శంబు— (మరలఁ బ్రవేశించి) జయము దేవా! అగస్త్యభగవానులు మీరాక నాచే నెఱింగి, మీ కిట్లాదేశించినారు, 'మహర్షులందఱు నీకొఱకు నిరీక్షించుచున్నారు. వత్సలయగు లోపాముద్రయు, నీవు విమానమునుండి దిగునప్పుడు గావింపఁదగిన మంగళసంవిధానమును సిద్ధపఱచికొని నీరాక కెదురుచూచుచున్నది. కాన మమ్మెల్లర సంభావించి నాక్రతువు నెఱవేర్చి పొమ్ము' అని

రాము—భగవానుని యాదేశ మెట్లో యట్లే జరిగించెదను.

శంబు—దేవా! ఇటు ఇటు.

రాము—భగవతీ! పంచవటీ! క్షమింపుము. గురుజనాదేశ మతిక్రమింప రానిదిగాన నొక్కక్షణకాల మీ రామునకు సెలవిమ్ము.

(అందఱు నిష్క్రమింతురు.)

— ఇది చతుర్థాంకము —

శ్రీరామచంద్ర పరబ్రహ్మణేనమః

ఉత్తర రాఘవము

పంచమాంకము.

(అనసూయయు మురళయుఁ బ్రవేశింతురు)

అన—వత్సా! మురళా! ఎఱుంగుదువు గదా, మీనాయనగారి మునకు వాల్మీకి భగవానులు, జానకితోఁ గూడ నిక దయ చేసినవిషయము?

ముర—అనసూయాభగవతీ! వాల్మీకులవారిని జూచితినిగాని జానకి నెఱుంగనే?

అన—అవును ఎఱుఁగవు! ఈవియోగావస్థలో నెరులకంటఁబడకు ట్లామహానుభావుఁడు బిడ్డకు వరము ప్రసాదించినాఁడులే.

ముర—ఆలాగా! అట్లయిన జానకి యిచ్చటనున్నదన్నమాటయేకదా.

అన—ఉన్నది కావుననే నిన్నామె యుపచారమునకు నియమించి న్నాను.

ముర—కృతార్థురాలనే. మఱీ రామభద్రుఁడుగూడ నిక్కడకరు నాఁడని విన్నాముగదా.

అన—అందుకొఱకే భగవతిగోదావరికి సందేశమంపితిని.

ముర—ఏమని సందేశము?

అన—ప్రేయసీ! వినిపాతమువలనఁగలిగిన దీర్ఘశోకసంతాపముచే, రా భద్రుఁ డిప్పుడు సగమైయున్నాఁడు. ఇక్కడనుండి యతఁ బోవుచుఁ బ్రేయసీచిరసహవాసవిస్రంభములకు సాక్షిభూ తైయున్న పంచవటీప్రదేశములఁ జూడకమానఁడు. స్వభా చేత నెంతధీరుఁడైనను, నిట్టియవస్థలో నుప్పతిల్లు శోకసం

ములు ప్రతి పదము ప్రమాదకరములుగానే యూహింపఁదగి యున్నవికాన, రామభద్రుఁడు మూర్ఛిల్లినపుడెల్ల నీశీతలతరంగ చామరములతోఁ గమ్మఁదనంపుఁ బిల్ల తెమ్మెరల వీఁచుచు నాతని సేదఁదీర్చుచుండుము అని.

ముర—తల్లీ! ఆవాత్సల్యమునకు నీదాక్షిణ్యము తగియేయున్నది; మఱి సీత యెక్కడనున్నదో చూపుఁడు.

అన—గోదావరిమడుగునుండి బయలు దేరినది.

గీ॥ పాలి నవసిన చెక్కిళ్ళు, ♦ వ్రేలుకురులు
చిన్ని మోమున శోకవింత ♦ వన్నెఁగూర్పఁ
గరుణమూర్తియొ మైగొన్న ♦ విరహదశయొ
యనఁగ వనికేగు దెంచె న ♦ ల్లదిగో సీత॥

నేఁ డాయుష్మంతులగు కుశలవులకుఁ బండ్రెండవ యేఁడువచ్చి నది; కానఁ దత్సంఖ్యామంగళగ్రంథి కట్టఁబడును. అందుకొఱకు కామె సూర్యభగవానుని బూజింప వలయు. రమ్ము నీవును వత్సననుసరింతు వుగాని. (అందఱు నిష్క్రమింతురు)

— ఇది విష్కంభము —

(తెరలో) అమ్మయ్యో; ప్రమాదము, ప్రమాదము;

(అంతటఁ బూలఁగోయు నాసక్తితో సకరుణౌత్సుక్యముగా సీత ప్రవేశించును).

సీత—అహా! ప్రియసఖి వాసంతిమాటయే యిది.

(మరలఁ దెరలో)

మ॥ మును జేమీఁదుగ, సల్లకీకిసలయం ♦ బుల్ మేసి యల్లారుగో
మున సీతాసతి పెంచికొన్న కలభం ♦ పుంగున్న

సీత—ఆఁ దానికేమైనది ?

(మరలఁ దెరలో) స్వీయప్రియాం

గనతోఁగూడ సరోవిహారములసౌ ♦ ఖ్యంబందుచో గర్వమె
క్కిన వేళొక్కగజంబు దాని వడిదాఁ ♦ కెఁ దుర్మదోద్దండమై॥

సీత—(తొట్రుపాటుతోఁ గొన్నియడుగులునడచి) ఆర్యపుత్రా! నాపుత్రకుని రక్షింపుము; రక్షింపుము. (స్మృతినభినయించి చింతతో) అయ్యో! మందభాగ్యురాలను. ఈపంచవటీదర్శనమువలనఁ జిరతరాభ్యాసవశములైన యీయక్షరములే నానోట జారుచున్నవి కదా! హా ఆర్యపుత్రా! (మూర్ఛిల్లును)

మురళ—(ప్రవేశించి) సఖి! జానకీ! ఊరడిల్లుము.

సీత—నెచ్చెలీ! మురళా, వచ్చితివా! ఎన్నాళ్ళకు నిన్నుఁ జూచితిని. ఇటువంటి యవస్థలోనున్న నాసమాగమము నీకు మనోవేదనకే కాని సంతోషమునకుఁ గాదు గదా.

మురళ—సఖి! చెలులు పంచికొన్నప్పుడే కాదా దుఃఖమునకుఁ గొంత శాంతి.

(తెరలో) విమానరాజమా! ఇందే నిలువుము.

సీత—(విని, బెదరుపాటుతో) అహా! నెచ్చెలీ! జలధరధ్వానగంభీరమైన యీ వాక్యనిర్ఘోష మెక్కడిదో, శ్రవణగోచరమైనతోడనే మందభాగ్యురాలికి నాకుఁగూడ నేమో యూరట కలిగించుచున్నది!

మురళ—చెలియా! ఎక్కడిదో యవ్యక్తమైన యానినాదముననే యుఱుము విన్న మయూరివలె నింతసంభ్రమోల్లాస మేటి కేనికు?

సీత—సఖి! అవ్యక్తమందు వేమి. సవ్వడింగట్టి గ్రహించినాను. నిశ్చయముగా నార్యపుత్రుని మాటయేయది

మురళ—కాఁబోలు; శూద్రతాపసిని దండించుటకై ప్రవాసుఁడైన యీరాజు దండకారణ్యమునకేతెంచినాఁడని, విందును.

సీత—బాగు-ధర్మరక్షాతత్పరుఁడుగదా యీరాజు.

(పిమ్మటఁ గరుణాశాలియై రాముఁడు ప్రవేశించుచు)

సీ॥ పచ్చరాలపసిండి ♦ భవనంబు లెచ్చోటి ఛాయానపాయ భూ ♦ జములుమాకు
రమణీయమందిరా ♦ రామంబు లెచ్చోటి విరిపందిరులయేటి ♦ దరులుమాకు
వలపించు పన్నీటి ♦ జలదారులే కొండదొనల జాల్గొనుసన్న ♦ సోనలుమాకు
ఇలవేల్పుచుట్టాల ♦ బలగంబు లెచ్చోటి లీలామురంగబా ♦ లికలుమాకు
గీ॥ అట్టి మాపంచవటి యిదే • యుల్లనాఁటి కాఁపురపుఁ జిన్నెలివె వీనిఁ ♦ గాంచినంత
మఱఁగుములుచున్న దుఃఖాగ్ని ♦ మండఁబోవ మోహధూమంబయోనన్ను ♦ ముట్టడించె॥

(తనలో) హా ప్రేయసీ! జానకీ!

మురళ— ఇదియే గురుజనము శంకించినది.

సీత—(రామునిజూచి) అమ్మయ్యో! గుఱుతుపట్టుటకు సహజగంభీరాను భావమొక్కటి మిగిలియున్నది కాని, చూడు సఖి, యీయార్య పుత్రుని మూర్తియా యిది. అయ్యో! ప్రాతఃకాలచంద్రమండలమువలెఁ బాలిపోయి కృశించి, శరీరమెంత దుర్బలమైనది! సఖి! మురళా! నన్నుఁ బట్టుకొనుము.

(చెలిని గాఁగిలించికొని మూర్ఛిల్లును)

మురళ—చెలీ! ఊరడిల్లుము.

రాము—హా! దేవీ! దండకారణ్యవాస ప్రియసఖి! విదేహరాజపుత్రీ!

(మూర్ఛిల్లును)

సీత—అయ్యయ్యో! మందభాగ్యురాలిని నన్నే పేర్కొని మూఁతలు పడుచున్న కన్నుఁగల్వలతో నార్యపుత్రుఁడు మూర్ఛిల్లెఁ గదా. చూడుమమ్మా! యీపిరియు నాడక కటికనేలపైఁబడి యేమో విపర్యాసముగఁ దోఁచుచున్నారు. అయ్యో, మురళా! మురళా! రక్షింపుము రక్షింపుము. నాజీవితేశ్వరు నెట్లయిన బ్రతికింపుము. (పాదములపైఁబడును)

మురళ—కల్యాణీ; నీవే జగత్పతిని బ్రతికించికొనుము. నీకరస్పర్శమే కథా యీయాతనికి సంజీవనోపాయము పొమ్ము.

సీత—ఏమైననుగానీ! ప్రాణసఖి చెప్పినట్లేచేసెదను (అని వేగిరపాటుతోఁ
జని నేలపై వ్రాలియున్న రాముని స్పృశించును)

రాము— (ఆనందపారవశ్యమున నిట్టూర్పువిడుచుచు) ఆహా! ఏమిది!
హాయి హాయి

చ॥ సలలితచందనద్రుమకి • సాలరసప్రసరంబొ నిండుజా
బిలికిరణాంకురంబుల స్రి • వించిన సారసుధాభిషేకమో
మలమలమాడునాయుసున • మ్రాఁకు లలిఁ దలిరాకు వేయఁ గ్రొం
జలువల జీవనౌషధి ర • సాయనమో యిది హాయిహాయియహా॥

గీ॥ స్పర్శమిదియెక్కడిదొ పురా • పరిచితంబె
చిత్తపరిమోహణంబు సం • జీవసంబు
తాపమునఁ గల్గుసోలింతఁ • బాపుఁగాని
తోన నానందమున సొక్కు • లోనె ముంచు॥

సీత—(కొంతహర్షముతో) అమ్మయ్య త్రిలోకనాథునకు మరలఁ బ్రాణ
ములు చేరుకొన్నవి. (భయకరుణములతో నవ్వలికిఁ దొలంగి)
ఇప్పటికీపాటి బహుకృతియే నాకుఁ జాలు.

రాము—(లేచికూర్చుండి) వత్సలయగు దేవిచేఁ బ్రసాదింపఁబడలేదుగదా!
కానీ, పరికించెదను.

సీత—నెచ్చెలీ! ఆర్యపుత్రులు నన్ను గుర్తించిరేమో రమ్మావలకు.
అభ్యనుజ్ఞ లేకయే నాయంత నేను కల్పించుకొనిన యీసన్ని
ధానమునకై, మహారాజెంతయో నాపైఁ గోపించును.

ముర—ఓసి! చెలా! వాల్మీకి వరప్రభావమున వనదేవతలకుఁగూడ నీవగ
పడవు జడియకుము.

సీత—అవును. ఆవర మున్నదికదా.

రాము—హా! ప్రేయసీ! జనకనందినీ!

సీత—(పొలయల్కఁ త్రోడి డగ్గుత్తికతో) ఆర్యపుత్రా! జరిగిన వృత్తాంత మేమి యీస్నేహసంభాషణమేమి? మురళా! వినుచున్నావు కదా! యేమహాభాగునిదర్శనము జన్మాంతరములకైనను దుర్లభమని తలంచుచుందునో యట్టి యార్యపుత్రుఁడు మందభాగ్యనగు నన్నుద్దేశించి, యిట్లాక్రోశించుచుండఁ జూచి వజ్రమయహృదయనై యేమని యీతనియెడఁ గాఠిన్యమువహించి యూరకుందును, చెప్పుము. ఎటుంగుదుముకదా యీతనిహృదయము నేనును, నాహృదయ మీతఁడును. నెచ్చెలీ! నన్నట్లు నిష్కారణముగఁ బరిత్యజించినను నిప్పుడీవిధముగానున్న యీతనిఁ జూచుచున్నప్పుడు నాహృదయావస్థ యెట్లున్నదని చెప్పుదును?

రాము—(కలయంజూచి) అయ్యో! ఇచ్చట నెవ్వరును లేరే. హా ప్రేయసీ! జానకీ!

గీ॥ తనువున మెలంగు ప్రాణయావ ♦ తార మనఁగ
స్నేహరసశీతలంబైన ♦ నీదు స్పర్శ
వలనిసోలింత యిప్పటి ♦ వరకు విడదు
ప్రేయసీ! యింక సాక్షాత్క ♦ రింప వేల?

సీత—ఆహా! ఆర్యపుత్రుని యీశోకాలాపము లగాధదర్శితస్నేహసంభారములు. ఆనందనిష్యందులు సుధామయములు. వీనియందలి విశ్వాసముచేతఁగదా, నిర్హేతుకపరిత్యాగశల్యమున వధింపఁబడుచున్నను నాజన్మము చరితార్థమేయైనది.

రాము—లేదు లేదు; ఇచ్చట ప్రేయసియెక్కడిది. ఇది, సంకల్పపరంపరాభ్యాసముచే రామభద్రు నావరించిన కేవలభ్రాంతి. అంతకంటె నేమియు లేదు.

(తెరలో) ప్రమాదము, ప్రమాదము.

('మ॥ మును జేమోఁదుగ ... అను పూర్వార్థము పఠింపఁబడును)

సీత—అక్కటా; ఇప్పుడెవ్వ రాపాపిష్ఠిగజము నడ్డగింతురు!

రాము—ఆ! ప్రేయసీపుత్త్రకునిపై డీకొనుచున్న యాదుర్బుద్ధి యెక్కడ!

వాసంతి—(తత్తరపాటునఁ బ్రవేశించి) ఏమీ! రఘునాథుఁడా!

సీత—ఏమీ! నానెచ్చెలి వాసంతియా!

వాసం—దేవా! జయము జయము.

రాము—(నిరూపించి) ఏమీ! ప్రియసఖి వాసంతియా!

వాసం—దేవా! త్వరపడవలయు. ఇక్కడనుండి జటాయుశిఖరమునకు దక్షిణముగానున్న సీతాతీర్థము మీఁదుగా గోదావరిలోనికిం దిగి దేవీపుత్త్రకుని సంభావింపుము.

సీత—హాతండ్రీ! జటాయూ! నీవు లేక యీజనస్థానమిప్పుడు పాడువడి పోయినదికదా!

రాము—హాహా! హృదయమర్మములఁ గోయుచున్నవే యీపూర్వకథా ప్రసంగములు

వాసం—దేవా! ఇటు ఇటు

సీత—నెచ్చెలీ; మురళా! నిజమే సుమీ వనదేవతలుగూడ నన్నుఁ జూడఁ జాలకున్నారు.

మురళ—మఱి సాధారణమా వాల్మీకివరప్రభావము?

సీత—ఆలాగైన వీరి ననుసరింతము రమ్ము. (పరిక్రమింతురు.)

రాము—భగవతీ గోదావరీ! నమస్కారము.

వాసం—(కనుఁగొని) దేవా! ఆనందింపుము వధూసహచారియై దేవీపుత్త్రకుఁడు విజయోల్లాసమున నోలలాడుచున్నాఁడు.

రాము—వర్ధిల్లుఁగాక ఆయుష్మంతుఁడు.

సీత—అమ్మయ్య; ఇప్పటి కీకోడు కింతటివాఁడయ్యెఁగదా!

రాము—దేవీ; నీవుకృతార్థురాలవు.

శా॥ బాలక్రీడల నీవతంసలవలీ • పత్రంబు గైకొంచు ముగ్
బాలాంభోరుహనాళపల్లవములం • బాటించు నూన్యూఁగుదం

తాలగ్రాలిన నీసుతుం డితఁడుమా • ద్వంద్వంతి నోడించి, నేఁ
డాలంబించెఁగదా కుటుంబిని! వయో • ద్ధాంబైన కల్యాణముల్॥

సీత—సౌమ్యదర్శనయగు తనప్రియురాలితో నీచిరంజీవి వియోగమన్నది యెఱుంగకుండఁగాక నెచ్చెలీ! ఇది యిట్టిదైనదికదా. ఇఁక నాకుశలవు లెట్లగుదురో?

మురల—సఖీ! ఇదియెట్టిదో వారును నట్టివారే యగుదురు.

సీత—చెలీ! ఎంతటియదృష్టహీనురాలను నేను; ఆర్యపుత్రవియోగమే కాక పుత్రవియోగముగూడనా? మురళా! నేను బిడ్డలంగన్న ఫలమేమి? మల్లెమొగ్గలవంటి పలుచని పలువరుసతోడను, మొలకనవ్వుల కేకిసలచే మిసమిసలాడు పాలబుగ్గలతోడను నందగించు నాపుత్రకుల ముఖారవిందములనార్యపుత్రుఁడు ముద్దాడుచుండఁగాఁ జూడకపోయితినే!

మురల—సఖీ! చూచెదవు దైవానుగ్రహముచే;

సీత—ప్రాణసఖీ! బిడ్డలు తలఁపునకువచ్చి పాలిండ్లు చేఁపుటచే నిప్పుడు వారి తండ్రిసన్నిధానమున నేనునుక్షణమాత్రముసంసారిణినైతిని.

మురల—చెలీ! అబ్బురమా యిది? సంతానముకదా ప్రణయప్రకర్షమునకుఁ బరమావధి. తలిదండ్రుల పరస్పరానుబంధమును బిగియించునది కానుపేకదా!

వాసం—దేవా! ఈదిక్కునఁదిలకింపుఁడు

గీ॥ అపుడప్పుడె యంకురించు చి • న్నారిపింఛ
మమరుతతి సీత పెంచిన • నెమిలి, యదిగో
నీటుతలకుచ్చురత్నకి • రీటమమరఁ
గొమ్మఁగూడి కదంబానఁ • గూయు నిపుడు॥

రాము—ఆనందింపుము వత్సా ఆనందింపుము.

సీత—అపును ఆనెమిలియే యిది

రాము—నాయనా! మయూరకుమారా!

మ॥ వలయంపు న్నటనక్రమంబు లెఱిఁగిం ♦ పక్ష దారకాచంక్రమం
బుల గుఱ్ఱుల్ వెలయించు కంటికిఁ బటు ♦ భ్రూవల్లరీనాట్యముల్
దళుకుల్వోయఁ గరప్రవాళములఁ దా ♦ శప్రక్రియల్ సూపుచున్
జెలియాడించిన నిన్ను నాసుతునిగాఁ ♦ జింతింతు నశ్రాంతమున్॥

అహో! తిర్యగ్జంతువులుగూడఁ బరిచయము మఱచిపోవుగదా!

గీ॥ కాంత మును బెంచునప్పుడీ ♦ కడిమిమ్రాఁకు
కొలఁది తొలిపూఁత చిన్నారి ♦ గుమ్మటంబు

సీత—నిజమే. ఆర్యపుత్రులు చక్కఁగా గుర్తించినారు.

స్వజనమునఁబోలె దీన హ ♦ ర్షంబుగనుచు
ఈగిరిమయూర మిట సీత ♦ నే తలంచు॥

వాసం—దేవర యిచటఁ గూరుచుందురు గాక.

గీ॥ కదళికారామమున నీవు ♦ కాంతతోడ
మున్ను శయనించు చలువరా ♦ తిన్నెయిదియె
ఱేపుమాపిట సీత చే ♦ మేపులిడుట
హరిణకము లిప్పటికి దీని ♦ మరగి చనవు॥

రాము—సఖీ వాసంతీ; నేదీనింజూడ లేను. (ఏడ్చుచు నింకొకయెడఁ గూరుచుండును).

సీత—సఖీ, వాసంతీ; ఈప్రదేశము నార్యపుత్రునకు నాకును జూపించి, యేమిపనిచేసితివే. అయ్యో! అతఁడే యార్యపుత్రుఁడు, అదియే పంచవటి, అల్లదియే ప్రియసఖి వాసంతి. అవియే మాకు వివిధవిస్రంభసాక్షులగు గోదావరీపరిసరవనీప్రదేశములు. అల్లవే నాబిడ్డలవంటివైన మృగములు, పక్షులు వృక్షములును. మందభాగ్యకు నాకివి యన్నియుఁ గన్నుల యెదుట నున్నను, లేనివే కదా. అయ్యో! జీవలోకపరివర్తన మీలాగైపోయెఁ గదా!

హా! దైవమా; 'నేను లేకయీతఁడును, ఈతఁడు లేక నేనును' అని కలయందైన నెవ్వరుదలంచిరి. నాకిదియొకజన్మాంతరావస్థ కాఁబోలు. కావున నేఁటికైన నాయందనుగ్రహముచేఁ గానంబడిన నాజీవితేశ్వరుని బాష్పసలిలధారావ్యవధానములయందుఁ జూచికొనుచుందును.

మురళ—సఖీ జానకీ! చూచికొనుము. వెల్లివొడుచుచున్న యానందశోకాశ్రుపూరములతోఁ బ్రేమామృతమును వర్షించుచు దయితాలోకనోత్కంఠచే నుత్తానధీర్ఘమైయున్న నీచూడ్కి పాలకాలువవలెఁ బ్రియుని నోలలాడించుచున్నది.

వాసంతి—

మ॥ ఫలపుష్పార్ఘ్యమొసంగుఁగావుత, తరు ♦ వ్రాతంబు క్రొంజేనియల్
దళితాంభోరుహసౌరభంబుల, వనాం ♦ తర్వాయువుల్ వీవుతన్
గలగానంబు లొనర్చుఁగావుత విహం ♦ గశ్రేణి సోత్కంఠమై
చెలిమిన్ వెండి మహానుభావుఁ డరుదెం ♦ చెన్ రాముఁ డీకానకున్!

రాము—సఖీ! వాసంతీ! ఇక్కడఁగూరుచుండుము.

వాసంతి—(కూర్చుండి కన్నీళ్ళతో) మహారాజా! కుశలమా కుమారలక్ష్మణునకు ?

రాము—(వినమి నభినయించి)

మ॥ తటితో లేచి, కరారవిందములు గం ♦ దన్ సీత నీరోసి, ని
వ్వరులన్ మేఁపి కుశాంకురంబులిడి, పెం ♦ పన్ సొంపువాటించు నీ
తరుసారంగవిహంగమపరిముఖసం ♦ తానంబుఁగన్గొన్న దు
ర్భర మీగుండెగఅంగినీరగువికా ♦ రంబేదొ నన్నే చెడున్

వాసం—మహారాజా! నిన్నే అడుగుచున్నాను. కుశలమా కుమారలక్ష్మణునకు?

రాము—(స్వగతము) ఓహో! "మహారాజా" అని ప్రేమలేని యామంత్రణము నాకును, సౌమిత్రియెడ మాత్రము బాష్ప

గద్గదాక్షరముగాఁ గుశలప్రశ్నమునా? ఇందువలన సీత
త్యాగవృత్తాంత మీమెకుఁ దెలియవచ్చినదనియే తలంపవ
(ప్రకాశముగా) ఆఁ కుశలమే కుమారుడను.

వాసం—ఓ దేవా! ఏమందును! క్రూరుఁడవైపోయితివే.

సీత—సఖి వాసంతీ! నీవే యిట్లాడుచుంటివేమి? ఆర్యపుత్రుం
రకుఁ బ్రేమపాత్రుఁడై యుండఁగా విశేషించి నీకుఁ జెం
సిన దేమి?

వాసం—ఆహా! ఎన్నియిచ్చకము లాడితివి. ఎన్ని నయగార
వెల్లడించితివి?

చం॥ అమలమతీ! మదీయహృద ♦ యంబునకుం హృదయంబ వీవు,
ణమునకుఁ బ్రాణమీవు, నయ ♦ నంబులఁ జంద్రిక వీవు, గాత్ర
దమృతరసంబ వీ వనుచు, ♦ నమ్మెయి నన్నిప్రియంబు, లన్నితీ
యము లని, యావిముగ్ధ నె క ♦ టా! (నిట్టూర్పు విడిచి)
యిఁక నెందుల కాప్రసంగముల్॥ (మూర్ఛిల్లు

మురళ—అవును; వాక్యము ముగింపకుంటయు, మూర్ఛయుఁ
యున్నవి.

రాము—సఖి! ఊరడిల్లుము.

వాసం—దేవా! ఇంతటియకార్య మొనరించితివేమి?

సీత—వాసంతీ చాలు నూఱకుండుము.

రాము—లోకము సైరింపదని,...

వాసం—అది యేమికారణమున?

రాము—ఏమో దానికే యెఱుక

మురళ—నిందింపవలసినదే లోకమును.

వాసం—ఏమిమాట యిది.

ఉ॥ ఓయి కఠోర! నీకు యశ • మొక్కటియేగద వాంఛితార్థ, మ
త్యాయత మింతకంటెఁగల • దా యిల ఘోరతరాపకీర్తి, య
న్నా! యటవీస్థలిన్ బసి య • నాథ, మృగేక్షణ యేమియయ్యెనో
హా! యధినాథ! యెంతపని • కోర్చితి వేమనుకొంచునుందువో॥

సీత—సఖీ వాసంతీ! అనరాదుగాని నీవేదారుణవు కఠోరవును. క్షోభించుచున్న యార్యపుత్రుని మఱింత క్షోభింపఁజేయుచున్నావు.

రాము—

మ॥ చెలి! యింకేమని తెల్పుదున్ సతి గతిం • జేన్ గానలోఁజిక్కి, వి
హ్వలయై తల్లికిఁబాయు లేడిపసిపా • పంబోలి, నీరాము ప్రో
ద్దుల గర్భం బతిభారమై జవజవన్ • దూఁగాడుచోఁ బాహువె
న్నెలతోఁ బోలు తదీయ కాయలతికన్ • మ్రింగెన్ వనీసత్వముల్॥

సీత—ఆర్యపుత్రా! ఇదిగో నేను బ్రతికియే యున్నాను.

రాము—హా ప్రియా! జానకీ! యెక్కడనున్నావు?

సీత—అయ్యో, అయ్యో, ఆర్యపుత్రులు నాకొఱకై వావిడిచి యేడ్చుచున్నారు గదా!

మురళ—చెలీ! జానకీ! ఇప్పుడింతకంటెఁ గర్తవ్యము లేదు. దుఃఖితులు దుఃఖోపశమనము గావించుకొనవలసినదే,

గీ॥ వరదవడి, దట్టముగ గట్టు • లొరయు నపుడు
గండి తెఱచినచోఁ దటా • కంబు తెగదు
విపుల శోకంబుచేత క్షో • భించు నపుడు
బిట్టు విలపించుచో గుండె • ప్రీలిపోదు॥

రాము—అక్కటా! ఈ రామభద్రుని జీవయాత్ర యెటుచూచినను గష్టతరమై పోయెనే.

మ॥ ధరణీపాలనమా, యథావిధిగఁ గ • ర్తవ్యంబు, తాదృక్ప్రియా
విరహంబా మిడిమెండ కొఱ్ఱిరినటుల్ • వేధించుగా జీవమున్

బరివర్జించి, తనంత, నేడ్పుటకునై ♦ నన్ బ్రోప్రియా లేదు, డె
ప్పరపుం గుండెభరంబుదీర నిపుడే ♦ డ్వంగ గ్లె మే లేకదా !

హా హా దుర్భరము దుర్భరము—

శా॥ వ్రీలున్ డెందము శోకతీవ్రత ద్విధా ♦ భిన్నంబుగా దింతకున్
గూలున్ మేను గలంగి మోహమున వీ ♦ డ్కోఁ డింకఁ జైతన్యమున్
గాలున్ నిల్వున దేహ మూంతరశిఖిన్ ♦ గాడింతకుం బూది యి
స్సీ! లో మర్మము లంటఁ గోయు విధి వి ♦ చ్ఛేదింప దీజీవమున్॥

సీత—ఇటువంటిదే యీదుఃఖము.

రాము— ఓనాయనలారా! పౌరజానపదులారా!

మ॥ అనుకూలింపక పోయె దేవి భవనం ♦ బాదుంట యేమీకుఁ. గా
నని కానన్ దృణమట్లువీడి, లనమై ♦ నన్ వెన్కఁజింతింప, నేఁ
డనుభూతప్రియబాంధవంబులగునా ♦ యా భావముల్ మానసం
బున రేఁగన్ విలపింతునియ్యెడ క్షమిం ♦ పుండయ్య నేదీనుఁడన్॥

మురళ—ఈశోకసాగర మతిగంభీరముగనున్నది.

వాసం—దేవా! గడచినదానికై వగచి యేమిప్రయోజనము? ధైర్య
మవలంబింపుఁడు

రాము—సఖీ వాసంతీ! ఇంకను ధైర్యమనుచున్నావేమి?

గీ॥ జానకీశూన్యమైన యీ ♦ జగతియందుఁ
బడియు రెండేండ్లకాల మి ♦ ప్పటికిజరగె
'సీత' యనుపేరుగూడ న ♦ శించిపోయె
'రాముఁడు నశించె' ననుమాట ♦ రాకపోయె ॥

సీత—అయ్యో మురళా! ఆర్యపుత్రుని యీవిలాపములచే నేను
విమూఢనై పోవుచున్నాను.

మురళ—నెచ్చెలీ! నిజమే స్నేహార్ద్రశీతలంబులయ్యు శోకనిష్ఠురములగు
టచే నీకీపలుకు లంతహృద్యములుగావు. ఏలయన నివియెల్ల విష
రసమలీమసములైన తేనెసోనలై నీమీఁదఁ గురియుచున్నవి.

రాము—సఖీ వాసంతీ! ఇంకెంతకాలము సైరింతును.

మ॥ నరముల్ గాఢఁగ నాటుకొన్న విషదం ♦ ష్ట్రింబోలి; డెందాన ని
ష్ఠురతన్ గుచ్చి మెలిద్రిమలంచుకొనునట్టిం ♦ చుంగాలముంబోలి దు
ర్భరమై దారుణశోకకీల మిటుమ ♦ ర్మశ్రేణులంబట్టి యే
డ్తెఱమై చీల్చుచునున్న నోర్చుకొనలే ♦ దే మెండినై నెచ్చెలీ॥

సీత—అక్కటా! ఎంతటి మంద భాగ్యురాలను; ఆర్యపుత్రున కీవిధముగ మాటిమాటికి నాయాసము కలిగించుచున్నాను.

రాము—సఖీ వాసంతీ! ఈవిధముగ నంతఃకరణమును జలియింపనీక యెంత చిక్కబట్టుకొనియున్నను బూర్వానుభూతములగు నా యావస్తువుల సందర్శించుటచే నిప్పుడు నాకీ సంక్షోభము తటస్థించినది. ఈ యావేగము నరికట్టుటకు నే నెట్టి గట్టియత్నము లొనరించుచున్నను నవియెల్ల, మహాప్రవాహరయము నందు, సైకతసేతువువలె భిన్నములై బలాత్కారమగు కొండొక వికారము నన్నావరించుచున్నదిగదా!

సీత—అయ్యో! దుర్వారవిప్లవారంభమగు నార్యపుత్రుని యీ దుఃఖసంక్షోభముచే నాహృదయము, తనదుఃఖావస్థను మఱచిపోయి కలగుండువడుచున్నదిగదా!

వాసం—(స్వగతము) ఈ మహానుభావుఁ డత్యాపన్నుఁడై యున్నాఁడు; కావునఁ బ్రసంగాంతరమున కితని హృదయము మరల్చెదను, (ప్రకాశముగ) దేవా! పూర్వానుభూతములైన యీజనస్థాన ప్రదేశముల నించుక పరికింపుఁడు.

రాము—అట్లేకానిమ్ము (లేచి పరిక్రమించును.)

సీత—ఆహా! ఈవాసంతి దుఃఖోద్దీపకములనే వినోదోపాయములని భ్రమించుచున్నది కదా.

వాసం—దేవా! జ్ఞాపకమున్నదా?

మ॥ కనుఁగొమ్మాపాదరింటనే చెలియరా • కన్ వేచియున్నావు, మా
నిని గోదావరి రేవునం దిసుక తి • న్నెన్ హంసలన్ గాంచుజో!
కను జాగ్రై చనుదెంచు చీవు పొలయు • ల్కంగొన్న సన్నం గ్రహిం
చి నవాంభోరుహకోరకాభము రచిం • చెన్ భీతి సేవాంజలిన్

సీత—వాసంతీ! కఠినురాలవుగదా నీవు; హృదయమర్మశల్యములఁ గద లించు నీలాటివృత్తాంతములతో మాటిమాటికి మందభాగ్యురాలిని నన్నును, ఆర్యపుత్త్రునింగూడ సంతపింపఁ జేయుచున్నావు

రాము—హాచండీ! జానకీ! ఇందందుఁ గానఁబడుచున్నట్లుండియు జాలి వహింపవుగా!

శా॥ హా దేవీ! హృదయంబుభిన్నమగు, వ • క్షోదేహబంధంబులున్
లేదయ్యెన్ జగమే, దహించు నమితా • గ్నిజ్వాల లోలోపలన్
మీఁదుంగ్రిందు నెఱుంగ కాత్తము తమోం • ధభూతమై పోయె హా!
హా! దౌర్భాగ్యుఁడ నేమి సేయుదు, విమో • హాంభోధిలో మున్గితిన్॥
(అని మూర్ఛిల్లును)

సీత—అయ్యో అయ్యో! ఆర్యపుత్త్రుఁడు మరల మూర్ఛపోయినాఁడు గదా!

వాసం—దేవా! ఊరడిల్లుము. ఊరడిల్లుము.

సీత—హా! జీవితేశ్వర! సకలలోకైక కల్యాణమూర్తివైన నీవు, మందభాగ్యురాలనగు నానిమిత్తమై మాటిమాటికి జీవితసంశయ దారుణంబగు నీలాటి యవస్థాపరిణామము ననుభవించుచుంటివే. సఖీ మురళా! ఇఁక నేఁ బ్రతుకలేను.

ముర—చెలియా! ఊరడుము. మరల నీకరస్పర్శమే రామభద్రునకు సంజీవనోపాయము.

వాసం—అయ్యో, ఇఁక నేమిగతి, ఇప్పటికిని మూర్ఛ దేరకున్నాఁడు హాప్రియసఖీ! జానకీ! నీప్రాణేశ్వరు నింకను సంభావింపవేమి?

(సీత తత్తరపాటుతో సమీపించి రాముని హృదయమునందును,
నెన్నొసటియందును స్పృశించుచున్నది.)

వాసం—అమ్మయ్య రామభద్రునకు మరలఁ బ్రాణములు చేరుకొన్నవి.

రాము—ఆహా! ఏమిది.

గీ॥ తనువునందున్న లోవెలి ♦ ధాతువులను
అమృత రస లేపముల నోల ♦ లార్చినట్లు
స్పర్శ మేదియో మరల జీ ♦ వం బొసంగి
ముంచె నాకస్మికానంద ♦ మూర్ఛలోన॥

సఖీ వాసంతీ! అదృష్టవంతురాలవు

వాసం—ఏమి యేమి?

రాము—మఱేమున్నది. మరల జానకి దొరక నేదొరికినది.

వాసం—రామచంద్రా! ఆమె యెక్కడ?

రాము—(స్పర్శసుఖమనుభవించుచు) ఇదిగో యెదుట నే యున్నది.

వాసం—ఓయీ ప్రియసఖీవియోగదుఃఖమున నిదివరకే దహింపఁ
బడుచున్న యీమందభాగ్యురాలిని, మాటిమాటికి మర్మచ్ఛేద
కఠోరములగు నీలాటి ప్రలాపములచే నేల దహించెదవు?

సీత—ఆహా! అవ్వలికిఁదొలంగి పోఁదలంతుఁగాని, అంతటి దీర్ఘదుర్భర
మైన నా సంతాపమునుగూడ రవంతలో నడఁగించునదై చిరతర
స్నేహప్రసన్నశీతలంబైయున్న యార్యపుత్రుని యీకరస్పర్శ
ముచే వజ్రమయమగుటంకమున నతికింపఁబడినట్లు నా హస్త
మీవలకు రాకున్నదే!

రాము—సఖీ వాసంతీ! ప్రలాపములుగావు నిజముగ సీత దొరికినది.

చం॥ పరిణయవేళఁ గంకణ శు ♦ భంకర మేకర మందికొంటి, నే
కర మనుభూతమయ్యెఁ జిర ♦ కాలము నాకు, యథేచ్ఛమై సుధా

ఘురశశిరంబులైన యుప • చారములఁ గరకాతుపారసుం
దరలవలీప్రవాళలలి • తం బిపు డాకరమే గ్రహించితిఁ॥

సీత—అయ్యో అయ్యో! ఆర్యపుత్రసంస్పర్శమువలని విమోహాము చే నాకుఁ బ్రమాదముసంభవించెనే!

వాసం—అకటా! ఉన్మాదమే!

సీత—(సంభ్రమమున విడిపించుకొని యవ్వలికేగును)

రాము—హా; హా; వాసంతీ ప్రమాదమేయైనది.

వాసం—దేవా! ఏమి ఏమి.

రాము—ఇంకేమున్నది.

గీ॥ జడము, ప్రస్వేదకంబు, చం • చలమునైన
సకియ చిగురాకుఁజే యిట్టె • జాఱిపోయె
జడము ప్రస్వేదకంబు చం • చలమునైన
నాకరమునుండి యున్న దు • న్నటులెయుండి॥

సీత—అయ్యయ్యో! ఆర్యపుత్రుడిప్పటికిని దన్నుఁ దాఁ దెలిసికొన నేరకున్నాఁడు. నేత్రములకింకను నైజవిలాసమురాలేదు. కనుజూపులు నిశ్చలములై యెదుటనున్న విషయమునుగూడ సంగ్రహింపనేరక యూరక ఘూర్ణమానము లగుచున్నవి.

తమస—(సస్నేహకౌతుకమున సీతను నిరూపించి)

గీ॥ నాతిమేను ప్రియస్పర్శ • నాతి హర్ష
మునను జలియించి, చెమరించి • పులకరించెఁ
బవనమునఁ దూఁగి తొలకరి • వానఁ దోఁగి
కోరగించుకదంబంపుఁ • గొమ్మ పోలె॥

సీత—ఓహో! "పరిత్యజించిన మగనిపై దీని కింత యనురాగమేమి" యని మురళ నన్నుఁ జూచి యేమనుకొనుచున్నదో యని నాకు

రాము—హా! ఏమిది జానకి లేనే లేదే! ఓసీ నిర్దయురాలా! వైదేహీ!

సీత—ఆ నిజముగా, నేను నిర్దయురాలనే, ఇట్టియవస్థలోనున్న మిమ్ముఁ జూచుచుండియు జీవించియున్నాను.

రాము—హా ప్రేయసీ; ఎందున్నావు? అనుగ్రహింపవా? ఇట్టి నన్ను విడనాడిపోవుట నీకుఁదగునా?

సీత—ఆర్యపుత్రా! విపరీతముగాదా యిట్లనుట

వాసం—దేవా శాంతింపుఁడు, మేరమీఱిన వియోగదుఃఖముచేఁ బరవశమైన మీహృదయమును, లోకోత్తరమైన మీధైర్యముచేతనే కుదుటఁబఱచికొనుఁడు. ఇక్కడ నాప్రియసఖి యెక్కడిది?

రాము—నిజమే, లేదు; ఉన్నచో వాసంతికైన నగుపడదా? ఇది స్వప్న వృత్తాంతమేమో! నేను నిద్దురపోలేదే! మొదలు రామునకు నిద్ర యెక్కడిది! ఇది నిశ్చయముగా నిరంతరసంకల్ప పరంపరలచేఁ గల్పింపఁబడిన కేవల చిత్తభ్రాంతి. ఇదే సర్వథా నన్ను వెన్నాడుచున్నది.

సీత—కఠినురాలను నేనే యార్యపుత్రుని మోసగించితిని.

వాసం—దేవా; చూడు చూడు,

మ॥ ఉరుదైతేయు నయోరథంబిదె, జటా • యుర్భిన్నభిన్నంబు; త
త్తరవాహంబు లవే, పిశాచముఖముల్ • కంకాళశేషాంకముల్;
ఖరుఁ డిచ్చోటజటాయుపక్షయుగము • త్పాటించి రోషోజ్జ్వల
ద్ధరణీజం గొనిపోయె మింటఁ జలదం • తశ్చంచలాబ్దంబనన్ ॥

సీత—(భయముతో) హా! ఆర్యపుత్రా! తండ్రి వధింపఁబడుచున్నాఁడు. రక్షింపుము రక్షింపుము. నే నపహరింపఁబడుచున్నాను.

రాము—(వేగమునలేచి) అరేపాపీ! తాతప్రాణసీతాపహారీ! ఎందుఁబోయెదవురా?

వాసం—దేవా! రాక్షసకులప్రళయధూమకేతూ! ఇప్పుడును నీక్రోధమున కాస్పదముకలదా?

సీత—అహ్హా! ఉన్మత్తనైతినే!

రాము—ఇప్పుడు నిజముగాఁ బ్రలాపమే చేసితిని. ఇప్పటి వైపరీత్య

మటువంటిదికాదు. ఇది వేఱువిధమైనది. అక్కటా!

ఉ॥ ఆవిరహం బుపాయనివ • హంబుల నిత్యవినోదహేతుకం
బై, వివిధోగ్రసంగర వి • హారములన్ జగదద్భుతావహం
బై, వినువేది శాత్రవవ • ధావధి సైఁపఁగనయ్యె ము, న్నయో!
ఈవిరహాబ్ధి కేయవధి • యేది ప్రతిక్రియ నేఁడు సైఁపఁగన్॥

సీత—ఏమీ దీని కవధియే లేదుగా! హా మందభాగ్యురాలను జెడి
పోయితిని. (ఏడ్చును.)

వాసం—దేవా! దీనికిఁ బ్రతిక్రియయే లేదా!

రామ—ఇంకేమి ప్రతిక్రియ వాసంతీ! హా హా కష్టము

సీ॥ కపికులేశ్వరుని స • ఖ్యం బెందుఁ గొఱగాదు
కపిసేన లెచట న • క్కఱకురావు
జాంబవన్మతికి లే • శం బెందుఁ బనిలేదు
హనుమంతుఁడేని యెం • దరుగలేఁడు
ఎచటసేతువు నలుం • డేని నిర్మింపలేఁ
డలవిభీషణుఁడేని • రర్థుఁడెందు
సౌమిత్రిబాణసం • చయ మెందుఁ జొరలేదు
నాశక్తి కెందు య • త్నంబెలేదు

గీ॥ అక్కటా! యట్టిదుర్గమం • బైనచోట
నెచటనున్నావె జానకీ! • యెందుఁగన్నఁ
బ్రాణములఁగోసియిదునింత • బలగముండి
ప్రేయసీ! నీయవస్థ త • ప్పింపలేరు॥

సఖీ వాసంతీ! ఇప్పుడు రామదర్శనము సఖులకు దుఃఖము
కొఱకే. ఇట్లెంతకాలము నిన్నేడిపింతును. సంకల్పితమగు నశ్వమేధము
నిర్వహించుటకై శీఘ్రముగఁ బోవలసియున్నది. కాన నాకింకఁ
బయనమున కానతిమ్ము.

సీత—(ఉద్వేగముతో మురళం గౌఁగిలించుకొని) అయ్యో మురళా! ఆర్య
పుత్రుఁడు వెడలిపోనే పోవుచున్నాఁడు. నా కింకేమిగతి (మూర్ఛిల్లును.)

ముర—చెలీ! జానకీ! ఊరడిల్లుము. ఆయుష్మంతులగు కుశలవుల

వర్షవర్ధన మహోత్సవము నిర్వర్తింప, భాగీరథీపదసన్నిధానము నకు మనమును బోవుదము రమ్ము.

వాసం—పాపము శమించుఁగాక! అశ్వమేధ నిర్వహణమా? మఱి సహధర్మచారిణి యెవరు?

రాము—ఉన్నదికదా బంగారపు సీతాప్రతిమ.

సీత—(నిట్టూర్చి కన్నీటితో) ఆహా! ఆర్యపుత్రుఁడవే యిప్పుడు నీవు. ఇప్పుడు నాపరిత్యాగశల్యము లాగివేయఁబడినది.

రాము—దానింజూచుకొనుచునైనను బాష్పపూరితమైన నా నయన మును గొంతవినోదింపఁ జేసికొందును.

సీత—ఆహా! ఆర్యపుత్రునిచే బహుమానింపఁబడుచున్న యాప్రతిమ ధన్యగదా. అది ఆర్యపుత్రుని వినోదింపఁ జేయునదై జీవలోక మునకెల్ల నాశానిబంధనమైనది.

మురళ—(చిరునవ్వుతోడను, స్నేహబాష్పములతోడను గౌఁగిలించి) సఖీ! నిన్ను నీవే పొగడుకొనుచున్నావు.

సీత—(లజ్జతోఁ దలవంచి) మురళ నన్నుఁబరిహసించుచున్నది.

వాసం—దేవా! ఈసమావేశము మాకు మహాప్రసాదము. కార్య భంగముగాకుండునట్లు ప్రయాణ మనుసంధింపుఁడు.

సీత—అయ్యో! నాకిప్పుడు వాసంతి ప్రతికూలయయ్యెనే

మురళ—చెలియా! రమ్ము. పోవుదము.

సీత—(కష్టముతో) వచ్చుచున్నాను. దుర్లభదర్శనుని క్షణమాత్రము చూచుకొందును. (పోవుచు) అపూర్వపుణ్యపరిపాకముచే దర్శన మిచ్చిన యార్యపుత్రుని పాదపద్మముల కిదేనమస్కారము.

(మూర్ఛిల్లును)

మురళ—సఖీ! ఊరడిల్లుము లెమ్ము.

సీత—మేఘాంతరమందలి పూర్ణచంద్రదర్శన మెంతసేపు.

రాము—విమానరాజమా! ఇటు ఇటు. (అందఱు లేచుచున్నారు.)

ఇది పంచమాంకము.

శ్రీరామచంద్ర పరబ్రహ్మణేనమః

ఉత్తర రాఘవము

షష్ఠాంకము.

(వటువులతోఁ గుశలవులు పాడుచుఁ బ్రవేశించుచున్నారు.)

గేయము - కాఫీ - చతురశ్రగతి.

రామ_సకలగుణధామా_తారకనామా_రఘుకులసోమా ॥పరం॥

ధామా రాజలలామా_కలుషవిరామా దశరథరామా ॥జయ॥

తాపసయాగవి_దారణదారుణ_దైత్యవిభంజనరామా ॥పురహార॥

చాపవిపాటన-పాటవ, ధరణీ-జారమణీవర రామా ॥జయ॥

పరశురామ బల_భంజనరామా_ప్రముదితపార్థివరామా ॥రామా॥

పరిపాలిత గురు_వచనా, వనసం_చరణా, మునిజనశరణా॥జయ॥

ఖరదూషణముఖా_సురసంహరణా_శరణాగత కపిభరణా॥ రామా॥

శరనిధిబంధన_సురరిపుభంజన_జగదభిరంజన రామా ॥జయ॥

గాలవుఁడు___కుశలవులారా ! మీరు వేయేండ్లు వర్ధిల్లవలయు !

లవు___అయ్యా! ఈయప్రస్తుతాశీర్వచన మెందుకు ?

గాల___అప్రస్తుతమేమి ? నేఁటి కైదు దినములనుండియు మీవర్షవర్ధన మహోత్సవములు జరుగుచున్నవికదా ?

కుశు___అవును. అయిన,

గాల___ఆసందర్భములోనివేకా యథేచ్ఛగా మాకీయనధ్యయన మహోత్సవములును !

కుశు___ఓహో, మీకందఱకు నధ్యయన భంగము గలిగించితిమనియా మాకీబహూకరణము.

గాల___మాకధ్యయనభంగ మిప్పుడు క్రొత్తగా సంభవించినదేమున్నది? ఏనాఁడు మాకు మీసహాధ్యాయిత్వము లభించినదో యానాఁడే.

కుశ—ఏమయ్యా ప్రేమము మీకు సహాధ్యాయులమై యుండుటకైనం బనికిరామా ?

గాల—ఆఁ పనికిరాని మాటే నిజము.

లవ—ఏమీ ! మేమంత విద్యాసక్తిలేని మూర్ఖులమా ?

గాల—కారు కావుననే మీకును మాకును సహాధ్యాయిత్వము కుదిరినది కాదు. పాఠ ముపాధ్యాయులనోట నుండఁగనే గ్రంథమంతయు మీహృదయ ఫలకముల నుండును. మృణ్మయపాత్రలవంటి మా మొద్దు తలకాయలకు, మీకున్న ఝటితిగ్రహణశక్తి లేకపోవుటచే బడిలోఁ బ్రవేశించునాఁ డేస్థితిలో నున్నదో నేఁటివరకాస్థితిలోనే యెదుగు బొదుగు లేకుండఁ గనుబొమ్మలమీఁది వెండ్రుకలవలె మాచదువో కేతీరుగ సాగుచున్నది. విద్యాబుద్ధులలో మా కీడు జోడుగానుండు సహాధ్యాయులతోఁ జేరి వేరొక యుపాధ్యాయుని నాశ్రయింతమా యని యనుకొందుము కాని, మీస్నేహపాశముచేఁ గదలమెదల లేక యిక్కడనే కట్టఁబడినట్లున్నాము.

కుశ—అయ్యా! గాలవా! మీస్నేహధర్మము మెచ్చఁదగియున్నది. కాని తెలియక యడుగుచున్నాను. వెనుకటి పాఠము లేమైన స్మరణలో నున్నవా ?

గాల—మిత్రుఁడా ? వెఱ్ఱివాఁడవుగదా ? వెనుకటివి వెనుకకుఁబడియుండక ముందునకుఁబడునా ?

కుశ—ఏమీ ! అప్పుడప్పుడు వెనుకటివి చింతించుచుండవా ?

గాల—మొదటనే తెలివితేఁట లుండవలయునుగాని, వెనుక చింతించుట వెఱ్ఱితనము కాదా ?

లవ—వివేకవంతుఁడవు పోనీ ఈమధ్యఁ జదివిన ఇంద్రజిత్తు యుద్ధఘట్టములోని శ్లోకములైన జ్ఞాపకమున్నవా ?

గాల—నాయనా ! ఈ యుద్ధకాండ మేవేళఁ బ్రారంభించితిమో కాని కంటి కింత హాయిగా నిద్దురపోయియెఱుఁగనుగదా ?

లవు—అంతదీక్షగఁ జదువుచున్నావా ?

గాల—చదువు లేదు చట్టుబండలు లేదు; కన్ను మోడ్చుటయే తడవుగా, లంకలోని దిక్కుమాలిన రక్కసిముండకొడుకులందఱు, నానా వికృతాకారములతో నాకు సాక్షాత్కారమగుచున్నా రిదేమికర్మము. అయ్యో! అయ్యో! ఆ వ్యాఘ్రాననాలేమి! ఆ మార్జారనేత్రాలేమి! ఆ లొట్టిపిట్టపీఁపులేమి! ఆ బారముక్కులేమి! ఆ పారపండ్లేమి! ఆ చీరపేల జుంజురువెండ్రుకలేమి! ఆ నవ్వులేమి! ఆ కేకిసలేమి! ఆ యట్టహాసాలేమి! హుమ్మనువాఁడొకఁడు హామ్మనువాఁడొకఁడు హుష్షనువాఁడొకఁడు హాష్షనువాఁడొకఁడు బాబూ అనరాదుగాని రామాయణయుద్ధకాండపారాయణమునకు ఫలముగా నన్ను బ్రహ్మరాక్షసపిశాచములుపట్టి వేధించునేమోయని లో లోపల నడలిచచ్చుచున్నాను.

కుశ—గాలవా! ఇదియే వాల్మీకిమహానుభావుల కవిత్వములోనున్న రహస్యము.

గాల—ఏది! బ్రహ్మరాక్షసపిశాచసాక్షాత్కారమా ?

కుశు—కాదోయి, వర్ణనాంశములనెల్లఁ జదువరులకు సాక్షాత్కరింపఁ జేయుటయే.

గాల—అదియా? ఆలాగైన నాతోఁబాటీగొడవ మీకును సంభవించిన దన్నమాటే.

లవు—అయ్యో! గొడవ యేమిటి, రసపారవశ్యము, తన్మయత్వమన నిదియే కదా, చెప్పుము. రాక్షసులతోఁబాటు సుగ్రీవాది వానరపుంగవులు నీకుఁ గన్పించుట లేదా ?

గాల—నాయనా! చాలు. ఇక్కడికి రక్కసిమూఁకతోడనే చచ్చుచున్నాను పైపెచ్చు కోఁతిమూఁకగూడ నెందులకు? నిద్దురలో వానరదర్శనముకంటె మృత్యుదర్శనము మేలన్నారు. మీపున్నమున నాకింకను ఆ యోగముపట్టలేదు.

కుశు—పోనీ సీతా రామలక్ష్మణులు కనిపించుచున్నారా?

గాల—లేదు, అబద్ధమెందులకు. పాపము వారెవ్వరు నాజోలికి రాలేదు.

లవు—అనఁగా వారిని నీవు చూడనేలేదన్నమాట

గాల—చూచుటకు వారు నాకడకు వచ్చినారా?

కుశు—పోనీ నీవైన వారి సన్నిధానమునకుఁ బోలేదా?

గాల—పోవుటకు దగ్గఱా దాపా?

కుశు—గాలవా! అడుగునకు దూరముగాని యంతఃకరణమున కేమి దూరము?

గాల—అదేమో నాయంతఃకరణ మంతవరకుఁ బోలేదు సుమా.

లవు—ఇదేమి గాలవా! లంకవరకుఁబోయి రాక్షసుల నందఱింజూడఁగల్గిన నీయంతఃకరణము రాముని జూడక పోవుట యేమి?

గాల—రాముఁ డయోధ్యలోఁగదా యుండునది.

లవు—ఇప్పుడు మనము చదువుచున్నది యుద్ధకాండము కాదా?

గాల—అవునుసుమా అదియు మఱచితిని. ఇప్పుడు లంకలోనే యుండును. కాని, చూడలేదు.

లవు—ఎందుచేత?

గాల—మీప్రశ్నములకుఁ బ్రత్యుత్తరములీయలేక చచ్చుచున్నాను. ఇంతమాత్రి మూహింపలేకున్నావు! నీతెలివి యింతలోఁ దెల్ల వాఱినది. రాక్షసుల వికృతాకారములు రామునకున్నవా?

కుశు—ఓహో! వికృతాకారులగు రాక్షసులఁగాని యన్యులంజూడనని దీక్ష పట్టితివా యేమి?

గాల—ఎందులకువచ్చిన దీక్షయది; పుణ్యమా పురుషార్థమా? నేను వారినిజూడ లేదు. వారే నన్నుఁ జూచుచున్నారు; వెక్కిరించుచున్నారు, వెఱపించుచున్నారు, నవ్వుచున్నారు, పేలుచున్నారు, సోలుచున్నారు, తూలుచున్నారు, తిట్టుచున్నారు, మొట్టుచున్నారు వారి శ్రాద్ధాలేమో పెట్టుకొనుచున్నారు.

లవు—అదియా? గాలవా! నీ పిఱికితనము యుద్ధకాండపఠనమునకు
బాగుగా నక్కఱకువచ్చినదిసుమా?

గాల—ఎట్లు?

లవు—యుద్ధవర్ణనమంతయు యథాక్రమముగా నీకుఁ బ్రత్యక్షము చేసినది.

గాల—మీకుమాత్రము ప్రత్యక్షము కాలేదా?

కుశు—కాకేమి?

గాల—ఆలాగైన నాతోఁబాటు మీరుగూడ నేల పిఱికివారు కాకుందురు?

కుశు—మేము నీవలె భయపడుచుండలేదు. యుద్ధకాండపఠనముచే మా
కెంతరణోత్సాహము కలుగుచున్నదో నీ వెఱుంగవు, విను,

మ॥ శరసంధానవిధానమం దితఁడు సా ♦ టౌదార్యుఁ డేయంచు వా
నరయోధాగ్రణు లుగ్గడింపఁ, బ్రళయాం ♦ తకౄరసంరంభ దు
ర్భరకాలానల రుద్రభంగి, విశిఖ ♦ జ్వాలావళిన్ బంక్తికం
ధరుసేనాటవిఁ గాల్ప నాభుజము లు ♦ త్సాహంబునం బొంగెడిన్॥

లవు—గాలవా! ఇఁక నాయుత్సాహమునకు మేరయే లేదు.

శా॥ పంకేజప్రభవాండభాండముఁ బగు ♦ ల్పంజాలు దీవ్యద్ధను
ష్టాంకారం బెలయించుచున్ బటునిశా ♦ టశ్రేణిపైఁ బేర్చి త
త్కంకాళంబులు రక్తవాహినులవెం ♦ టన్ బార, వారాంనిధిన్
లంకాద్వీపము ముంతునా యనుసము ♦ ల్లాసంబునన్ బొంగెదన్॥

గాల—అయిపోయిన పెండ్లికి మేళమెందుకు? శాంతింపుఁడు.

లవు—ఏమైనది యుద్ధకాండ మింకను బూర్తి కాలేదుగా?

గాల—అవునుసుమా! అసలు గడుసుముండకొడుకు, కొఱుకరాని
కొయ్య, పదితలల శిఖండి యింకను నట్లేయున్నాఁడుగా!

కుశు—రేపో మాపో వానిపనియుఁ బూర్తి కాఁగలదు.

గాల—వాఁడుకడ తేఱినఁగాని నా ప్రాణమునకు హాయి లేదు. కాని,
ఆ దేవాంతకపుముండకొడుకును రాముఁడుమాత్రము సాధింపఁగలుగునా?

కుశు—గాలవా! రామాయణ మింతవరకుఁ జదివినను రామప్రతాపము నీకు బోధపడినట్లు లేదే; నీ కాసందేహ మెందులకు?

మ॥ హరకోదండవిఖండనక్షమము బా • హాదండ, ముగ్రక్షపా
చరసేనావనదావపావక ముదం • చచ్ఛౌర్య, మంభోనిధి
స్ఫురదాటోపవిభంగచంగము పటు • భూభ్రభంగ మా రాఘవే
శ్వరదుర్వారపటుప్రతాపగుణసం • పచ్ఛ్రీలలఁ దెల్పవా?

గాల—తెలుపుచునే యున్నవి కాని ముల్లోకముల ముప్పతిప్పలఁ బెట్టి మూఁడు చెఱువుల నీళ్ళు ద్రాగించిన ముండకొడుకు వాఁడు మాత్రము సామాన్యుఁడా,

లవు—సామాన్యుఁడైనచో శ్రీమద్రామాయణమూర్తి వీనికొఱకు రామమూర్తియై యవతరింపవలసినపని యేమున్నది?

గాల—సరియే కాని, ఈబ్రహ్మ కింతమతి లేకపోవుట యేమా యని యోజించుచున్నాను. అందఱికి నొక్కతల రెండుచేతులు మాత్రము సృష్టించి యీరక్కసచచ్చినవానికిఁ బదితలలు నిరువదిచేతులును సృష్టించినాఁ డేమిటికో?

కుశు—ఇది రాక్షససృష్టి కదా!

గాల—ఆమాట నే నొప్పుకోను. రాక్షసు లందఱికి నిట్లుండిన లోకము లన్నియు నీవరకే నిర్మూలములు కాకపోయినవా? పాములలో రెండుమూఁడుతలలశిఖండులఁ బుట్టించినట్లు రక్కసులలో నీపదితలలశిఖండిని బుట్టించినాఁడు. పరకాంతాపహరణపాపకర్మమునకు వీనికి రెండుచేతులు చాలవని యిరువదిచేతులను, బరమసాధువులైన దేవమానవతపోధనుల రక్తమాంసములఁ బీల్చుటకు నొక్కనోరు చాలదని కఱవుదీరునట్లు పదినోళ్ళను వీనికి సృష్టించినాఁడు. ఈ మొండికట్టె కొకనాఁడైన దగ్గుపడిసెము పట్టలేదు కాఁబోలు. పట్టినచోఁ బదిముక్కు లొక్కమాఱు టంగున బిగిసి, యూపిరియాడక యెన్నఁడో చచ్చియుండును. ఓరి! నీరూపము కాల! మిత్రుఁడా! బ్రహ్మసృష్టిలో నెన్నెన్ని చిత్రము లున్నవి!

కుశు—గాలవా! కవిబ్రహ్మసృష్టిలో నింతకుమించిన విచిత్రములు లేవా?

కుశు—గీ॥ బ్రహ్మసృష్టి ప్రపంచచి • త్రములు చిరము
నిలుచునవి కావు, కాల మ • న్నిటి హరించు;
ఇంతవర కెన్నిగలిగెనో, • యెన్నిమనెను,
యెన్నినశియించిపోయెనో • యెవని కెఱుక?

లవు—గీ॥ కవికి నొక్కనికే వీని • గాథ యెఱుక
ప్రళయమందినసర్వప్ర • పంచములను
భావసంజీవిచే నిట్టె • బ్రతుకఁ జేసి
యక్షరాకారములఁ తోడ • నతఁడు నడుపు॥

కుశు—గీ॥ కవి విలోకింపలేని లో • కంబు లేదు
దూర మిది, దాపిది, యటన్న • మేర లేదు
సుగమ మిది, దుర్గమ మిదన్న • చోటు లేదు
భువనచయమెల్ల నతనిచూ • పునను మెలఁగు.

లవు—గీ॥ భూతపూర్వంబుల, నభూత • పూర్వములుగ
నలిపి, యెప్పటికప్పు డా • క్షణమునందు
జరుగుచున్నవిగానె వి • శ్వంబులెల్లఁ
గలము పోఁటున నాడింపఁ • గలఁడు సుకవి

కుశు—గీ॥ లోకములు కావ్యరంగంబు • లోని తెరలు
వానిలోఁ జన్నవారున్న • వారు గలిసి
యాడుదురు, పాడుదురు, తగ • వాడుకొందు,
రిట్టి నవ్వుదా, రేడ్తు రే • మేమొ గతుల.

లవు—మిత్రులారా! ఇట్టివికదా కవిబ్రహ్మసృష్టిలోని విచిత్రములు. వాగ్బ్రహ్మమునం బ్రబుద్ధులైన వాల్మీకిభగవానుల రామాయణేతిహాసప్రపంచమున మన మిప్పుడు సంచరించుచున్నాము. ఆయా పాత్రల యవస్థాభేదముల ననుభవించుచున్నాము. ఆమహానుభావుని యనుగ్రహముచేఁగదా రామాయణవిషయములన్నియు మనకుఁ బ్రత్యక్షానుభవములోనికి వచ్చుచున్నవి, చూడుఁడు,

సీ॥ కనులారఁ జూచుటే ♦ కాదు రాముని పెండ్లి
మించుటలోగిర మూర ♦ గించినాము
గురుభక్తి రాముపై ♦ గుదురుటే కాదు పే
రడవిఁ దోడై వెంట ♦ నడచినాము
పంపాసరస్స్నార ♦ భము లానుటే కాదు
హృదయంబు గరఁగి బి ♦ ట్టేడ్చినాము
కపులతోఁ జెలిమిమై ♦ కలసియాడుటె కాదు
రాల్మోచి సేతు వే ♦ ర్పఱచినాము
గీ॥ కడలి లంఘించి, లంకలో ♦ నడచినాము
రక్కసులఁగాంచినాము పో ♦ రాడినాము
రణమునకువచ్చు నేఁడెల్లి ♦ రావణుండు
నవ్వఁగలమింక వాని యం ♦ తమును గాంచి.

వటువు ప్ర—మిత్రులారా! నేఁట రేపట వానికథ తుదముట్టును. మనయాత్ర శ్రమమున కెవరో పెద్దలు దయచేసినారఁట. అందువలన రేపు మనకు శిష్టానధ్యయనదినమని గురువు లాదేశించినారు.

గాల—అట్లయిన వానిచావున కింకను రెండుదినము లభ్యంతర మున్నది. ఈలోపున వాఁడు నాకంటఁబడకున్న బాగుండును. మిత్రులారా! నన్ను మాయింటిదాఁకఁ బంపి పొండు; త్రోవలో వాఁడు నాకెదురైనచోఁ గెక్కురుమందును.

లవు—పోదమురమ్ము మేము నీకడనుండఁగా నీకేమిభయము?

కుశు—తమ్ముఁడా! నీవుకూడ నెందులకు? నే నితనిఁ బంపివత్తును. ఇంతలో నుపాధ్యాయు లేపనికైనఁ బిలుతురేమో నీవుపొమ్ము.

(కొందఱువటువులతోఁ గుశుఁడు నిష్క్రమించును.)

లవు—మనము రామకీర్తనఁబాడుకొనుచుఁ బోదము.

(వెనుకటిపాట పాడుచుండఁగా)

(జనకుఁడు, కంచుకి, యరుంధతి, కౌసల్య ప్రవేశించుచున్నారు)

జన—ఓహో! నేఁడు శిష్టానధ్యయనము కాఁబోలు. అందువలన వటువు లందఱు యథేచ్ఛగా నాడుకొనుచున్నారు.

కౌస-బాల్యమేకదా సౌఖ్యమున కాస్పదము. (నిరూపించి) అహాహా! వీరినడుమనున్న యీబాలుఁ డెవ్వఁడో, ఉదారముగ్ధలలితము లైన యవయవములతో మారామభద్రుని పసితనంపు లీలలఁ దలపించుచు నాకన్నులఁ జల్ల జేయుచున్నాఁడు.

అరు—(తనలో) ఇదియేకదా వాల్మీకిచెప్పినరహస్యకర్ణామృతము. కాని యాయుష్మంతులగు కుశలవులలో సీతఁ డెవ్వఁడో?

జన—అహాహా! ఎవ్వఁడీబాలకుఁడు!

సీ॥ కలువఱేకులకాంతిఁ • జిలుకు నున్నదనంపు
మెఱుఁగుఁజామనచాయ • మేనివాఁడు
అలినీలపు నిగన్ని • గల పిల్లసిగతోడ
ముద్దారు చిన్నారి • మోమువాఁడు
చలువవెన్నెలల జా • బిలివోలె వటువులలోఁ
బున్నెంపుసిరి నించు • చున్నవాఁడు
చిఱుతప్రాయంబుదె • మరల నారఘురాముఁ
డని నిరూపింప వీ • లైనవాఁడు
గీ॥ బాలకుం డీతఁ డెవ్వరి • వాఁడొ కాని
కూర్మిసుత సీతమోము గ • న్గొనెడు భాగ్య
మునకు వాచిన నానేత్ర • ములకుఁ జూడ
హాయిమన నించె నిట్టి సు • ధాంజనంబు.

కంచు—ఈబాలకుఁడు క్షత్రియ బ్రహ్మచారియని నానమ్మకము.

జన—సందేహ మెందులకు?

సీ॥ వీఁపునం దిరువంక • వెలయుఁ గ్రొమ్ముడి దాఁగు
కంకపత్రికదంబ • కములదొనలు
ఉరమునం దొప్పారు • రురుచర్మ చేలంబు
భసితపుంజపరాగ • పావనంబు
కటిసీమఁ జెన్నారుఁ • గావిమాంజిష్ఠంబు
లలితమౌర్వీమేఖ • లాయుతంబు

కరసరోరుహమందు • మెఱుఁగారుఁ గార్ముక
ప్లక్షుదండము, లక్ష • వలయకంబు
గీ॥ అర్హచిహ్నంబు లివియెల్ల • నట్టులుండ
ధీర లలితప్రసన్నగం • భీరమైన
అల్లమూ పొక్కటే చాల • దా యితఁడు
క్షత్రియబ్రహ్మచారి ని • క్కమని తెలుప ?

ఆర్యా గృష్టీ ! నాకుఁ గడు వేడుక యగుచున్నది. నీవుపోయి వాల్మీకిభగవానుల నడిగిరమ్ము. మూఁడు, ఆబాలకునితో ఈవృద్ధు లెవ్వరో నిన్నుఁ జూడఁ గోరుచున్నారనియుఁ జెప్పుము.

కంచు—చిత్తము. ఆలాగే చేసెదను. (నిష్క్రమించును.)

కౌస—ఇట్లుచెప్పిన వచ్చునా ?

అరుం—ఇటువంటి యాకారవిశేషమునకు మంచినడవడి లేకుండునా ?

కౌస—అహా! గృష్టివాక్యములు కడునక్షంకువతో నాలించి, వెంటనే తోడిబాలుర నెల్ల విడిచి యాతఁ డిటు మొగంబై రానేవచ్చుచున్నాఁడు.

లవు—(ప్రవేశించి తనలో) వీరందఱు పూజ్యులే, అయినను వీరినామ క్రమగోత్రంబు లెఱుంగకయే యెట్లు నమస్కరింపనగును ? (ఆలోచించి) కాని, ఈపద్ధతియు విరుద్ధముకాదని పెద్దలవలన విన్నాఁడను. (వినయముతో సహిూపించి) ఈలవుఁడు మీకందఱకు సాష్టాంగ ప్రణామ మాచరించుచున్నాఁడు.

అరుంధతి—
జనక—
} కల్యాణిన్ ఆయుష్మాన్ భూయాః !

కౌస—బిడ్డా! చిరకాలము వర్ధిల్లుము !

అరుం—ఇటురా నాయనా ! (అని లవునితొడపైఁ గూర్చుండఁబెట్టుకొని తనలో) ఆహా ! ఒడిమాత్రమేకాదు ; చిరకాలమునకు నామనోరథముగూడ నిండినది.

కౌస—బిడ్డా! ఇటుగూడఁ గొంచెమురమ్ము. (ఒడిలోఁ జేర్చికొని) అహా! నవనీలోత్పలమువలె శ్యామలోజ్జ్వలమైన దేహబంధముచేత నేగాక

కమలకేసరగ్రాసముచే మధురకంఠమగు రాయంచయెలుంగువలె ఖంగున మ్రోయు గంభీరస్వరముచేతఁగూడ వీఁడు రామభద్రునినోటిలోనుండి యూడిపడినట్లున్నాఁడు. తామరకోశమువలెఁ బరిపేశలమైన తనుస్పర్శముగూడ నట్లేయున్నది. నాయనా! ఏది నీముఖచంద్రు నొక్కమాఱుచూడనిమ్ము (అని చుబుకము నెత్తిచూచి కన్నీటితో సాభిప్రాయముగా) రాజర్షీ! కనిపెట్టితివా? చక్కఁగఁ బరికించినచో వీని ముద్దుమోమునందు విస్పష్టముగఁ గోడలిమోము చందురుని జాడలును జూపట్టుటలేదా?

జన--చూచుచున్నాను సఖీ! చూచుచున్నాను.

కౌస--అమ్మో! పిచ్చియెత్తినదానివలె నామనస్సేమేమో తలపోఁతలతోఁ బలుపోకలఁబోవుచున్నదే.

జన--ఆహా! ఇంకను సందేహమెందులకు?

మ॥ ప్రతిభావంబు సమగ్రి ముట్టిపడుతే • నట్ జానకీరాఘవుల్
ప్రతిబింబించిరొ వీనిలోపల; సుహృ • చ్ఛ్రీలవే, వాకదే,
గతి తేజోవినయంబులా యవె, నిస • ర్గప్రాభవంబే నదే
మతి యేమో యడియాసలన్ బఱుపఁగం • బర్వెత్తు హా దైవమా!

కౌస--అబ్బాయీ! నీకుఁ దల్లియున్నదా? నీతండ్రిం దలంచుకొనుచుందువా?

లవు--లేదు.

కౌస--అట్లైన నీ వెవ్వరివాఁడవు?

లవు--వాల్మీకిభగవానునివాఁడను.

కౌస--ఓయీ! అడిగినది విస్పష్టముగఁ జెప్పుము.

లవు--నాకింతవరకే యెఱుక.

(తెరలోపల) ఓహో సైనికులారా! ఇదిగో కుమారచంద్రకేతుఁడాజ్ఞాపించుచున్నాఁడు. "ఎవ్వఁడును ఆశ్రమ ప్రాంతప్రదేశముల నాక్రమింపఁగూడదు" అని.

అరుం--ఓహో! యాగాశ్వరక్షాప్రసక్తిచే నిచ్చటికివచ్చు కుమారుఁ జంద్రకేతునిగూడఁ జూడఁగలము. ఆహా ఇదేసుదినము.

కౌస--ఆహా! వత్సలక్ష్మణుని పుత్రకుఁ డాజ్ఞాపించుచున్నాఁడను నమృత బిందుసుందరములగు నక్షరములు వినఁబడుచున్నవి.

లవు--ఆర్యా! ఈచంద్రకేతుఁడెవరు ?

జన--దశరథకుమారుల రామలక్ష్మణుల నెఱుంగుదువా ?

లవు--ఎఱుంగ కేమి? రామాయణకథాపురుషులు వారేకదా!

జన--అవును. ఆలాగైన నిది యేలయెఱుంగవు? ఆలక్ష్మణునికుమారుఁడే యీచంద్రకేతువు.

లవు--అట్లయిన నూర్మిళాదేవికిఁ బుత్రుఁడు... రాజర్షియగు మిథిలానాథునికి దౌహిత్రుఁడు.

అరుం--(నవ్వుచు) కుమారుఁడు కథాప్రావీణ్యమును బ్రకటించినాఁడు.

జన--బాలకా! ఆకథయందు నీకింతటిప్రావీణ్య మున్నదికదా ఏదీ ఆ దశరథకుమారుల కేయేభార్యలయం దేయేపేరుల యపత్యములు పుట్టిరో చెప్పుము చూతము.

లవు--ఈకథాభాగము మేముగాని యన్యులుగానియెన్నఁడు విన్నది కాదు.

జన--అదియేమి! కవి రచియింపనేలేదా?

లవు--రచియించినారు. కాని ప్రకటింప లేదు. దానిలోని యొకకథా భాగమును రసవత్తరమగు నాటకముగాఁ గూడ రచించిరి. ఆ గ్రంథమును స్వహస్తముతో లిఖించి తౌర్యత్రికసూత్రధారియగు భరతాచార్యులకుఁబంపినారు.

జన--ఎందులకు ?

లవు--ఆమహానుభావుఁ డప్సరస్త్రీలచే దాని నాడించునని,

జన--ఇదియంతయు నేదో గూఢార్థముగనున్నది.

లవు--ఆగ్రంథముపై వాల్మీకిభగవానుల కెంతయో యభిమానము. అందుకొఱకే యంతేవాసులచే దానిని భరతాశ్రమమునకుఁ బంపు నపుడు త్రోవలో నేప్రమాదముగలుగకుండఁ ధనుర్ధరుని నాసహో దరునిగూడఁ బాసటగాఁ బంపియుండిరి.

కౌస--నీకుసహోదరుఁడుగూడఁ గలఁడా?

లవు—ఆఁ కలఁడు. కుశుఁడని ఆర్యునిపేరు

కౌస—అనఁగా నీకు జ్యేష్ఠుఁడన్నమాట.

లవు—అవును, ప్రసవానుక్రమంబున నాతఁడే పెద్దవాఁడు.

జన—ఎట్లూ! ఆయుష్మంతులు మీరు కవలపిల్లలా యేమి?

లవు—అవును.

జన—బాలకా! చెప్పవు ప్రకటితమగు కథాప్రపంచ మెంతవరకు వచ్చినది?

లవు—పౌరజానపదుల మిథ్యాప్రవాదమునకు వెఱచినరాజుచే వెడలఁ గొట్టఁబడిన ఆసన్నప్రసవవేదనయగు సీతామహాదేవిని లక్ష్మణుఁ డేకాకినిగాఁ గీకారణ్యమున విడిచి

కౌస—అయ్యో బిడ్డా! ఏకాకినివై యల్లాడు నీశరీరపుష్పమున కేదైవ దుర్విపాకము సంభవించెనోకదా!

జన—హావత్సా! సీతా!, ఏమైపోఁయితివి

మ॥ అనిమిత్తంబగునిందచే నడవిపా • లై, సాయముం జేయ నా
యనువా రెవ్వరులేక, కాన్పుసమయం • బై, నొప్పులం దూలుచో
మును వెన్క న్గహనోగ్రజంతునివహం • బుల్ మూఁగి కాఱాడ 'నో
జనకా! నాగతిఁజూడవే' యనుచు వ • త్సా! యెంత వాపోయితో.

లవు—(అరుంధతింగూర్చి) అమ్మా! వీరెవరు?

అరుం—ఈమె కౌసల్య; ఈయన జనకుఁడు.

లవు—(బహుమానఖేదకౌతుకములతోఁ జూచును)

జన—ఔరా! దురాత్ములగు నీపౌరుల నేమనవలయు? ఈరామరాజు వేగిరపాటున కేమనవలయు!

మ॥ పరిభావంబిది ఘోరవజ్రహతియై • బాధింపఁ గ్రోధాగ్నికిన్
దరుణం బైనది చాపశాపముల చే • తన్ భగ్గునన్ మండఁగా......

కౌస—భగవతీ! రక్షింపుము రక్షింపుము, కుపితుఁడైన యీరాజర్షిని ప్రసన్నుం జేయుము.

అరుం—అవును పరాభూతులైన మానవంతుల కింతకంటెఁ బ్రాయశ్చిత్తములేదు, కాని రాజర్షీ!

అరయఁ రాముఁడు నీకుఁ బుత్రవిషయంబా పౌరసంతాన మా
దరణీయద్విజబాలవృద్ధ వికలస్త్రీణంబిఁకఁ సైఁపనా॥

వటువులు—(సంభ్రమమునఁ బ్రవేశించి) కుమారా! “అశ్వము అశ్వము” అని యొకానొక భూతవిశేషము జనపదములయందుండునని విందుమే దానిమేమిప్పుడు ప్రత్యక్షముగాఁ జూచినాము.

లవు—అశ్వమని, పశుశాస్త్రమందే కాక సాంగ్రామికశాస్త్రమునఁ గూడఁ జదివితిమి. ఇఁక దానిస్వరూపమెట్లున్నదో చెప్పుఁడు

౧ వటుఁడు—చెప్పనా? దానికి వెనుకభాగమున నొక జల్లితోఁకయున్నది.

౨ ,, కుమారా అది దానినెల్లప్పుడాడించుచుండును.

౩ ,, మెడ చాల నిడుపుగానున్నది.

౪ ,, మనయాశ్రమ కురంగములకెట్లో దానికినిగిట్టలు నాలుగే.

౧ ,, అదియు గరికెపరకలే మేయును.

౨ ,, కాని యది మామిడికాయలంతపాటి శకృత్పిండకముల వేయును

౩ ,, కుమారా! ఈవ్యాఖ్యానములతో నదియీపాటికిఁ జాలదూరము పోయియుండును రమ్మురమ్ము పోదము (అని భర్మోత్తరీయముంబట్టిలాగుచున్నాఁడు.)

లవు—(కౌతుకోపరోధవినయములతో) పూజ్యులారా, చూడుఁడు చూడుఁడు, వీరునన్నులాగికొనిపోవుచున్నారు. (అనివడిగఁబరిక్రమించును.)

కౌస—భగవతీ! వీనిం జూడకున్న నే బ్రతుకునట్లులేదు. ఆవైపున శీఘ్ర పరువెత్తుచున్న కుఱ్ఱవానిం జూతము రండు.

అరుం—ఎట్లు చూడఁగలము అప్పుడే వాఁడు వేడుకనై కడుదూరము బరువెత్తినాఁడు.

గృష్టి—(ప్రవేశించి) వాల్మీకిభగవానులు సెలవిచ్చినారు “ఈవిషయము తగు సమయమున మీకే తెలియఁగలదు” అని.

జన—ఇది ఘోషేదియో? యతిగంభీరముగనున్నది. భగవతీ, అరుంధతీ! సఖి కౌసల్యా! రండు మనమే స్వయముగ వాల్మీకిం దర్శింతము.

(వృద్ధజనము నిష్క్రమించును.)

వటు—కుమారా! ఆ చిత్రముం జూడుము.

లవు—చూచితిని గ్రహించితిని నిజముగా నిది యశ్వమేధహయము.

వటు—ఎట్లు గ్రహించితివి?

లవు—ఓయీ మూర్ఖులారా! ఆకాండము మీరును పఠించినదేకదా. ప్రత్యేకము నూర్గురు కవచధరులు, దండధరులు తూణీరధరులు నగు రక్షకులున్నారే వీరకిందగిన బలముగూడ వెనుక ముందు నడచుచున్నదే కనబడుటలేదా? నామాటనమ్మకున్న పోయివారినే అడుగుడు.

వటు—ఓహో ఎవరయ్యా; ఈ గుఱ్ఱమును దండుతో నూరేగించుచున్నా రెందులకు?

లవు—(ఆసతోఁదనలో) అవునుసుమా! అశ్వమేధమనఁగా జగజ్జేతలగు క్షత్రియుల సోత్కర్షను బ్రకటించునదికదా, ఇతర క్షత్రియుల నందఱిఁ బరాభవించునదికదా, పరితాపమును బరీక్షించు నొరపిడి రాయికదా యిది.

(నేపథ్యమున)

గీ. అశ్వమియ్యది సప్తలోకైకవీర
సార్వభౌముని రాముని జయపతాక
దశముఖునిశాటకులనిషూదను గభీర
వీరఘోషణ మియ్యది విశ్వమునకు

లవు—(వ్యథతో) అహో! ఆత్మను రగిలించుచున్నవిగదా! యీ యక్షరములు.

వటు—ఔరా! ఏమనుచున్నారు, కాని, కుమారా! నీకుఁదెలియనిదే మున్నది.

లవు—ఓహో! మీరింతగఁజాటించుచున్నారే పృథివిలో మఱి క్షత్రియులే లేరాయేమి ?

(నేపథ్యమున) అరే! మహారాజుముందు మఱి క్షత్రియు లెవరురా?

లవు—ఛీ జాల్ములారా!

గీ॥ ఉందురో లేరొయట్టివారుండనిండు ఈపటాటోపమంతయు నేలమీకు
వెఱతురే వీరలింత నేవేయు నేల కాచికొనుఁడిదెమీపతాకనుహరింతు

ఓహో! వటువులారా! అడ్డముగబోయి మట్టిబెడ్డలతోఁగొట్టి ఈ గుఱ్ఱమును మరలింపుఁడు ఇది మనరోహితమృగములలో దిక్కుమాలి, సంచరించుచుండుఁగాక

పురుషుఁడు—(క్రోధదర్పములతోఁ బ్రవేశించి) ఛీ, ఏమిరాయీయుల్లరి ఆఁ! ఏమన్నావు, చూడుమటు మహాగుఱ్ఱలగు నాయుధీయులసంఖ్యాకులున్నారు వీరికి దాక్షిణ్యమనునది లేదు పిల్లవాఁడన్నను గర్వాలాపము లెంతమాత్రము సైరింపరు. అరివిమర్దనుఁడగు మారాజపుత్రుఁడీ ప్రాచ్యారణ్యముం జూడఁబోయినాఁడు ఆతఁడు తిరిగిరాకమున్నే యీ చెట్లచాటునంబడి పాఱిపొండు.

వటు—కుమారా! ఆలాగైన ఈ గుఱ్ఱముజోలిమనకేల భటులసముదాయములేమో విచ్చుకత్తులంజళిపించుచు, నిన్ను బెదరించుచున్నారు. ఆశ్రమమేమో యిక్కడికిఁ జాలదూరమున్నది. రమ్ము లేడిగెంతులతోఁ బాఱిపోదము.

లవు— (నవ్వుచు) ఏమీ విచ్చుఁగత్తులజడిపింతురుగా కానీ చూతము. (ధనురారోపణముచేయుచు నిష్క్రమించును) అందఱుబరుగెత్తెదరు.

ఇది షష్ఠాంకము.

శ్రీరామచంద్రపరబ్రహ్మణేనమః

ఉత్తరరాఘవము

సప్తమాంకము.

(నేపథ్యమున)

ఓహో ! సైనికులారా ! మనకాధారమిదిగో దొరకినది. చూడుండు,

చ॥ సమరమునాలకించి, కనుసైఁగ సుమంత్రుఁడు వేగవత్తురం
గముల నదల్ప, మేటివలుకాటపు బాటలదాటుచో, శతాం
గముపయి కోవిదార తరుకాండపతాకము సంచలింప, రా
కొమరుఁడు చంద్రకేతుఁడిదిగో, చనుదెంచె, భయంబులేదిఁకన్॥

(పిమ్మట సుమంత్రుఁడు తోలుచున్న రథముపై, చంద్రకేతుఁడు ధనుష్పాణియై ప్రవేశించుచున్నాఁడు.)

చంద్ర— ఆర్యా ! సుమంత్రా ! పరికింపుము,

శా॥ కించిత్కోపముతో ముఖాంబుజరుచుల్ కెంపారఁ, గర్ణాంచల
ప్రాంచచ్చాపశిఖా నిరంతరరటజ్జ్యాఘోషతో, సర్వతః
సంచారంబున, సేనపై, శితశరాసారంబు వర్షించుచున్
పంచాస్యంబనమించు పంచశిఖుఁ డీబాలుండెవండోకదా ?

అహో ! ఈవీరకిశోర మెవ్వారికిం దెలియరాకుండనుండిన మా రఘువంశీయ నూతనాంకురమా అనునట్లు పసివాఁడయ్యు నసహాయ శూరుఁడై, యింతటిసేనాసముద్రమధ్యమున నేవంకఁజూచినను, దానయై, గంధసింధుర కపోలగ్రంథిటాంకారఘోరముగ శరవర్షముం గురియుచున్నాఁడు. ఆహా ! ఈతని వీరవిహారము మహాద్భుతముగనున్నది. ఆర్యా, చూచుచుంటివా ?

సుమం— ఆయుష్మంతుఁడా ! ఇంకఁజెప్పెడిదేమి ?

గీ॥ ఎఱుఁగము సురాసురులకేని యీప్రభావ
మీడుజోడీతఁడే నీకు, నితనిఁగాంచి

కౌశికాధ్వరవైరి శితుణముకొాఱకు
ధనువుదాల్చిన రఘునందనుని స్మరింతు॥

చంద్ర—ఆర్యా! చూడు, ఏకాకియగు వీనికై యనేకులింతగాఁ బెనంగు చుండుటఁ జూడ నాకు సిగ్గుగానున్నదిసుమా.

సుమం—కుమారా! వీరందఱేకమై డీకొన్నప్పుడే యిట్లున్నది. ఇంక నొక్కరొక్కరుగానైనఁ జెప్పవలసినదేమి?

చంద్ర--ఆర్యా! త్వరపడుము, త్వరపడుము. ఈతఁడు మనపరిజనంబుల నూరక నుఱుమాడుచున్నాఁడు,

శా॥ భేరీభాంకృతఘూర్ణమాన నిజమౌర్వీటాంకృతిన్ జేసి, కాం
తారేభంబులు, కర్ణముల్ వగిలి బాధన్, ఘీంకృతుల్ సేయ, నో
రారన్ భైరవుఁ డారగించి, విడు మృష్టాహార శేషంబునన్
బోరడెల్లెడు మొండెముల్ తలలు ప్రోవుల్ నించె వీఁడుద్ధతిన్॥

సుమం--(స్వగతము) అక్కటా! ఇట్టివానితోడి ద్వంద్వయుద్ధమునకుఁ గుఱ్ఱవానిం జంద్రకేతు నెట్లంపుదును. (ఆలోచించి) కాదని యూరకున్న నెట్లు! ఇక్ష్వాకు వంశ వృద్ధులముకదా మేము. సంగ్రామము తటస్థించినప్పుడు మఱి గత్యంతరమేమి?

చంద్ర--(ఆశ్చర్య లజ్జాసంభ్రమములతో) ఇస్సీ! నాసైన్యములు చెల్లా చెదరై నలువంకలంబడి పాఱిపోవుచున్నవే,

సుమం—(రథముగడిపి) ఆయుష్మంతుఁడా, అతఁడే యావీరుఁడు, మాట వినికిదూరమున నున్నాఁడు.

చంద్ర—ఆర్యా! ఈతని పేరేమన్నారు?

సుమం— "లవుఁడు" అనికదా.

చంద్ర—ఔను మఱచితి, (లవుని వైపునకుందిరిగి)

గీ॥ అవుర! మోాలవ, వీరాగ్రణివిగదోయి
ఈభటసమూహమన్న నీ కెంతపాటి
ఇదిగో, వచ్చితి నెదిరింపు మింకనన్ను
తేజముశమించుగావుత తేజమందె॥

సుమం—కుమారా! హెచ్చరిక, ఆబాలవీరుఁడు నీపిలుపాలకించిన వెంటనే యుద్ధమువిని యేనుంగులవేటచాలించి బరవసమున నెదిరించు పొగరుసింగపుఁబిల్లవలె మనవైపునకు వచ్చుచున్నాఁడు

(పిమ్మట సత్వరాటోపమున లవుఁడు ప్రవేశించును.)

లవు—బలే, రాజపుత్రా! బలేనిక్కముగ నీవైతేజస్వివే ఇదిగోవచ్చితి మాట చెల్లింపుము. (నేపథ్యమున సేనాకలకలమువిని) ఛీ, వెన్నిచ్చి విచ్చలవిడిగాఁ బారిపోయిన యీసేనానాయకులు మరలరణాంగమునఁ గూడికొని నన్నుజుట్టుముట్టుచున్నారు. తొలుత వీరి సంరంభ మణంతుఁగాక (సేనకై తిరిగి) అరే మూర్ఖులారా!

చం॥ నలుగడలంగడంగుచు ఘనంబుగ సంకులమైన మీచమూ
కలకలమెల్లనెక్కువడిగావుత నాహుతి నారుషాగ్నికిన్
ప్రళయరయప్రభంజన విభగ్నమహార్ణవవాః ప్రపూరము
జ్వలదచలాహతిక్షుభిత బాడవవహ్నిశిఖాళికిన్ బలెన్

(అని పరిక్రమించును)

చంద్ర—ఓహో, కుమారా!

ఉ॥ ముచ్చటయయ్యె నీసుగుణముల్పరికింపఁ బ్రియుండవందుచే
నెచ్చెలివైతి నాకు, నిఁక నీయది యేగద నాసమస్తముఞ్
మచ్చలు మేల నీపరిజనంబులపై నిఁక, నీపరాక్రముఞ్
మచ్చికయింతఁ జూచుకొనుమా నికషంబిదె చంద్రకేతువా॥

లవు—(హర్షసంభ్రమములతో మరలి) అహో, ప్రసన్న కర్కశంబగు నీతనివీరవచన ప్రయోగమెంత గంభీరముగా నున్నది. మహానుభావుఁడుగదా యీసూర్యవంశకుమారుఁడు ఇఁక, నీచిల్లరసైనికులతోనేమి! ఈతనినే గౌరవించెదఁ గాక (మరలఁ దెరలోఁగలకలము) ఛీ ఛీ! ఈపాపాత్ములు వీరసంవాదమునకు విఘ్నమాచరించుచున్నారు కానీ! వీరికోలాహలమంతయు నింతలో నణంగింతు (సైనికులపైకి మరలుచున్నాఁడు)

చంద్ర—ఆర్యా! సుమంత్రా! ఈవీరకిశోరుని విజృంభణము చూడుఁ.

సుమం--కుమారుఁడే యీనిందేఁజేయుటకైన సమర్థుఁడు, మేమో, కేవ
లము విభ్రాంతిలో మునింగియున్నాము.

చంద్ర--ఓహో రాజన్యులారా! చాలుఁజాలు మీప్రతాపములు.

మ॥ కవచాధారులు, వాజికుంజరశతాంగస్వైరసంచారు ల
గ్రవయస్సారులు, మీర, నేకులిటు లేకంబౌచు డీకొంటి, ర
న్నువలే మేని పదాతి నొక్కఁగనుగందుః మేధ్యచర్మోత్తరీ
యు, విచారింపుఁడు మీకు మాకు నిడియె గ్గోవన్న యోవాసియో॥

లవు--(వ్యథతో) ఏమీజాలిపడుచున్నాఁడుగా! (ఆలోచించి) కానీ, వృథాకాలక్షేపముగాకుండున్నట్లు జృంభకాస్త్రప్రయోగముతో నీ చమూసమూహముల మూర్ఛిల్లఁజేసెదఁగాక. (ధ్యానము నభినయించును.)

సుమం--అహో! ఏమిది, ఆకస్మికముగా సేనాకలకలంబాగిపోయినది.

లవు--ఈతని దర్పమేమో యిప్పుడుచూచెదను

సుమం--వత్సా! ఈక్షత్రవాఁడు జృంభకాస్త్రము ప్రయోగించినట్లున్నది

చంద్ర--అందులకు సందేహమేమి! లోకంబంధకారబంధురమై, మెఱుపుతీఁగల తళత్తళలచేఁ గన్నులు మిఱుమిట్లాడుచున్నవి. సైన్యమంతయుఁ జిత్తరుప్రవోలె నిశ్చేష్టితమైపోయినది. నిక్కముగ, నమోఘతేజమగు జృంభకాస్త్రము విజృంభించుచున్నది.

సుమం--అహో! ఈజృంభకాస్త్రము లీతనికెట్లు సంప్రాప్తించినవో?

చంద్ర--వాల్మీకి భగవానుఁడే యనుగ్రహించియుండును.

సుమం--కుమారా! ఆయన కస్త్రశిక్షావ్యవహారము లేదు. అందులో నీజృంభకములయం దసలే లేదు. ఇవి భృశాశ్వుని యపత్యములు. అతనినుండి విశ్వామిత్రునకును అందుండి మా రామభద్రునకును సంక్రమించి స్థిరములై యున్నవి. కాని, కుమారా! ప్రవీరుఁడు సమీపించు చున్నాఁడు హెచ్చరికసుమా,

లవు--చంద్ర--(బండారులంగూర్చి) అహహా ప్రియదర్శనుఁ డీకుమారుఁడు!

చ॥ కనుగొన్నంతనె నీనియందు, మది లగ్నంబయ్యె నద్వైతభా
వన! యాదృచ్ఛికమో, గుణాతిశయసౌభాగ్యంబొ, జన్మాంతరం
బునఁ జేకూరి, నిరూఢమై తగు చిరంపు న్మైత్రియో, యొక్కఁడొ
క్కనిసంబంధము దైవతంత్రిత నెఱుంగన్ రాని బాంధవ్యమో!

సుమం--ఒక్కొక్కరియం దొక్కొక్కరికి రసమయుంబగు ప్రీతి జనించుట ప్రాకృతికముగా ప్రాణిధర్మము. అనుభవజ్ఞానులు దీనినే తారామైత్రిమనియు, చక్షూరాగమనియు వ్యవహరింతురు. ఈప్రేమకుఁ దార్కాణము లేదు, కారణమంతకుమును పే లేదు. అయినను పెద్దలు దీనినిఁబ్రమాణముగ నంగీకరింతురు.

గీ॥ హేతువే లేని యీపక్షపాతమునకు
భంగమెప్పాటనైన సంభవముకాదు
స్నేహమయతంతు విద్దానిఁజెదరనీక
హృదయమర్మంబులను గదియించి కుట్టు॥

లవు--చంద్ర (బండారులంగూర్చి)

గీ॥ మెఱుఁగిడినజాతిరతనంపు టొరపులీను
వీనిమేను శరాళి కొప్పింతు నెట్లు
అమరు నేనిది కౌఁగిలింతమనుకోర్కి
హృదయముప్పొంగి మై పుల్కరించుచుండ॥

అయినను, పరాక్రమతేజస్వులగు శూరులతోడిఁ వీరవిహారమునకు శస్త్రమే గాక మఱిశరణ్యమేమున్నది. అందులో ఇటువంటివీరశరవ్యము దాకని శస్త్రమొకశస్త్రమా? అదియుంగాక శస్త్రధారియగు నీతనిం గని మోమోటమునయుద్ధమేటికని నేనే తొలంగుదునేని, నీతఁడే నన్నేమనఁగలఁడు. అహహా! కఠోరమగు వీరధర్మము స్నేహపరిపాటిని నిరోధించుఁగదా.

సుమం--(లవుని నిర్వర్ణించి కన్నీళ్లతోఁ దనలో) హృదయమా! ఏల నీకీ యడియాస,

గీ॥ అక్కట! మనోరథంబుల కాదిమూల
మేదొ దైవంబు దాని మున్నేహరించె

తెంపి మును పారవైచిన తీవ కింక
క్రొత్తవికి మొగ్గయేమి! చేకూరుటేమి !

చంద్ర—ఆర్యా ! సుమంత్రా! నేను రథము దిగియెదను.

సుమం—ఎందులకు ?

చంద్ర—ఈ వీరపురుషుని గౌరవించినట్లగును. క్షాత్రధర్మమును నిర్వహించినట్లగును, రథస్థులు పాదచారులతో యుద్ధముచేయరని శాస్త్రవేత్తలు వక్కాణింతురుగదా.

సుమం—(తనలో) అయ్యో, కష్టముసంభవించెనే నాకు! ఇప్పుడు ధర్మాచారమును దప్పింతునా? కుమారుని సాహసకృత్యమునకు సమ్మతింతునా?

చంద్ర—ఆర్యా! మానాయనగారు నయితము, ధర్మసంశయములను మీవలననే తీర్చుకొనుచుందురే మఱియీవిషయమున నింతయాలోచనమేమి?

సుమం—ఆయుష్మంతుఁడా! నీవు ధర్మాచార మతిక్రమింపలేదు. ఇదియే సనాతనమైన సాంగ్రామికధర్మము; మీరఘుసింహులనూచానముగ నడుపుచుండు వీరచారిత్రపద్ధతియే యిది.

లవు—ఆహా! ఉత్సాహము కలగఁజుపుగానున్నదే!

ఉ॥ పున్నమచందురుఁ గను కుముద్వతివోలె మదీయదృష్టి యీ
యన్నవవీరునందు ముదమందెడుఁగాని, ఝణత్క్రియాసను
ద్యన్నినదోరుదారుణ గుణాంకితకార్ముకమైన యీభుజం
బున్నదె, విస్ఫురద్రణరసానుభవంబునకే త్వరింపఁగన్॥

చంద్ర—(రథము దిగి) ఆర్యా! సుమంత్రా! సావిత్రుఁ డీచంద్రకేతుఁడు నమస్కరించుచున్నాఁడు.

సుమం—కుమారా! నీగురుపరంపర సంగ్రామమున నీకు శ్రేయంబు బ్రసాదించుఁగాత.

లవు—కుమారా! నీవు తెరియుండే మిగుల శోభించుచున్నావు, వలదు అత్యాదరము వలదు. రథ మెక్కుము.

చంద్రి—అలాగైన మహాభాగా! నీవును వేత్రాకరథ మలంకరింపుము.

లవు—ఆర్యా! సుమంత్రా! రాజపుత్రుని రథ మెక్కింపరాదా?

సుమం—నీవును చంద్రకేతువచన మనుసరింపరాదా?

లవు—ఎవరి యుపకరణము వా రుపయోగించుకొనుటయుం దభ్యంతర మేమున్నది? కాని మే మడవులలోఁ బెరిగినవారము, రథచర్య నెఱుంగము.

సుమం—వత్సా! గట్టివాఁడవోయి; దర్పసౌజన్యములకుఁ దగినట్లు మెలంగ నేర్తువు. ఇటువంటి నిన్ను మాన్యపాలుఁ డైక్ష్వాకుఁడు రామభద్రుఁడు తిలకించెనేని వాత్సల్యముచే నతనిహృదయము కఱఁగిపోవును గదా?

లవు—ఆర్యా! ఆరాజర్షి సజ్జనుండని ప్రసిద్ధి (లజ్జించుచున్నట్లు) మేమైనను,

శా॥ సత్రాలంబడఁగొట్టుపాటి యసదాచారంబు సైరింప మా
ధాత్రీనాథు నెవండు మెచ్చఁడు చరిత్రఖ్యాతుఁ? డౌఁగాక యి
ట్లత్రాసంబుగ నశ్వరక్షకులు సయ్యాటించు విశ్వంభర
క్షాత్రక్షేపకరప్రగల్భములఁ దేజశ్శాలి సైరించునే? ॥

చంద్రి—(చిఱునవ్వుతో) ఎట్లూ! తండ్రిగారి ప్రతాపోత్కర్షమునఁగూడ నీ కసహనమా!

లవు—అసహనముండని ఉండకపోని, ఒకమాట అడిగెదను చెప్పుము, ఆరాఘవేంద్రుఁడు దాంతుఁడని వినుచున్నాము. స్వయముగ నాయన గర్వితుఁడుగాఁడు. ఆయన ప్రజలయందును గర్వముచూపట్టదు, కాని ఆయనసేవకులిట్లు రాక్షసవాక్కులాడుచున్నారేమి?

గీ॥ మదవిగర్వితులాడు సంభాషణము నె
ఋషులు రాక్షసమని నిర్ణయించినారు;
ఎట్టివైరంబునకును నదే పునాది
పరమదౌర్భాగ్యమదియె ప్రపంచములకు ॥

ఈవిధముగా దానిని నిందించుచుఁ దదన్యమున నిట్లని యభినందిం చిరి వినుము,

గీ॥ కామితంబులనించు, నఘంబుఁ దుంచుఁ,
గీర్తి సంతానమును గాంచుఁ గీడడంచు
జగములభరించుఁ గల్యాణి సత్యవాణి
జ్ఞానులు వచించెదరు కామధేనువనుచు॥

సుమం—ఈకుమారుఁడు పుట్టువుచేతనే పరిశుద్ధస్వభావుఁడు. దానిపై వాల్మీకిభగవానునిశిక్ష. ఇఁక నార్షసమ్మతమైన వచనముల నుపన్యసించుటలో నాశ్చర్యమేమున్నది ?

లవు—చంద్రకేతూ ! "తండ్రిగారి పరితాపోత్కర్షయందుఁగూడ నీకస నానమా" అని పల్కితివే, చెప్పుము. క్షాత్రధర్మ మొక్కఁడిసోమాన్మా?

సుమం—బాలకా ! ఐక్ష్వాకుఁడైన దేవుని నెఱుంగవుగాని ఊరకో, అతి ప్రసంగము వలదు.

ఆ॥ వె॥ సైనికులను గెల్చి, చాటించినావు నీ
బిఱుదులానితనము సరియె కాని
పరశురాము భంగపఱచిన జగజెట్టి
పొగడ నిట్టు లట్టు లాడఁదగునె?॥

లవు—ఆర్యా, ఆరాజు భార్గవదమనుండని యేమో పెద్ద పొగడ్తగాఁ జాటించుచున్నారేమి ?

గీ॥ విప్రులకు వాణియుం దొప్పు విక్రమంబు
క్షత్రియుల కొప్పు నదియె భుజంబునందు
భార్గవుఁడు విప్రుఁడై శస్త్రపాణియయ్యె
నతని గెల్చిన తేని కేమంతగొప్ప ! ॥

చంద్ర—ఆర్యా ! అతిప్రసంగమేదులకు ? ఓహో !

మ॥ ఇఁగనే మీతఁడు క్రొత్తఁగా వెలసినాఁడే! వీఁడు డిమ్మేదిరిన్?
భగవంతుండగు జామదగ్న్యుతలలోనం దూటిపోఁ గల్గువాఁ
డగునేకా! భువనైక పావనశరణ్యశ్లోకులౌ తండ్రిగా
రి గరిష్ఠత్వమునే గణింపఁ డఁటె! యేరిం జీరికిం గైకొనున్? ॥

లవ — కుమారా! ఆరఘునాథుల గరిష్ఠత్వముంగూర్చి యెఱుంగని వాఁడెవ్వఁడు? ఆవిషయమై కొంత వక్కాణింప వలసినదియుఁ గలదు. అయినను ఎందులకు?

ఉ॥ ఆనృపు లెంతయైనను మహాత్ములు, పెద్దలు, గాన వారినే
మే ననరాదు, తాటకను నిట్టెవధించిన యట్టిసద్యశ
శ్శ్రీసిధు,లాఖరాజిని బిఱిందికి మూఁడడుగుల్ గమించి, రా
వానరు వాలిఁ గూల్చిన పరిభావము లోకమెఱుంగునేకదా!

చంద్ర — ఔరా! అతిక్రాంతమర్యాదుఁడవై తండ్రిగారినిగూడ నధిక్షేపించుచున్నావుగా? ఇఁకమాటలతోఁ బనిలేదు.

లవ — అవును పోరాటమునకుఁ దగిన చోటికిఁబోదము రమ్ము.

(ఇరువురును దర్పముతో నిష్క్రమింతురు.)

(సుమంత్రుఁడు రథముతో వెంటఁబోవును)

(ఇది సప్తమాంకము.)

శ్రీరామచంద్రపరబ్రహ్మణేనమః

ఉత్తర రాఘవము

అష్టమాంకము.

(ఆకసమున)

శా॥ ఓహో! వీరకిశోరులార! భువనాత్యుగ్రింబు లీమీరణో
త్సాహంబుల్ విరమింపుఁ డింక భవదస్త్రజ్వాలికామాలికా
దాహభ్రాంతములై స్ఫులింగముల చందంబయ్యె మింటన్ గ్రహ
వ్యూహంబుల్; రవిబింబమ్ముగ్రసమరంబు ల్లోకము ల్గాల్పవే!

లవు—అహో! ఏమీ యీమేఘనిర్ఘోషము!

సుమం—కుమారా? చంద్రకేతూ! శంబూకవధార్థమై యేగిన రఘు
నాథుఁ డీమార్గమున వచ్చుచున్నట్లున్నాఁడు.

(పిమ్మటఁ బుష్పకముపై శ్రీరామచంద్రుఁడు ప్రవేశించును)

రామ—

శా॥ రారమ్మోయి కుమార, శూరకులచంద్రా, చంద్రకేతూ! ప్రియం
బారన్ గ్రుచ్చికవుంగలింపు నను వత్సా! సారకర్పూరనీ
హారాసారసుధాభిషేకముల చాయన్ జల్లనౌ నీతను
స్వైరస్పర్శము చేత మామకమనస్తాపంబు చల్లాఱుతన్॥

వత్సా! దివ్యాస్త్రధరదేహునకు నీకుఁ గుశలమే కదా?

చంద్ర—జనకా! అత్యద్భుతరణవ్యాపారుఁడును ప్రియదర్శనుండునునగు
నీలవుని చెలికారముచేఁ గుశలము. అవధరింపుఁడు ఈవీరప్రకాండుని
నాయనగారు నన్నుఁగాఁగాని అంతకుమించిన ప్రేమతోఁ గాని
లాలింపవలయునని నాపిన్నపము.

లవు—(స్వగతము) ఈమహానుభావుఁడు నన్నుగూడఁ గౌఁగిలించుకొనిన బాగుండును.

రాము— (లవుని నిరూపించి) సంతోషము నీచెలికాఁ డతిగంభీరాకారుఁడు సుమా అహో!

చం॥ మనుప సమస్తలోకములకై ధరియించిన యత్త్రివేదమో!
తనుప సజాండమెల్లఁ దనుధారణఁ జేసిన క్షాత్రతేజమో!
గనియయినట్టి శక్తులనికాయమొ! కాయమొ సద్గుణాళికిన్!
కనులకు లక్ష్యమై తగు జగచ్ఛ్రయపుణ్యఫలైకరాశియో!

లవు— (స్వగతము) అహో! ఈమహాపురుషుఁడు పుణ్యానుభావదర్శనుఁడు గదా. ఈరూపము పరిక్లృప్తమైన ధర్మమునకు ఫలానురూపముగ నున్నది. భక్తిస్నేహ వైరాగ్యంబుల కేకాశ్రియం బీమూర్తియే, అహహో ఏమిది!

శా॥ వైరంబెల్ల నశించె, శాంతరస ముద్భాసించె, దోర్గర్వవి
స్తారం బస్తమయంబుగాంచె, వినయస్వాంతంబు నన్వొంచె, న
య్యారే! యీపురుషాగ్రణిం గనఁ దదేకాయత్తమయ్యె న్మనం,
బౌరా! పుణ్యులు తీర్థముల్ బలె నమూల్యశ్రీప్రభావోన్నతుల్॥

రాము— (స్వగతము) ఏమిది, ఈతఁ డొక్కమాఱుగ నాకు దుఃఖశాంతి గావించుచున్నాఁడు. మఱి యేనిమిత్తముచేతనో కాని నాయంతరాత్మను ప్రేమార్ద్రము గావించుచున్నాఁడు. అయినను స్నేహమునకు నిమిత్తమేమి?

గీ॥ వస్తువులఁ గూర్చు నంతరుపాధి యేదొ;
బహిరుపాధులచేత నేర్పడదు ప్రేమ
పొద్దుపొడువంగనే తమ్మిమొగ్గ విచ్చుఁ,
గలువ చెలికానిఁ గని చంద్రశిల కఱఁగు॥

లవు—చంద్రకేతూ! ఏ రెవరు?

చంద్రి—ప్రియవయస్యా! మా నాయనగారే కదా.

లవు—"ప్రియవయస్యా" అని పిలిచితివిగాన నాకును వీ రావలయునవారే, కాని, మహానుభావులగు రామాయణకథాపురుషులు నల్వురును నీకేమగునవారే కదా. అందు వీరెవ్వరో చెప్పుము.

చంద్రి—పెద్దనాయనగారే వీరు.

లవు—(ఉల్లాసముతో) ఏమీ రఘునాథుండే కా, సంతోషము. మహానుభావుని దర్శించితిని. నేడు సుప్రభాతము, (వినయకౌతుకములతోఁ, బరికించి) నాయనా! ప్రాచేతసాంతేవాసి లవుఁడు నమస్కరించుచున్నాఁడు.

రాము—ఆయుష్మంతుఁడా! రా రమ్ము, (ప్రేమతోఁ గౌఁగిలించి) ఓయి కుమారా! జంకేటికి? అతివినయము వలదు, పెక్కుసారులు నన్ను గట్టిగాఁ గౌఁగలించుకొనుము.

గీ॥ పాకమై విచ్చు తమ్మి లోఁ జేకువ్రాలె
లలితమై నున్ననై మాంసలంబు నైన
నీదు మైతాఁకు నాకు నా మోదమియ్యెఁ
జలువవెన్నెలతోఁ గంద మలఁదులీల॥

లవు—(స్వగతము) వీరికి నాపై నింతటి నిర్హేతుకప్రేమము. అజ్ఞానమున వీరికే నేను మహాపచారముగావించితిని. కత్తిగట్టినంతటి దురుద్యోగమువరకు నేనే దొరకొంటిని. (ప్రకాశముగా) ఈలవుని యజ్ఞానమును నాయనగారు క్షమింపవలయును.

రాము—వత్సా! నీవు చేసిన యపరాధమేమున్నది?

చంద్రి—ఏమియు లేదు. అశ్వరక్షకులు ప్రకటించిన నాయనగారి ప్రతాపోత్కర్షమును విని, యించుక విక్రమించినాఁడు.

రాము—బాలకా! క్షాత్రమున కిది యలంకారమే కాదఁటోయీ?

శా॥ తేజశ్శాలి సహింపఁ డెన్నఁడు పరోత్తేజం బదే వానికిన్
నైజంబై, కొని తెచ్చికోని కళగానన్ జాల శోభించు; వి
భ్రాజద్దీప్తుల వేఁడి వేలుపు జ్వలింపన్ సూర్యకాంతంబు స్వో
త్తేజంబున్ వెలిఁగ్రక్కుఁ దాను బరిభూతింగన్న చందంబునన్ ॥

చంద్ర--సౌజన్యమెట్లో పరాక్రమముగూడ నట్లే యీవీరునియందు శోభించును. చూడుఁడు ఈతఁడు ప్రయోగించిన జృంభకాస్త్రములతో మన సైన్యములు కదలమెదల నేరక యెట్లుపడియున్నవో,

రాము--వత్సా, లవా! అస్త్ర ముపసంహరింపుము, చంద్రకేతూ! నీవును నీబలంబుల నోదార్పుము.

లవు-నాయనగారియాజ్ఞ ననుసరించెదను (ధ్యానము నటించుచున్నాఁడు.)

చంద్ర--చిత్తము (నిష్క్రమించును)

లవు--అస్త్రము శాంతించినది.

రాము--వత్సా! బ్రహ్మాదులయిన తొల్లింటి మహానుభావు లనేకసహస్ర వర్షంబులు తపించి, నిజతపోమయ తేజోవిరాజమానములగు నీయస్త్రరాజములను సృష్టించిరి. అట్టి యీమంత్రపారాయణోపనిషత్తును భగవానుఁడగు కృశాశ్వుఁడు తనకు వేనవేలు వర్షంబులు శుశ్రూషగావించిన యంతేవాసియగు విశ్వామిత్రున కొసంగె. ఆమహానుభావుఁడు నాకుమాత్ర మనుగ్రహించె. ఇది వీని సంప్రదాయము. మఱి నీ కేసంప్రదాయమున సిద్ధించినవి?

లవు--మాయుభయులకును, నీయస్త్రములు పుట్టువుతోనే సిద్ధించినవి.

రాము--(ఆలోచించి తనలో) ఏమో కాఁగూడదా! ఇది ప్రకృష్టమగు పుణ్యాపరిపాకముచే లభించిన మహాప్రభావము కాఁబోలు! (ప్రకాశముగా) కాని ఉభయార్థక మేమి?

లవు--మే మిరువుర మన్నదమ్ములము, కవలము.

రాము — అట్లయిన రెండవవాఁ డెవ్వఁడు ?

(నేపథ్యమున) భాండాయనా, భాండాయనా !

శా॥ భూమీపాలుర సైన్యకోటికినిఁ దమ్ముంగుఱ్ఱికుర్ యుద్ధమాం
చేమో యంటివి, మిత్రమా, యది నిజంబే చెప్పు మీనాఁటితో
నే ముల్లోకములం దధీశ్వరపదం బే మాయమాఁగాత ను
ద్దామక్షత్రజనాస్త్రశస్త్రముల మంటల్ నేఁడు చల్లాఱుతన్ ॥

రాము — ఓహో ! ఎవఁడీతఁడు ధ్వనిమాత్రముచేతనే నాయొడలు పులకరింపఁ జేయుచున్నాఁడు. ఆతఁడే కాఁబోలు ! నిర్ఘోషమునకుఁ దగినట్లే శరీరముగూడ నీలమేఘశ్యామలమనోహరముగా నున్నది.

లవు — ఆయనయే నా అన్నగారు కుశుఁడు.

రాము — వత్సా ! యిచ్చటి కొకమాఱు రమ్మందువా ?

లవు — ఆలాగుననే.

కుశు — (ప్రవేశించి అద్భుత హర్షధైర్యములతో ధనువాస్ఫాలించుచు)

మ॥ తొలి వైవస్వతునుండి యేమనుకులేంద్రుల్ శక్రరక్షార్థమై
ఖలరక్షోవనముల్ దహించిరి నిజక్షాత్త్రాగ్నులం దామహా
త్ములతోనే రణమేని ధన్యుఁడిది మత్కోదండ, మోహో ! ప్రచం
డిలబాణస్ఫురదుగ్రదీధితి శిఖానీరాజిత జ్యాంకమై।

(అని వికటముగఁ బరిక్రమించును.)

రాము — (కుశుఁ గాంచి) అహహా ! ఈక్షత్రియబాలకుని పౌరుషాతిరేక మేమీ !

చ॥ కటకుమెఱుంగుచూపు త్రిజగంబుల సత్త్వబలంబులన్ తృణీ
కరణ మొనర్ప, ధారుణిదిగంబడు నాఁబడు ధీరయానము
ద్ధురముగ, బాలుఁడయ్యు గిరితో సరితోడగు గౌరవంబునన్
దురదురవచ్చు వీఁడాడలితో నదుపీరమొ లేక దర్పమో ?

లవు--(కుశుని సమీపించి) ఆర్యా! జయము.

కుశ--తమ్ముఁడా! ఏమోయుద్ధమనుచున్నావేమిటోయీ?

లవు-- అదియెంతపాటిగాని, గఱువతనంబుమాని పెద్దయెడలఁ దాము వినయముననే వర్తింపవలయు.

కుశు--అదేల?

లవు--మహానుభావుఁడా రఘునాథుఁడే ఈయన. మనయందుస్నేహభావ చే వహించియున్నాఁడు. వివాసమావేశమునకు వేఁడుక పడుచున్నాఁడు.

కుశు--(ఊహించుకొని) ఏమీ రామాయణకథానాయకుఁడగు బ్రహ్మాండ నాయకుఁడా యీతఁడు?

లవు--అవును.

కుశు--ఆమహానుభావుని పుణ్యదర్శనము ప్రార్థనీయముకదా కాని మనము వారిసన్నిధానమున కేవిధముగఁ బోవలయునో?

లవు--గురుసన్నిధికింబోలె నుపచారపూర్వకముగనే.

కుశు--ఓయీ! అదెట్లు?

లవు--ఊర్మిళాదేవికొడుకు చంద్రకేతుఁడీతఁడు; ఉదారగుణసంపన్నుఁడు సజ్జనుఁడు నన్నుఁ బ్రియవయస్యునిగా నెంచి నెయ్యమున గారవించు చున్నాఁడు. కావున, ఆతనివరుసచే ధర్మానుసరణమున మనకుఁగూడ నీరాజర్షి నాయనగారేకదా.

కుశు..అట్లేకాని రాజన్యునియందైననువినయానుసరణముదోషముకాదు.

లవు--ఆర్యా! ఈమహాపురుషునిఁజూడుఁడు. గంభీరమైన వీరి యాకార ప్రభావము లోకాతీతములగు వీరిసచ్చరితాతిశయములకుఁ దార్ఖాణముగలేదా?

కుశు--(పరికించి)

శా॥ ఔరా, ప్రేమరసాత్మకంబయిన యీయాకారమేమీ! త్రిలో
కారాధ్యంబిది; యీప్రసాదగుణమాహా! యేమనం, బావనం

బీరాజర్షిమహానుభావ; మీకనేమీ పాత్రమందే బలే!
శ్రీరామాయణకావ్యకర్త ప్రకటించెన్ స్వీయవాగ్దేవతన్॥

తండ్రీ? ప్రాచేతసాంతేవాసి కుశుఁడిదే నమస్కరించుచున్నాఁడు.

రాము—ఆయుష్మంతుఁడా, రా రమ్ము;

గీ॥ సజలజలదమనోహరశ్యామమగుచు
స్నిగ్ధమై ముద్దుగారెడు నీదుమేను
గాఢవాత్సల్యమున బిగ్గఁగౌఁగిలింప
నాకు మనసయ్యె రాఁగదోయీ కుమార!

(కౌఁగిలించి తనలో) ఈబాలకుఁడెవ్వరి సంతానమో కాని,

శా॥ అంతర్నాడికలందు దొఱుంగునిజదేహ స్నేహసారంబొ, దృ
ష్టాంతాకారతఁ బైకి నేర్పడిన దివ్యచ్చేతనాధాతువో,
భ్రాంతానందముచేతఁ బొంగుహృదయస్రావంబొ, నాదేహమా
ద్యంతం బీతఁడు ముంచెఁ గౌఁగిట సుధాయాదోనిధానంబునన్॥

లవు—జనకా! పట్టపగలింటిభానుఁడు నెన్నొసటిం దపించుచున్నాఁడు. ముహూర్తమాత్ర మీమద్దిచెట్టునీడం గూర్చుందుముగాక.

రాము—వత్సా! నీయిష్టమే కావింతు. (అందఱు పరిక్రమించి కూర్చుందురు.)

రాము—(తనలో) ఈ కుశలవుల జన్మవృత్తాంతము దేదోరహస్యముండి తీరవలయును. ఈబాలకుల వినయప్రవర్తనమునందు నయితము, నడుచుట, నిలుచుండుట, కూర్చుండుట మున్నగు స్వభావములలోఁ బ్రాజ్యములగు సామ్రాజ్యలక్షణములే గోచరించుచున్నయవి. ఇవి ప్రయత్నముతో నలవరించుకొన్నవిగాఁ గన్పించుట లేదు. నిర్మలి నంబులగు జాతిరతనంబులయందు నిగనిగలాడు మయూఖమాలి కలపోలిక, వికచారవిందములయందు మాకరందబిందువుల చంద మునఁ, బ్రతిజనమనోహరములగు వీరి దేహములయందు సహజలక్ష్మీ విలాసములే తాండవించుచున్నవి. అయ్యో! నా పాడుహృదయ

మింకను నిర్ణయింప నేరకున్నది గాని ఈ శిశుద్వయమునందు రఘు
కుమారుల చందములెన్ని ప్రతిబింబించుటలేదు ?

సీ॥ తరుణకపోత కంఠచ్ఛాయతో రాయు
మెఱుఁగారు నిద్దంపు మేనిచాయ
ఘనవృషస్కంధంబు నెనయు మూఁపులతోడ
సమ పరిపీన గాత్రముల సౌరు
ధీర ప్రశాంత గంభీర నిశ్చలమైన
కొదమసింగంపు మేలుమటుఁ జూపు
కణకణలాడు మంగళమృదంగధ్వనిం
దలపించు కంచు కంఠస్వరంబు
గీ॥ వెలయు వీరికి రఘుకుమారులకుఁబోలె
సూక్ష్మతరముగఁ బరికించి చూచుకొలఁది
జానకీలీల లెన్నియో కాన నగుచు
కనులలో నాడుచున్నది కాంతమోము॥

హా! హృదయమా! ఇంకను సందేహించెదవేల, జానకీ
వదనారవిందమే యీకనలమోములం దుట్టిపడుచున్నది ? చూడు,

గీ॥ ఆణిముత్యాల పలుకాంతి నందగించు
ముద్దుమోవి యదే; కర్ణములును నవియె;
రక్తనీలంబులయ్యు నేత్రములలోని
సహజ సౌభాగ్య గుణవిలాసంబు లవియె॥

ఇదిగో వాల్మీకి నివసించునట్టి యరణ్యము. ఇక్కడనే కదా
జానకి పరిత్యజింపఁబడినది. బాలకుల రూపలీలాదికములా సరిపోవు
చున్నవి. ఇఁక "అస్త్రములు స్వతస్సిద్ధము"లను విషయమేదో దానిని
గదా విమర్శింపవలయు. ఆనాఁడు చిత్రసందర్శన సందర్భమునం
దీయస్త్రములఁగూర్చి నా చేసిన వరప్రదానమే ఫలించినదేమో? సంప్ర
దాయశూన్యముగఁ దొల్లింటి మహానుభావులకైనను నీ యస్త్రములు

లభించినట్లు నేను వినలేదు. ఈ యానందాతిశయమే సందేహములచే నాందోళించు నాడెందమును నమ్మించుచున్నది. ఇదియుంగాక, దేవేరి గర్భభారము రెండు పాయలుగా నేర్పడియుండుటను నేనెన్నిమాఱులో జూచితిని. పోనీ యేదేని యుపాయముచే వీరి నడుగుదునా ?

లవు—జనకా ? ఏమిది జగన్మంగళంబగు మీ వదనారవిందము బాష్పవర్షముచేఁ దోఁగుచున్నది; ఎందులకు ?

కుశు—వత్సా ! ఎందులకని యడిగెద వేమి ?

మ॥ అనుఁగుంజానకి లేని రాములకుఁ గాదా దుఃఖమేదేనిఁ, గాం
తనెడంబాయఁ బ్రపంచమంతయు నరణ్యంబే కదా ? యంత య
త్యనురాగంబెటొ యీవియోగమటులే యయ్యెం దురంతం బికే
మన; రామాయణమే యెఱుంగనటు వత్సా, యిట్లు ప్రశ్నింతువే?

రాము—(స్వగతము) అహాహా ! వీరి ప్రసంగము తటస్థముగానున్నది. వలదు. ఇంకఁ బ్రశ్నించి మాత్ర మేమిప్రయోజనము. ఓ పాడు హృదయమా ? ఆకస్మికచంచలవికారముతో నేల పరువులెత్తితివి ? పట్టఁజాలని దుఃఖముచే బయటఁబడిపోయి పసివాండ్రు సైతము జాలిపడునంతటి చేలవైపోయితివి. కానీ, ఈ వికారము కప్పిపుచ్చెదఁగాక. (ప్రకాశముగా) బాలకులారా ! రామాయణ మఁట, అందు సూర్యవంశ సంకీర్తనము గలదఁట వాల్మీకిభగవానుని సరస్వతీనిష్యందమఁట! అందొక్కింత వినఁ గుతూహలమగుచున్నది, చదివెదరా ?

కుశు—అవును ఆగ్రంథమును మేము శ్రద్ధతోఁ బఠించితిమి. అడిగిన వెంటనే, బాలచరిత్రాంతిమాధ్యాయములోని యీ రెండు శ్లోకములుఁ స్ఫురించినవి. ఆకర్ణింతురుగాక,

శ్లో॥ ప్రియాతు సీతా రామస్య । దారాః పితృకృతా ఇతి
గుణా ద్రూపగుణాచ్చాపి । ప్రీతి ర్భూయో వ్యవర్ధత॥

లవు—తండ్రీ ! రెండవశ్లోకము నేను చదువుదునా ?

రాము—నాయనా ? ఏదీ పఠింపుము.

శ్లో॥ యత్రైవ రామస్సీతాయాః । ప్రాణేభ్యోపి ప్రియో భవత్
హృదయన్త్వేవజానాతి । ప్రీతిరాగం పరస్పరమ్॥

రాము—(స్వగతము) హా! హా! కష్టము. ఇది యతిఘోరముగ హృదయమర్మమును బెల్లగించుచున్నది. హా దేవీ! అప్పుడీ ప్రకారమున నేకదా మనకు జరిగినది. అట్టి యీ సంసారవృత్తాంతములే నాఁటికంతము లేని విపర్యాసపరంపరలతో విప్రలంభాంతములుగాఁ బరిణమించి హృదయమును దహించుచున్న వే!

సీ॥ పరమవిశ్వాసభావములచే మితిలేని
నాఁటి యానంద సందర్భమేడ
అన్యోన్యనర్మ లీలానుకూల విధాన
నానా విలాస యత్నంబులేడ
తనివోని కూర్మి మంతనపు ముచ్చటలకై
యొదవు కౌతుక రసాభ్యుదయమేడ
ఖేదమోదముల నేకీభావము వహించి
పెనఁగొన్న మనసు పొంతనము లేడ
గీ॥ అంతయు నదేదొ స్వప్నవృత్తాంతమట్లు
ముగిసి దుస్స్మరణీయమై పోయెఁగాని
పాడు ప్రాణంబు లేటికో పాసిపోక
ప్రాకులాడుచు నున్న వీపాపిబొంది॥

హా! హా! దుస్స్మరణీయమైన యాకాలమే యిప్పుడు స్మరింపనయ్యెనా? అయ్యో ఆముచ్చటలెక్కడ? మొదట నే హృదయమునఁ బెనఁగొన్న గాఢానురాగముచేతఁ గాఁబోలు, కాఁపురమునకు వచ్చిన కొలఁదికాలముననే జానకి యెంతయో కలుపుఁగోలుతనంబున నామనంబలరింప నేర్చినది;

సీ॥ మెఱుఁగుఁ జెక్కిళ్ళపైఁ జిఱుగుంట లేర్పడ
మొలకనవ్వుల ముద్దు గులుక నేర్చె
పనియేదొ కల్పించికొని జంటబాయక
వెడ వెడఁ జనవు లర్పింప నేర్చె

తలఁపు వెల్లదనంబు దెలిసి యూఱటగ నా
  రింపఁ బల్కుల ముచ్చటింప నేర్చి
కైసేతమై కొల్వుకడ కేఁగుచో సైఁగ
  యిడి పిల్చి ముద్దు లాదీయ నేర్చి
గీ॥ తనువుపై గోలతనము డెందమునఁ గొంత
ప్రౌఢతనముగ మెలఁగ నప్పొలఁతి నేర్చి
దినమునకు మేన నొకవన్నె తేజరిల్లఁ
బ్రాయపుందీవ తొలిపూఁతఁ బూయునపుడె।

(నేపథ్యమునఁ బెద్దకలకలము)

కుశు—వత్సా! ఆ కలకలమేమో చూచిరమ్ము.

(కొందఱు వటువులు పరువెత్తి వత్తురు)

వటు—కుమారులారా! మీకును, రాజపుత్రి సైన్యములకును ఘోర యుద్ధము జరుగుచున్నది. మన మునిపల్లె యాబాలగోపాలము కలగుండువడి పరువెత్తికొని వచ్చుచున్నది. అందులో మన గురువుగారగు వాల్మీకులును వసిష్ఠులును మఱి మిథిలాపతియగు వృద్ధరాజర్షియు, అరుంధతీ సహితులై కౌసల్యాదులగు దశరథుని పట్టపుదేవులును బయలుదేఱి ముసలితనముచే నడువలేక పడుచు లేచుచు వచ్చుచున్నారు.

రాము—ఏమీ! పూజ్యులగు నరుంధతీ వసిష్ఠులును నమ్మలును, మామగారుగూడ నిక్కడనేయున్నారా? అయ్యో! వీరందఱి నే నేమొగమునఁజూతును. హా హా మందభాగ్యుఁడను, జనకరాజర్షి గూడ నిచ్చటికేవచ్చినాఁడని పిడుగువంటివార్తవింటినే! కాని, (ప్రకాశముగా) కుమారులారా! మనమే త్వరగా వారలఁగలిసికొందము రండు.

(అందఱు నిష్క్రమింతురు)

ఇది అష్టమాంకము.

శ్రీరామచంద్ర పరబ్రహ్మణేనమః

ఉత్తర రాఘవము

—— నవమాంకము. ——

(ప్రవేశము :— లక్ష్మణుఁడు.)

ఓహో! ఇప్పుడు వాల్మీకిభగవానుఁడు బ్రహ్మక్షత్ర పౌరజా
పదులగు ప్రజలతోఁబాటు మమ్ముఁగూడ నాహ్వానముగావించి, స్వప్రభా
వముచే దేవాసురతిర్యగ్నరగమానవనికాయ్యంబగు చరాచరభూత
పంచమును నెక్కడెుక సమావేశపఱచినాఁడు. నాకును అన్న
రాజ్ఞాపించిరికదా "వత్సా! తన నాటకమప్సరస్త్రీలాడుచుండఁగా జ
చుటకు వాల్మీకిభగవానుఁడు మనల నాహ్వానముగావించెఁ గావున భా
రథీ తీరమందలి యొక మనోజ్ఞస్థానమున సమాజ సన్నివేశము గాఁ
పుము" అని; ఆలాగే నేనును మర్యాదా వ్యవిశిష్టములగు భూతసంఘాత
నకు నుచితస్థానంబులఁగల్పించితిని. ఇదిగో ఆర్యుఁడును దయచేయు
న్నాఁడు. ప్రాజ్యమగు రాజ్యశ్రీమహిమనందుండియు దుష్కరమ
తాపసవ్రతమునే యవలంబించుచున్న యన్నగారు వాల్మీకిభగవాన
యందలి గౌరవముచేతనే యిక్కడికే తెంచుచున్నారు.

(పిమ్మట రాముఁడు ప్రవేశించును.)

రాము—వత్సా! లక్ష్మణా! రంగప్రేక్షకులు వచ్చినారా?

లక్ష్మ—వచ్చినారు.

రాము—ఈ కుశలవకుమారుల కిరువురకును జంద్రకేతునితో సమా
నమగు స్థానమర్యాద నేర్పఱపుము.

లక్ష్మ—ప్రభుస్నేహము గుర్తించి యట్లే చేసితిని. ఇదియే రాజాసనః
పఱపించితిని. ఆర్యుఁ డలంకరించుఁగాక. (రాముఁడు కూర్చుండును

లక్ష్మ—ఓయీ! ఇఁక నారంభింపుఁడు.

సూత్రధారుఁడు—(ప్రవేశించి) భూతార్థవాదియగు వాల్మీకిభగవానుఁడు, జంగమస్థావర విశిష్టంబగు లోకంబున కిట్లని యాజ్ఞాపించుచున్నాఁడు. "ఆర్ష నేత్రముతో నుపలక్షించి, పావనంబును కరుణాద్భుతరసబంధు రమునుగా మేము నిబంధించిన యీప్రబంధమును, గౌరవగౌరవ ముచే నవధరింతురుగాక" అని.

రాము—ఇట్లని వేఱే చెప్పనక్కఱలేదు. మహర్షులు సమస్తధర్మములను బ్రతీక్షించినవారు. అమృతసారంబులై, పరోరజసంబులగు వారి ప్రజ్ఞానంబులకు నన్యథాత్వం బెన్నండును సంభవింపదు. కావున నట్టివానియెడ సంశయింపనే కూడదు.

(నేపథ్యమున) హా! ఆర్యపుత్రా! హా! కుమారలక్ష్మణా! ఏకాకినిగా నీ మందభాగ్యురాలినిఁ గీకారణ్యమున దిక్కులేనిదానిగా విడిచిపెట్టితిరే! ఆసన్నప్రసవవేదనతో నల్లాడు నన్ను గంగకే యొప్ప గింపనెంచితిరా?

లక్ష్మ—(స్వగతము) అయ్యో! ఇదేదో విపరీతమైనదే!

సూత్ర—

గీ॥ దేవి! వైదేహి విశ్వధాత్రీతనూజ విభునిచేఁ గాఱుఁగానలవిడువఁబడియె
పతివియోగార్తి చేనామెప్రసవబాధనోపఁజాలకగంగలోనుఱుకఁబోయె.

(నిష్క్రమించును.)

రాము—హా! హా! దేవీ జానకీ! సాహసింపకుము, సాహసింపకుము. వత్సా, లక్ష్మణా! రక్షింపుము. రక్షింపుము.

లక్ష్మ—ఆర్యా! యిది నాటకము.

రాము—హా! దేవీ, దండకారణ్యావాస ప్రియసఖి! నీకీ దైవదుర్విపాక మంతయు నీ రామహతకునివలనఁ గదా.

లక్ష్మ—ఆర్యా, ప్రబంధార్థమును దిలకింపుఁడు.

రాము--ఇదే వజ్రిమయుఁడను సిద్ధముగానే యున్నాను.

(అంతటఁ దొడపై నొక్కొక్కబాలకునుంచికొన్న పృథ్వీ, భ
రథులచే నవలంబింపఁబడిన సీత ప్రవేశించును.)

రాము--వత్సా! సౌమిత్రీ, యేమో నిర్ణయింపరాని మోహాంధక
మునఁబడిపోవుచున్నాను సుమా, నాచేయి పట్టుకొమ్ము.

పృథ్వీ, భాగీరథులు ___

గీ॥ ఊఱడిలుమమ్మ కల్యాణి, యూఱడిల్లు మమ్మ వైదేహి, నీయదృష్టమ్ము పం
రఘుకులమునింపు మేటిపుత్రకులఁగవలకడుపుచల్లంగఁగంటివిగాకుమా

సీత--(చూచి) ఆహా! ఇద్దఱుకొమరులఁగంటినా? ఏరీ (పిల్లలనంటికొ
హా! ఆర్యపుత్రా, (మూర్ఛిల్లును)

లక్ష్మ--(రాముపాదములపైఁబడి) ఆర్యా! అదృష్టవంతులము, బ్రదికితి
రఘువంశమునకుఁ గల్యాణాంకురము లుదయించినవి. (రాముంజూ
హా, హా! ఏమిది! కన్నీటిమున్నిటంబడి, పరవశుఁడై యార్యుఁ
మూర్ఛిల్లెఁగదా, (విసరుచున్నాఁడు)

పృథ్వి--బిడ్డా, ఊఱడిల్లుము, ఊఱడిల్లుము.

సీత--భగవతులారా, మీ రెవ్వరు?

పృథ్వి--వత్సా! ఈమె యిక్ష్వాకుకులదేవత భాగీరథి.

సీత--భగవతీ! నీకు నమస్కారము.

భాగీ--చారిత్రమున కనురూపమైన కల్యాణపరంపరలం బొందుము.

లక్ష్మ--అమ్మా! అనుగ్రహింపఁబడితిమి.

భాగీ--వత్సా, ఈయమ నీతల్లి వసుంధర.

సీత--హా! అమ్మా, ఇట్టియవస్థలోనున్న నన్ను జూచుచున్నావా?

పృథ్వి--రావే నాతల్లీ, రమ్ము. (సీతను గౌఁగిలించి మూర్ఛిల్లును

లక్ష్మ--అమ్మయ్య! ఆర్య పృథ్వీభాగీరథులచే ననుగ్రహింపఁబడినది.

రాము--(చూచి) ఇది మఱింత కరుణాస్పదముగానున్నది.

భాగీ--విశ్వంభరయు దుఃఖించుచున్నదే! కన్నకడుపుకదా, దీని కొంతటివారైన లోఁగిపోవలసినదే. చైతన్యవంతులకెల్ల నీసంసారతంతు వంతరంగమున మోహాగ్రింథితోఁ దెగిపోకుండ నుండునదేకదా. వత్సా! వైదేహీ; దేవి భూతధాత్రి; ఊఱడిల్లుఁడు, ఊఱడిల్లుఁడు.

పృధ్వీ--భాగీరథీదేవి! ఈ సీతనుజూచి నే నూఱడిల్లుటయెట్లు?

మ॥ కలకాలంబిటుబిడ్డ కాఁపురమయో! కష్టాలకోసే చనన్
వలెనా! యింతసుఖంబుమాటఁ గలనైనంగాన దాలంకలో
పల రాకాసిచెఱం జిరంబునికి దప్పన్ వెండి, సౌరాడు పాఁ
ద్దులతో నీగతి సంభవించె నెటులోర్తుం జూచి యీ కానుపున్॥

భాగీ--దేవీ! తెలియనిదానవుకావు గదా భవితవ్యమున కెవ్వరడ్డు పడఁగలరు?

పృధ్వీ--భాగీరథీ, నిజమే కాని రామభద్రునకిది తగినపనియా? చూడు,

మ॥ మునుబాల్యంబునఁదా గ్రహించిన కరంబున్ లెక్కసేయుండు, మ
న్నన నన్నైనగణింపఁడా జనకునైనం గానఁడా వహ్నినై
ననుగైకోఁడలసాహచర్యమతినైనం జూడఁడీ కాన్పునై
న నిదానింపఁడికేవియో తగుప్రమాణంబుల్ ధరాజానికిన్॥

సీత--హా! ఆర్యపుత్రుఁడు తలంపునకుఁ దెబ్బడియెనే!

పృధ్వీ--ఆఁ ఇంకను నీ కార్యపుత్రుఁ డెవ్వఁడే?

సీత--(సిగ్గుతోడి కన్నీటితో) అమ్మా నీ వన్నట్లే.

రాము--అమ్మా! పృధ్వీ నిజమే. ఉన్నను నేను లేనివాఁడనే.

భాగీ--భగవతీ, వసుంధరా! క్షమింపుము. ఈసంసారమునకు శరీరంబవే నీవుకదా, ఎఱుకలేనిదానివలె నల్లునిపైఁ గోపగించుకొందువేమి?

మ॥ అలమేన్ దుర్యశమెల్లలోకముల నాయగానోట; మున్ లంకలో
పలఁగావించిన శుద్ధిమాట యొకఁడున్ బాటింపఁడిచ్చోటు, నీ

యిల, లోకానుమతంబెకా కులధనం బిక్ష్వాకువంశ్యాళి కీ
కళత్రం జిక్కి-న రామభద్రునకిఁకం గర్తవ్య మేముండెడిఁ?

లక్ష్మ- దేవతల కద్దే యున్నది. నిఖిలభూతహృద యేంగితంబుల నెఱుంగ నేర్తురుకదా. అందున భాగీరథింగూర్చి చెప్పవలయునా? తల్లీ నిజమాడితివి, నీ కిదే యభివాదనము.

రాము- తల్లీ! భగీరథకుటుంబమందు నీకుఁ గలయనుగ్రహమును నిర్వర్తించితివి.

పృథ్వి- భాగీరథీ! మీయెడనిరంతరము నేను ప్రసన్నురాలనే అయినను నాబిడ్డకు సంభవించిన యీదుఃఖసంవేగమాపాతదుస్సహమైనది. రామభద్రునకుసీతపైఁగలగాఢానురాగము నేనుమాత్రమెఱుంగనా?

గీ॥ విధివశంబునఁ బ్రియురాలి విడిచి యతఁడు
దరికొని దహించుచున్న డెందంబుతోడ
నఖిలలోకో త్తరాతిధైర్యంబువలన
బ్రతికియున్నాఁడు ప్రజలసౌభాగ్యముననుॐ

సీత-(ఏడ్చుచుఁగృతాంజలియై) తల్లీ; ఈదుఃఖము భరించి నే నింక బ్రతుక లేను, నీయంగములయందు నన్ను విలయము గావింపుము.

రాము-ఇంతికంటె వేఱేమనఁ గలదు!

భాగీ-పాపముశాంతించుఁగాక. బిడ్డా, వేయివత్సరములు సౌభాగ్యవతివై జీవించియుందువు.

పృథ్వి--వత్సా! సాహసమువలదు. నీపుత్రకులనైన గాపాడుకొనవా?

సీత-- అమ్మా; అనాథనైపోయితిని. ఇంకవీరితోనేమి?

రాము-- హా! హృదయమా! వజ్రమయమైతివే!

భాగీ-- బిడ్డా, నీవు సనాథవే అనాథ వెట్లవుదువు?

సీత-- అయ్యో! మందభాగ్యురాలికి నాకు సనాథత గూడనా.

భాగీ--వత్సా, ఏల నిర్వేదము?

గీ॥ అమ్మరో, లోకకల్యాణమైన నిన్ను నీవె యీగతినేల నిందించుకొందు
నీదుసాంగత్యమునఁ జేసెనిశ్చయముగమాపవిత్రతగూడసంభావ్యమయ్యె.

లక్ష్మ--ఆర్యా! వినుము.

రాము--లోకము వినుఁగాక.

(నేపథ్యమునఁ గలకలము.)

రాము--ఇదేదో మహాశ్చర్యతరమైనదే!

సీత--ఆహా! ఏమిది అంతరిక్షమంతయుఁ బ్రజ్వలించుచున్నది!

పృ-భా--ఓహో! తెలిసినది.

గీ॥ మున్ను గ్రమముగ నల భృశాశ్వుండు, కౌశి
కుండు, రాముండు వేనికి గురువులైరి,
అవియె యావిర్భవించుచున్నవి నిశాత
మార్గణగణంబుతోడి జృంభకములెల్ల॥

(నే ప థ్య మున)

గీ॥ జానకీదేవి, యిదెనమస్కారమస్తు శరణమికమాకునీతనూజద్వయంబె
చిత్రపటమందుమమ్ముదర్శించునప్పుడల్లరఘునాథుఁడిట్లకాయానతిచ్చె.

సీత--ఆహా! ఆనందము. అస్త్రదేవతలు పరిస్ఫురించుచున్నారు.

లక్ష్మ--ఆర్యా, ఆనాఁడు వక్కాణించితిరిగదా, "సర్వథా యివి నీ సంతానము నాశ్రయింపఁగలవు" అని.

పృ-భా-- గీ॥ వందనంబో మహాస్త్ర దైవతములార,
ధన్యులము మేము మీ ప్రసాదంబు వలన
బిడ్డలెప్పుడు మిమ్ము భావింతు రపుడు
దరికి నరుదెంచు పొందు భద్రిమగు మీకు॥

లక్ష్మ--అహా! అద్భుతముగానున్నదే!

గీ॥ కలఁగెమథియించిన విధాన గాంగజలము
గగనతలమెల్ల దేవర్షి గణముగనిండె
అద్భుతంబదె! యార్యా యముగానుండి
వెడలె గంగా వసుంధరల్ వెంబడింప॥

(మ ర ల నే ప థ్య ము న)

మ॥ అరుదేవమ్మ యరుంధతీ, భువనవంద్యా మేము మందాకినీ
ధరణీదేవుల మొప్పగించెదము సీతన్ నీకుఁ బుణ్యాంగనా
భరణంబున్ బతిదేవతాతిలకముల్ వై వేహి నీ కోడలిన్
కరణీయంబుదలంచి పోషించికొనుఁడీ యీర్ నీవు వాల్మీకియున్॥

లక్ష్మ--ఆశ్చర్య మాశ్చర్యము. ఆర్యా చూడుఁడు, చూడుఁడు,

(పిమ్మట అరుంధతి, సీతయు, వాల్మీకియుఁ బ్రవేశింతురు.)

అరుంధతి-- గీ॥ త్వరపడుము వత్స, జానకీ! తలఁకు విడుము
ఆనగొనియిప్డు వెనువెన్క లాడఁదగదు
ప్రాణయహితమైన నీ కరస్పర్శచేత
రమ్ము బ్రతికింపు వేగ మా రామభద్రు॥

సీత--(తత్తఱపాటున సమీపించి రాముని స్పృశించుచు) ఆర్యపుత్రా,
ఊఱడిల్లుఁడు.

రాము--(సమాశ్వసిల్లియానందమున) ఆహా, ఏమది. (చూచి హర్షా
ద్భుతములతో) దేవియు, అరుంధతియు, ఋష్యశృంగశాంతా సమే
తులు గురువులందఱునా?

అరు--వత్సా! రామభద్రా, చూడుము. ఈ యమ భగీరథకులదేవత
యగు భాగీరథి, ఈమె నీ యత్తగారు భగవతి విశ్వంభర, నీ యెడ
ననుగ్రహించినారు.

భాగీ-పృథ్వీ-- (నేపథ్యమున) జగత్పతీ! రామభద్రా! పరిత్యాగ సమయమున మమ్ము ధ్యానించి సీతను మా కొప్పగించితివిగదా. ఆ ఋణము తీర్చికొంటిమి.

రాము-- ఏమిది మహాపరాధుఁడగు నన్ను భగవతు లిరువురు ననుగ్రహించినారు!

అరుం--ఓహో! పౌరజానపదులారా! ఈవిధముగా నీమె పూజ్యులగుమందాకినీవసుంధరాదేవతలచేఁ బ్రస్తుతింపఁబడి, వాల్మీకి మానీంద్రుచేఁ బరామర్శింపఁబడి యరుంధతినగు నాకు నొప్పగింపఁబడుటయే కాక, పూర్వుఁడు భగవానుఁడగు వీతిహోత్రునిచే బ్రహ్మాదిదేవతలెల్ల నభినందింపఁ బవిత్రచారిత్రయని నిర్ణయింపఁబడినది. అట్టి సూర్యవంశపుంగోడలగు దేవయజనసంభూతను నీసీతను రామభద్రుఁడు మరలఁ బరిగ్రహించుటకు మీయభిప్రాయమేమి?

(నేపథ్యమున) ఇంతకంటె జగదానందమేమున్నది? అవశ్యము పరిగ్రహించుఁగాక!

లక్ష్మ--ఆహా! ఎంతటి సుదినమిది!

[ఈవిధముగాఁ బూజ్యురాలగు నరుంధతీదేవి హెచ్చరించిన తోడనే పౌరజానపదులెల్లరును సమస్తభూతగ్రామంబును జానకీదేవికి నమస్కరించుచున్నారు. దిక్పాలురును సప్తర్షులును గుసుమవర్షముల నభిషేకించుచున్నారు.]

వాల్మీ--జగత్పతీ! రామభద్రా?

మ॥ క్రతురాజంబు యథావిధిన్ జరుగు లోకశ్లాఘ్యమై కాంచన
ప్రతిమాస్థానమునందు నిల్పికొను మప్పా! నిక్కపుంజానకిన్
గృతపుణ్యన్ సహధర్మచారిణిఁ బురంధ్రీరత్నమున్; బుణ్యదం
పతులన్ మిమ్ములఁ గన్నులారఁగని యానందించు ముల్లోకముల్॥

రాము-- భగవానుఁ డాజ్ఞాపించినట్లు

లక్ష్మ--నేటికిఁ గృతార్థుఁడనైతిని

సీత--అమ్మయ్య, బ్రతికితిని.

లక్ష్మ—అమ్మా జానకీ! లజ్జాహీనుఁడు లక్ష్మణుఁడు నమస్కరించుచున్నాఁడు
సీత—వత్సా! ఇట్టివాఁడవుగాఁ జిరకాలము వర్ధిల్లుము!
అరుం—వాల్మీకిభగవానుఁడా! సీతాగర్భసంభూతులగు రామభద్ర
పుత్త్రకులఁ గుశలవులఁ గూడఁ దలిదండ్రుల కొప్పగింపుము.
రాము—లక్ష్మ—ఆనందము, కానిండు.
సీత—(సబాష్పాకూతముగ) ఏరీ! నాపుత్త్రకులు!
వాల్మీ—బిడ్డలారా! రండు నమస్కరింపుఁడు. ఈయన మీతండ్రి రఘుపతి
ఈతఁడు మీపినతండ్రి లక్ష్మణుఁడు. ఈమెయే మీతల్లి సీతాదేవి
ఈమహానుభావుఁడు మీమాతామహుఁడు జనకరాజర్షి.
సీత—(హర్షకరుణాద్భుతములతోఁ జూచి) ఏమి నాతండ్రియా!
కుశ—లవ—హా! తండ్రీ! హా! తల్లీ! హా మాతామహా!
రాము—(సంతసమునఁ గౌఁగిలించి) కుమారులారా! పున్నెమునలభించితి
సీత—కుమారా కుశా! రా, రమ్ము కుమారా లవా! జన్మాంత
గతను నన్నుఁ జిరకాలము గౌఁగిలించుకొండు.
కుశ—లవ—ఆహా! ధన్యుల మైతిమి.
సీత—వాల్మీకిభగవానుఁడా! నమస్కరించుచున్నాను.
వాల్మీ—బిడ్డా! చిరకాలము సౌభాగ్యవతివై వర్ధిల్లుము.
సీత—అహా! ఎంతటి సుదినమిది! నాయనయు, కులగురువులును, ఆర్యాజన
మును, సభర్తృకయగు శాంతాదేవియు సలక్ష్మణుఁడై సుప్రసన్ను
డైన యార్యపుత్త్రుఁడును గుశలవులును నొక్కమాఱుగఁ గనిపిం
చుచున్నారు. అహో! ఈమహానందమునఁ బరవశనగుచున్నాను.
వాల్మీకి—రామభద్రా! ఇఁకింకను నేమి కావలయు?

— భరతవాక్యము. —

కలుషంబుల్ దొలఁగించి యీ కథ జగత్కల్యాణమై యెల్లకో
ర్కెలఁ జేకూర్చుచుఁగాక లోకజనయిత్రీ జాహ్నవింబోలి ని
చ్చలు వాగ్బ్రహ్మకవిప్రరూఢమగు ప్రజ్ఞావాణి నీరూపకం
బిల సేవింతురుగాక రంగములయం దింపార విద్వన్మణుల్॥